UNIVERSAL LIBRARY
OU_204447
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 83.1 / A64 V · Pt. V · Accession No. T 4688

Author [illegible] · 1955

Title [illegible] · ~~1955~~ ND

This book should be returned on or before the date last marked below.

సరస్వతీ గ్రంధమండలి

# విశ్వకథావీధి

[ ఐదో సంపుటం ]

పురిపండా అప్పలస్వామి
కవితా సమితి అధ్యక్షులు

రు 1/-

పబ్లిషర్సు: అద్దేపల్లి అండ్ కొ
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

సర్వస్వామ్యములు
ప్రకాశకులవి

ఒక రూపాయి

Printed by Addepally Nageswara Rao
at Saraswathi Power Press
nd Published for Addepally & Co., Rajahmundry.

# ఐదో సంపుటం పరిచయం

స్నేహ రశ్మి: గుజరాతీ కథారచయిత. కవి. కవిత్వంలో, కథారచనలో రవీంద్రుడి మార్గ మనుసరించాడు. 'గుల్లీ' కథ ఈయన కథాసంపుటి " గాతా ఆసో పాలవ " లోది.

జాసింటో ఆక్టోవియో పికోన్ (1853-1924) 'కళ కోసమే కళ' తెగకి చెందిన స్పెయిన్ రచయిత. ఈతని శైలి లాలిత్యానికి పెట్టింది పేరు. ఇతని గ్రంథాలు 'లాజారో' (1822) లాహింంజాస్టాప్రిడెల్ అమిోర్ (సవతికూతురు ప్రేమ; 1884 పెక్వేనేసెస్ (చిన్న విషయాలు; 1891) యిదర్లైంటవి ఖండాంతర విఖ్యాతి గడించు కున్నాయి.

పెర్‌హాల్ స్ట్రోమ్ (1866) గొప్ప స్వీడను రచయిత. మానవ జీవితంలోని చీకటి కోణాలు చిత్రించడంలో సిద్ధహస్తుడు. 'విల్‌స్నపాగ్లర్' (వింత పిట్టలు; 1894) ఎన్ గమాల్‌హిస్టోరియా (పాతకథ; 1895) మొదలయిన ఇతడి గ్రంథాలు స్వీడనులోనూ, ఇతర దేశాల్లోనూ పేరుపొందాయి. స్ట్రోము, నాటకాలూ రాశాడు. కాని నవలలికీ, చిన్న కథలికీ వచ్చిన పేరు వాటికి రాలేదు. అన్నిటికంటె ఇతడి చిన్నకథలే ఇతడికి పెద్ద పేరు తెచ్చాయి.

కరేల్ కాపెక్: (1890 - 1938) జెకోస్లోవియా రచయితలలో వొక ప్రత్యేక మయిన ప్రసిద్ధ స్థానం కాపెకుది. ఆర్. యు. ఆర్ (Rossum's Universal Robots) నాటకంతో ఇతడికి ఖండాంతర ఖ్యాతి లభించింది. Prage లో విద్యార్థిగా వున్నప్పటినించీ ఇతడు రచన ప్రారంభించాడు. అనతి కాలంలో జగమెరిగిన బ్రాహ్మడయిపోయాడు. నాటకకర్తగా

ఎంత పేరు సంపాదించాడో, కథారచయితగానూ అంత పేరూ సంపాదించా డితడు.

ఇవాన్ కేంకర్ (1786–1918) యుగోస్లోవియా కథా శిల్పి. మంచికవి. పేదకుటుంబంలో పుట్టాడు. వియన్నాలో చదివాడు. రచయితగా జీవితం ప్రారంభించాడు. కథలూ, పద్యాలూ, అసంపూర్తి స్వీయచరిత్రా ప్రచురించాడు. చివరిదినాలు ఆస్ట్రియాలో గడిపాడు.

ఎడ్మండ్ జలో: సుప్రసిద్ధుడయిన ఫ్రెంచి కథకుడు. ఇతడి రచనా రీతిలో వొక విలక్షణత వ్యక్తమవుతుంది. అదే ఇతడికి ప్రసిద్ధి తెచ్చిపెట్టింది. ఆఖరు ఉత్తరం దీనికో నిదర్శనంగా చూపించవచ్చు.

---

## సూచిక

| కథ | పరిచయం | మూలం |
|---|---|---|
| గుల్లీ | స్నేహరశ్మి | (గుజరాతి) |
| కసి | జాసింటో అక్టావియో పికోన్ | (స్పెయిన్) |
| డేగ | పెర్ హాల్ స్ట్రోమ్ | (స్వీడను) |
| దొంగ | కరేల్ కాపెక్ | (జెకోస్లోవియా) |
| పిల్లలూ ముసలాళ్లూ | ఇవాన్ కేంకర్ | (యుగోస్లోవియా) |
| ఆఖరిఉత్తరం | ఎడ్మండ్ జలో | (ఫ్రెంచి) |

విశ్వవిఖ్యాత రచయితల

మరో ఆరు కథలతో ఆరో సంపుటం

త్వరలో వెలువడుతోంది

# గుల్లీ

"ఒదిలేయ్, వొదిలేయ్, టీపూ!...లేకపోతే నిన్ను బతకనివ్వను చూడు...ఆఁ!"

ఊరి బయట వొక పెద్ద మర్రిచెట్టుకింద నుంచుని వొక అమ్మాయి తన కుక్కని గదమాయిస్తోంది. బాగా మాసిపోయిన చింకిబట్ట కట్టుకుందామె. వయస్సు పదో పన్నెండో వుంటాయి.

ఆ ఉభయులికీ మరో సహాయం లేదు; మరో ఆధారమూ లేదు. కుక్కపేరు టీపూ. అమ్మాయిపేరు గుల్లీ.

టీపూ నోట్లో వొక వుడత వుంది. తప్పించుకుని బతకాలని అది గింజుకుంటూ వుంది.

గుల్లీ కుక్కని - టీపూని గదమాయిస్తోంది, వుడతని వొదిలెయ్యమని. కాని టీపూ ఆమె గదమాయింపు లక్ష్యపెట్టినట్టు లేదు. గెంతుతూ, పరిగెడుతూ వుడత ప్రాణంతో చెలగాట మాడుతోంది అది.

గుల్లీకి కోపం వచ్చింది. కింద నించి వొక రాయి తీసిందామె. టీపూ అది చూసింది.

"నువ్వు వూరికే కోప్పడుతున్నావు గుల్లీ, ... ఇది చచ్చేపోయిందీ! నా నోట్లో ఎంత భద్రంగా వుందో చూడూ!" అంటూ చెప్తున్నట్టు చూసింది కుక్క. అలా చూస్తూనే వుడతని వొదిలిపెట్టేసింది. ఉడత నడుం విరిగిపోయింది పాపం

“ఎంత చెడ్డదానివి నువ్వు, టీవూ! కొంచెమయినా జాలి లేకపోయింది నీకు! ... పాపం!—” గుల్లీ గట్టిగా అరిచింది.

ఉడత కొంచెం తెప్పరిల్లింది. ఒకటో రెండో అడుగులు ముందుకి వేసింది. టీవూ తన ముందుకాళ్లు రెండూ ముందుకి చాపింది. తన వేటని రెప్ప వెయ్యకండా చూడ్డం మొదలు పెట్టింది. ఉడతని కాపాడాలని గుల్లీ ముందుకి వచ్చిందో, ఉడత మీదికి తాను వురికేస్తుంది; అలా వుషారుగా వుంది టీవూ.

“పోతావా లేదా? ... నాకు తెలుసు, నీ ఉద్దేశమేమిటో. రాకాసి ముండా, పో ఇక్కడినించి—” కోపంతో గుల్లీ మరో రాయి తీస్తూ అంది.

రబ్బరు బంతిలా వొక్క గెంతు గెంతింది టీవూ; వుడత మీద పడింది. దాన్ని నోటితో కరుచుకుని దూరం పరిగెత్తి పోయింది.

“సరే, నాదగ్గిరికి వచ్చావంటే చూడు! పిశాచి ముండా”— రాయి విసురుతూ అంది గుల్లీ.

కాని గుల్లీ కోపం ఇవాళ టీవూ లక్ష్యపెట్టినట్లు లేదు. దూరంవెళ్లి తనవేట నిర్విచారంగా తినేసింది. తినేశాక నాలిక చాచి మూతి నాలుగుపక్కలా నాకేసి శుభ్రపరుచుకుంది. తరవాత కళ్లు మూసుకుని మెల్లిమెల్లిగా గుల్లీ దగ్గిరికి బయలు దేరింది.

గుల్లీ ఎండు రొట్టెముక్కలు తింటూ మర్రిచెట్టుకింద చాప రాతిమీద కూచుంది. టీవూ రావడం ఆమె చూడలేదు.

గుల్లీ దగ్గిరికి ఎలా వెళ్ళాలో, ఎలా ఆమెని బెల్లించాలో ముందే నిశ్చయించుకుంది టీపూ.

గుల్లీ దగ్గిరిసా వచ్చి నుంచుంది టీపూ. దాని దిక్కు కన్నెత్తి చూడనన్నా చూడలేదు గుల్లీ. ముందరికాళ్ళతో నేల బకిరింది టీపూ.

"గుల్లీ, ఓగుల్లీ! నేను వచ్చేశాను, చూడు"

గుర్రుగుర్రు మంది టీపూ.

దాని గుర్రు వింది గుల్లీ; చూసింది. కానైతే ఆమె కోపం మాత్రం తగ్గలేదింకా. తన చూపు రొట్టె ముక్కల మీదికి మళ్లించి, యథాప్రకారం తింటోం దామె.

అంతకోపం సహించ లేక పోయింది టీపూ.

"ఊఁ, ఈ చిన్న పుడతకోసం ఇంతకోపమా? పోనీ వాక దెబ్బ కొట్టెయ్యరాదూ!

టీపూ మరికొంచెం ముందుకి వచ్చింది. తన మొహం గుల్లీ దగ్గిర పెట్టి బెల్లించడం మొదలెట్టింది.

తనబలమంతా కూడగట్టుకుని దాన్ని వాక్కతోపు తోసింది గుల్లీ. తోపుతో వెనక్కి వచ్చేసింది టీపూ. కాని వెంటనే ముందుకివచ్చి ఆమెచెయ్యి నాకడం మొదలెట్టింది, ఆమె మొహం చూస్తూ.

"గుల్లీ, నీచెయ్యి నొప్పి పెట్టడంలేదుకదా!"

"బద్మాష్, సిగ్గులేదూ నీకు? పో. పో ఇక్కణ్ణించి. పాపం, ఉడత కడుపులో ఇంకా అరగనన్నా అరగలేదు, నాదగ్గిరికి

వచ్చావు బెల్లించడానికి! పాడుముండా! చండాలం . . . ”
కోపంతో గుల్లీ గొంతుకు వొణికింది. తీసిపెట్టి బలంకొద్దీ
టీపూని వొక్కతావు తన్నిందామె.

టీపూ గట్టిగా అరిచింది. దూరంగా పోయి నుంచుంది.
అలిగినట్టు అక్కడే వుండిపోయింది.

కొంచేపు గడిచింది.

గుల్లీ ఎండు రొట్టిముక్కలు తింటూనే వుంది.

టీపూ అలిగినట్టు అలా నుంచునే వుంది. కాని అది నిరాశ
మాత్రం చేసుకోలేదు. దానికి తెలుసు, నేరం తనదే. తనే గుల్లీకి
కోపం తెప్పించింది. అంచేత తానే ఎలాఅయినా ఆమెని
ప్రసన్నురాలిని చేసుకోవాలి.

చప్పున బుగ్గిలో దొర్లిపోయింది టీపూ. గట్టిగా ఏడవడం
మొదలెట్టింది.

గుల్లీ దానిదిక్కు చూసింది. టీపూ బుగ్గిలోపడి ఏడుస్తోంది.
గుల్లీకి జాలివేసింది. “పాపం, పొరపాటయిపోయింది!”
టీపూని చూస్తూ అందామె—“ టీపూ, చూడూ, మరెప్పుడూ
ఇలా చెయ్యకూడదు. తెలిసిందా? లేకపోతే ఎప్పుడూ
నీమొహం చూడనుమరి . . . రా, ఇలా రా. ”

రెండు రొట్టిముక్కలు టీపూ మీదికి విసిరింది గుల్లీ. వాటిని
లెక్క చెయ్యకండానే టీపూ గుల్లీదగ్గిరికి వచ్చేసి, ఆమె పైట
చెంగులో మొహం దాచుకుంది.

గుల్లీ నవ్వేసింది. "పిచ్చిముండా, చూడూ, మరెప్పుడూ ఇలా చెయ్యకూడదు. తెలుసా!" టీపూ తలమీది వెంట్రుకలు నిమురుతూ అం దామె.

ఆ స్నేహితులు ఇద్దరూ ఇలా మాటిమాటికీ దెబ్బలాడుకుంటూ, వొకళ్ళమీద వొకళ్లు అలుగుతూ, మళ్లీ శాంతిస్తూ, వొకళ్ల క్షమాపణ వొకళ్లు వేసుకుంటూ కలుసుకునే వాళ్లు.

టీపూ గుల్లీ— ఇద్దరూ అనాథులే. ఒకనాడు వూరిబయట స్మశానం దగ్గిర నదివొడ్డున ఇద్దరూ కలుసుకున్నారు. అవాళనించీ స్నేహితులై పోయారు. గుల్లీని వొదిలి టీపూ వొక క్షణం కూడా వుండలేదు. టీపూ లేకండా గుల్లీ నిమిషం బతకలేదు. ఇద్దరికీ అంత స్నేహం; అంత ప్రేమ.

ఆ మర్రిచెట్టుపక్కనే వుంది సత్రం. సత్రం అరుగుమీద గుల్లీ నిద్రపోతుంది, రాత్రుళ్ళు. తెల్లవార్లూ మేలుకుని కాపలాకాస్తుంది టీపూ, ఆమెపక్క. ఇలా నిరాఘాటంగా గడిచిపోతూవుండేది వాళ్ళస్నేహం.

గుల్లీ ఇప్పుడు పదమూడు పద్నాలుగేళ్ళ దయిపోయింది.

ఒకనాటిమాట - టీపూ మర్రిచెట్టుకింద నుంచుని గుల్లీకోసం ఎదురుచూస్తోంది. గుల్లీ రొట్టెముక్క లడుక్కుందికి వూళ్ళోకి వెళ్ళింది. వందలూ, వేలూ కన్నాలున్న గొంగళీ, విరిగిన వొకటి రెండు గిన్నెలూ కాపలా కాయడంకోసం టీపూని అక్కడ వుంచి వెళ్ళిం దామె.

కాని ఇంతవరకూ రాలేదు గుల్లీ. టీపూకి బాధగా వుంది. “ఇంకా ఎందుకు రాలేదూ, ఆమె? రోజూ వేగంవచ్చేసేదే!” అనుకుంటూ వుంది టీపూ. నాలిక పైకి చాపేసి దూర దూరంగా దారి పరికిస్తోంది. కాని గుల్లీ రావడం అవుపించదే!

ఏం జరిగిందో?, ఏదో జరిగే వుంటుంది. టీపూ పెద్ద పెద్ద నిట్టూర్పులు తీస్తోంది.

అరే- ఎవరినవ్వది? సరిగ్గా గుల్లీ నవ్వులాగే వుందే!... మరి, ఈ రెండో మూర్తి ఎవ్వరూ?

సంశయ దృష్టితో చూసింది టీపూ, గుల్లీ మాట్లాడుతూ వున్న వొక యువకుడికేసి.

“ఎవడీ అయ్యవారు? ఎక్కణ్ణుంచి వూడిపడ్డాడు?”— అనుకుంది టీపూ. కొత్త యువకుడు దగ్గిరికి రావడంతోనే గుర్రుర్రు మనడమూ ఆరంభించిం దది.

యువకుడికి పదిహేడు పద్దెనిమి దేళ్ళుంటాయి. మాసి పోయి వేలాడుతూ వుంది జుత్తు. మురికోడుతూ పీలిక లయి పోయి వుంది కమీజు. బాగా మాసిపోయీ, చిరిగిపోయీన్నీ వుంది కట్టుబట్ట.

“చూప్, టీపూ... ఈయనా మన స్నేహితుడే” అంది గుల్లీ.

టీపూ వూరుకుంది. కాని యువకుణ్ణి నిఘాతో చూడ్డం మొదలు పెట్టింది. గుల్లీకీ తనకీ వున్న ప్రేమమధ్య మరొకరు రావడం దానికి ఇష్టం లేదు.

టీపూ మనసులో మాట గుల్లీ గ్రహించేసింది.

"ఇంత వుడుకుబోత్తనమా, టీపూ! అబ్బే, తప్పది... ఏదీ కొంచెం తప్పుకో. కూచోనీ..." ఇలా అంటూ టీపూ తలమీద తేలికగా కొట్టిందామె.

ప్రతీదినంలాగ టీపూ ఇవాళ ఆటలాడలేదు. తన గుల్లీతో మనసు కలపలేదది. ఉదాసీనంగా ఆమెకి కొంచెం దూరంగా చెట్టుకింద కూచుంది. నిద్రపోతున్నట్టుంది. కునుకుపాట్లు పడుతున్నట్టుంది. గుల్లీకూడా అంత ప్రేమ కనపరచలేదివాళ.

ఇదంతా ఆ కొత్తగా వచ్చిన వాడివల్లే జరిగింది. టీపూకి బాగానే తెలుసు నిది.

టీపూ వొకసారి చెవులు పడపడ లాడించింది. కళ్ళు విప్పి గుల్లీనీ, ఆయువకుణ్ణీ చూసింది.

"ఎలా దర్జాగా కూచున్నాడో వాడు! అబ్బో, గవు నేరు కొడుకులా వున్నాడు!"

మళ్ళీ యథాప్రకారం కునుకుపాట్లు నటించింది టీపూ.

యువకుడు నవ్వుతూ గుల్లీతో మాట్లాడుతున్నాడు. కొంచేపయ్యాక గుల్లీ తన రొట్టెలమూట విప్పింది. ఎండు రొట్టె ముక్కలు కొత్త స్నేహితుడికిచ్చింది. తానూ తినిందికి సిద్ధపడింది.

"టీపూ, ఓటీపూ, రా, ఇలారా! ఎందుకలా అలిగి పడుకున్నావక్కడ? చూడూ, ఇదిగో నీకోసం ఇవాళ నేను

అన్నం అడిగి తెచ్చాను" కుక్కని పిలుస్తూ అంది గుల్లీ.

కాని ప్రతీదినంలాగ ఇవాళ పరిగెత్తుకు రాలేదు టీపూ, గుల్లీ నుంచుంది. టీపూ దగ్గిరికి వెళ్ళిందామె. దాని తల నిమురుతూ అంది. ఓహో, అదా సంగతి? చూడూ, రేపు సరిగ్గా వేళకి వచ్చేస్తాను. ఆఁ, సరేనా!"

సుఖమూ, సంతోషమూ అనుభవిస్తూ టీపూ కళ్లు మూసుకుంది. వెంటనే లేచిం దది. తన రొట్టే, అన్నమూ తినడం మొదలు పెట్టింది.

గుల్లీ కొత్తస్నేహితుడిపేరు దాదూ.

దాదూ ఇప్పుడు రోజూ గుల్లీతో వస్తాడు. ఆమెతో కలిసి మర్రిచెట్టుకింద రొట్టిముక్కలు తింటాడు. ఈ కొత్తస్నేహితుడితో టీపూ నేస్తం కట్టక తప్పింది కాదు. ఇప్పుడు ముగ్గురు స్నేహితులూ మర్రిచెట్టుకిందకూచుని రొట్టిముక్కలుతింటారు. నీళ్లు తాగిందికి ఏటికి వెళతారు. తిరిగి వచ్చి మర్రికింద అలసట తీర్చుకుంటారు.

ఇలా ఇద్దరల్లా ముగ్గురు స్నేహితులయారు. అయితే మరో ఉపద్రవం వచ్చిపడింది వాళ్లకి. సత్రం చౌకీదారు ముసిలాడు చచ్చిపోయాడు. కొత్త చౌకీదారు మరొకడు యువకుడు వచ్చాడు. అతడిపేరు ఛగన్. అతడు గుల్లీ, దాదూ, టీపూ— ముగ్గురినీ సత్రం నించి తగిలేశాడు. మర్రిచెట్టే ఆశ్రయించవలిసి వచ్చింది వాళ్లు. గుల్లీ ఎంతో దుఃఖపడింది. కాని ఏంచేస్తుం దామె!

అందరికంటే హెచ్చు మండిపడింది టీపూ. ఒకటి రెండు సార్లు తనకోరలమజా ఛగన్‌కి చూపించనూ చూపించిం దది.

అయితే సంవత్సరం పొడుగునా చెట్టుకింద ఎవరయినా ఎలా వుంటారు? ఎండాకాలమూ, తుదకి చలికాలమూ కూడా ఎలాగో చెట్టుకింద పడివుండవచ్చు. కాని వర్షాకాలంమాట? ఇదే ప్రశ్న వాళ్లని బాధించడం మొదలుపెట్టింది. ఒకనాడు ముగ్గురూ ఇదే ఆలోచిస్తూ కూచున్నారు.

"గుల్లీ, ఈ వర్షాల్లో ఏం చేద్దాం?" దాదూ అన్నాడు.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను," అంది గుల్లీ – "మన్ని అరుగుమీద పడుకోనిస్తే, ఛగన్‌కి ఏం పుట్టిములుగుతుందో! అరుగూ, సత్రమూ వాడి బాబుసొమ్ము కాదుకదా! మరి, వాడు ఇంత అడ్డుతాడేం? ... వాడి కళ్ళు ..."

"ఆహాఁ, గుల్లీ, తిట్టకు. వాడి ఖర్మవాడిది."

"ఎందుకు తిట్టనూ అంటా! పాపం, టీపూ వాణ్ణి ఏం చేసింది చెప్పూ, ఎప్పుడు వాడి ఎదటపడ్డా దాన్ని కొడతాడే!"

"అందుకే నేను ఎన్నోసార్లు చెప్పాను, మనం ఇక్కణ్ణుంచి దూరంగా ఎక్కడికన్నా పోదామని."

"ఉఁ ఊఁ, వూరికే ఎలా వెళతాం? నౌకిరీ గీకిరీ ఏదన్నా నీకు దొరికిపోతే ..."

"దొరికితే నువ్వూనన్ను పెళ్ళి ..."

"మళ్ళీ అదేమాటా? నేను ఎప్పుడు కాదన్నాను దాదూ? మరి ..."

"సరే, సరే" – నవ్వుతూ గుల్లీ చేతులు పట్టుకుంటూ అన్నాడు దాదూ.

అదే సమయంలో తన పవిటకొంగు ఎవరో వెనకనించి లాగినట్టయింది గుల్లీకి. వెనక్కి తిరిగి చూసిం దామె. ఆమె చెంగు టీపూ లాగుతోంది. టీపూ నోట్లోంచి చెంగు విడిపిస్తూ, నవ్వుతూ అం దామె – "పిసరంత సేపు. నువ్వు వూరికే వుండ లేవు కదా, టీపూ! మచ్చరం ముందూ, తరవాత నువ్వూ పుట్టారు."

దాదూ దిక్కు తిరిగి మళ్ళీ అం దామె. "దాదూ, నేనూ అదే కోరుతున్నాను. ఏదో వొకటి మనం నిశ్చయించుకోవాలి. నాకూ ఇక్కడ వుండాలని లేదు మరి. ఇక్కడివాళ్ల చూపులోనే ఏదో మార్పు కనిపిస్తోంది."

"నేనూ అదే కదా చెపుతున్నాను. మనం ఇక్కణ్ణుంచి వెళ్లి పోదాం."

గుల్లీ జవాబు చెప్పకముందే మళ్లీ వెనకనించి పవిటలాగింది టీపూ.

"ఇదిగో, టీపూ, నిన్నెలా కొడతానంటే, మళ్లీ తనుచుకుంటావు నన్ను. ఒక్కక్షణమన్నా వూరికే వుండలేవేం?" అంది గుల్లీ చిరాకు పడుతూ.

కాని టీపూ ఆగలేదు. కొంగు నోటితో లాగుతూనే వుంది. టీపూ లాగేదిక్కు గుల్లీ వెళ్లక తీరింది కాదు.

అంతలో మర్రిచెట్టు వెనకపక్క నక్కివున్న ఛగన్ పరి గెత్తుకు పోతూ అవుపించాడు. అతడి వెనక టీపూ ఎంతో సేపు మొరుగుతూ నుంచుంది.

గుల్లీ తిరిగివచ్చి దాదూపక్క చదికిల బడింది.

"దాదూ, దాదూ, ఛగన్ మన మాటలన్నీ వినేశాడు. వాడి వైఖరీ నాకేమీ నచ్చలేదు."

"అవును. నాకు తెలుసు. నువ్వు మాత్రం నామాట వింటావు కనక నా?"

"తెలీని వూరంటే నిజంగా నాకు భయమేస్తుంది బాబూ. ఇక్కడైతే వొకరు కాకపోతే వొకరైనా ఎరిగిన వాళ్లుంటారు. కాని అక్కడ ఎవరుంటారు? నువ్వు వొకపనిచెయ్యి దాదూ! మూడు నాలుగు రోజులు వెళ్లి నౌకరీ కుదుర్చుకురా. తరవాత నన్ను నీతో తీసికెళ్లిపో."

"కాని నేను రావడం ఆలస్యమయితే నాకోసం కనిపెట్టుకుంటావా?"

"తప్పకండా. ఈ మర్రిచెట్టుకిందే నీకోసం కనిపెట్టుకు కూచుంటాను. ఇంకా ఎక్కడికీ వెళ్లనే వెళ్లను. తెలిసిందా? కాని దాదూ, నువ్వుమాత్రం ఆలస్యం చెయ్యకూడదు. వేగం వచ్చెయ్యాలి. ఆఁ, మరి ... రాకపోతే, నువ్వు నన్ను ..."

"ఆఁ ఆఁ" అంటూ దాదూ రెండు చేతులూ ఆమె నోటిమీాద అడ్డుపెట్టాడు. "అలా అనకు గుల్లీ, చూడూ,

ఈ సూర్యనారాయణమూర్తి సాక్షిగా చెపుతున్నాను. నేను తప్పకండా వేగం వచ్చేస్తాను."

"నేనూ ఈ సూర్యనారాయణమూర్తి సాక్షిగా చెపుతున్నాను. నువ్వు వచ్చేదాకా ఈ మర్రిచెట్టుకిందే వుండి నీకోసం ఎదురు చూస్తుంటాను."

దాదూ వెళ్లిపోయాడు. గుల్లీ అతడికోసం కనిపెట్టుకు కూచుంది. ప్రతీరోజూ మధ్యాహ్నం వూళ్లో అడుక్కొని వచ్చేక, మర్రిచెట్టుకింద కూచుని దాదూ కోసం ఎదురు చూస్తుం దామె.

కాని అతడు రావడంమాత్రం అవుపించదు.

దాదూ వెళ్లి పది రోజులయింది.

ఇరవయి దినాలు గడిచాయి.

ఒక నెల గడిచింది.

రెండు నెల్లు గడిచాయి.

మూడో నెలా దగ్గిరపడింది.

దాదూ రావడం అవుపించలేదు.

అతడికోసం ఎదురుచూస్తూ కూచుంది గుల్లీ. దూర దూరాలు, ధూసరంగా వున్న దారి చూస్తోం దామె.

కాని ఆమె దాదూ రావడం అవుపించదు.

"ఏమయిందో?" ఆమె ఆలోచిస్తుంది. — ఆమె నతడు మరిచిపోయాడా? ఏవో అనుకోని ఆపదలు అతడిమీద వచ్చి పడ్డాయా."

గుల్లీ మనస్సు మనస్సులోలేదు. టీపూ అది సహించలేక పోతూ వుంది. దాని గుల్లీఅక్క ఎందుకంత విచారంగా వుంటుంది? దాదూ వెళ్ళిపోతేమాత్రం? ఏం పుట్టిమునిగి పోయిందంటా! తాను దగ్గర వుంది కదా!

రాత్రిళ్లు గాఢాంధకారంలో, నక్కల అరుపుల మధ్య, మర్రికింద పడుకుని గుల్లీ పెద్దపెద్ద నిట్టూర్పులు విడిచేది. టీపూ ఆమె శరీరానికి తన శరీరం ఆనించి, ఆమెని ఓదార్చడానికి ఎన్నో ప్రయత్నాలు చేసేది. మాటలు మాత్రం చేతకావు దానికి. అది తప్పిస్తే, ఎన్నివిధాల గుల్లీని ఓదార్చాలో ఆమెకి కులాసా కలిగించాలో అన్నీ చేసే దది.

గుల్లీకూడా దాన్ని దగ్గిరసా లాక్కునేది. దానిమీద ముద్దులు కురిపించేది. మనసారా ప్రేమించేది. కన్నీళ్లుకార్చేది. అలాగే పడుకునేది. తెల్లవార్లూ టీపూ ఆమెని కాసుకు కూచునేది.

ఒకటి రెండుసార్లు టీపూ గట్టిగా మొరిగింది. గుల్లీ నిద్ర లోంచి లేచి చూసేసరికి ఎవరో నల్లగా చీకట్లో పారిపోవడం అవుపించింది.

ఒకనాడు ఛగన్ గుల్లీ దగ్గిరికి వచ్చాడు. సాయంకాలం కావస్తోంది. ఆసాయం సంధ్యలో గుల్లీ అద్భుతంగా మరింత అంక పొంకాల్తో కనిపిస్తోంది.

ఆమెని చూసి పిచ్చివాడిలా అయిపోయాడు ఛగన్. దగ్గిరసావచ్చి అన్నా డతడు :

"గుల్లీ, ఈచెట్టుకింద పడివుంటావేం? సత్రంలోకి వచ్చెయ్యరాదూ?"

"ఒద్దు బాబూ, ఇక్కడే హాయిగా వుంది నాకు."

"నీ ఇష్టం...కాని ఇక్కడ పరుచుకుందికీ, కప్పుకుందికీ కూడా ఏదీ లేదు నీకు. ఇదిగో ఇంక. ఈ దుప్పటి పుచ్చుకో. ఇది వాడుకోవాలి నువ్వు."

"ఒద్దు, వొద్దు. దుప్పటీ గిప్పటీ ఏదీ అక్కర్లేదు నాకు. నాదగ్గిర వున్నదే నాకు చాలు"— దుప్పటీ అందుకోకుండానే అందామె.

"ఇంత పొగరా గుల్లీ! ఎంగిలి రొట్టిముక్క లడుక్కుంటే సిగ్గులేదూ? దుప్పటి పుచ్చుకుంటేనేనా పరువు పోతుంది? మహా నవాబు కూతురివి!...ఇదిగో, బాగా జ్ఞాపకముంచుకో గుల్లీ, ఎవడికోసమయితే నువ్వు కనిపెట్టికుని వున్నావో ఆ దాదూగాడు ఇప్పుడు రాడుకదా, ఎప్పుడూ రాడనుకో."

గుల్లీ ఆగలేకపోయింది. వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టింది.

"ఛగన్, ఛగన్, నీకు నేను ఏం అపకారం చేశానని నన్నిలా బాధ పెడుతున్నావు?"

కాని ఈ మాటలు వినడంకోసం ఛగన్ అక్కడనుంచో లేదు.

ముసిలి మర్రిచెట్టు తన చేతులు చాపి ఆమెని వోదార్చింది.

ఇవాళకి రెండు రోజులయింది, పిచ్చెత్తినట్టు గుల్లీ ఇటూ అటూ తిరుగుతోంది. మొహం బాగా వాడిపోయివుంది. జుత్తు చిందరవందరగా వుంది. ఏడ్చి ఏడ్చి బాగా వుబ్బి పోయి వున్నాయికళ్లు మూర్తీభవించిన శోక దేవతలాగ, జాలిగా మర్రి దగ్గరనించి వూళ్ళోకీ వూళ్ళోంచి మర్రిదగ్గిరికీ,తిరుగుతోందామె, ఏదో పోగొట్టుకున్నట్టు. దేన్నో అదే వెదకడం వెదుకుతోంది.

ఆమె టీపూ ఆమెతో లేదివాళ. అడుక్కుని తెచ్చుకున్న ఎండురొట్టె ముక్కలు తింటూ మర్రికింద గుల్లీ కూడా లేదివాళ ఆమె దగ్గిర కూచుని, ఆమె పాదాలు మూచూస్తూ టీపూ లేదివాళ. ఒంటరిగా, నిరాధారంగా, వెర్రిదానిలా తిరిగేస్తోంది గుల్లీ. ఊళ్ళో వీధి వీధులూ, సందుసందులూ మూల మూలలూ టీపూని వెదుకుతూ తిరుగు తోందామె. కాని టీపూ మాత్రం కనిపించదు. ఎక్కడా దానిజాడే అవుపించ లేదు.

“టీపూ, నాటీపూ ! ఎక్కడున్నావు నువ్వు ?” — అరుస్తోంది గుల్లీ ; ఏడుస్తోంది.

“ దాదూ వెళ్లి పోయాడు. నువ్వూ వెళ్లిపోయావా ?— నాటీపూ ఎటు పోయింది ?”

ఏటి దిక్కు వెళ్లిందిగుల్లీ. లోతయిన నల్లటి నీళ్ళకేసి గంటల తరబడి నుంచుని చూసిందామె. ఏమో, ఆ నీళ్ళలో దూరంగా ఆమె టీపూ అవుపిస్తుందేమో ! ......ఊహూఁ— ఏమీ లేదు.

హతాశతో ఆమె తిరిగి వచ్చేసింది.

వచ్చేసరికి మర్రిచెట్టు కింద ఛగన్ నుంచుని వున్నాడు.

"ఏం గుల్లీ, ఇవాళ ఇలా వున్నావేం!"

"ఏం లేదు"—అమె కళ్ళల్లో కన్నీళ్ళవర్షం.

"అరే, నువ్వు ఏడుస్తున్నావే?"

"అన్నా, ఛగన్! నా టీపూ రెండురోజు లైంది, ఎక్కడికో వెళ్లిపోయింది."

"ఆఁ? టీపూ?"

"అవునన్నా, టీపూ. నువ్వు చూశావాదాన్ని?

"చూశానూ? నేనా? ఉఁ ఊఁ, లేదే. నేను చూడలేను. కానీ...... "

"ఏమిటీ?"

"లేదు, నేను చూడలేదు. కాని వెదకడానికి ప్రయత్నిస్తాను."

"తప్పకండా,.........నేను నీ కాళ్ళకి మొక్కుతా. అన్నా, అన్నా! నీమేలు ఎవ్వుడూ మరచిపోను"— చేతులు జోడిస్తూ అంది గుల్లీ.

"మేలూ గీలూ ఏమీ లేదుకాని...... "

"ఏమిటి?"

"ఇదీ...మరేమిటి?"—అభినయిస్తూ అన్నాడు ఛగన్.

ఏదో అర్థం కాని సందేహంతో ఆపాదమస్తకం కంపించి పోయింది గుల్లీ. రెండుచెవులూ చేతుల్తో మూసుకుం దామె. వెంటనే వెక్కి వెక్కి ఏడవడమూ మొదలు పెట్టింది.

......కాని......కాని......ఆమె టీపూ మాట? నోరు విప్పి మాట్లాడలేక పోయిందామె. ఇదమిద్ధమని ఏమీ నిశ్చయించలేకా పోయింది.

"ఏం, నిశ్చయమేనా? నేను వెడుతున్నాను."

గుల్లీ! దిక్కులేని గుల్లీ!! ఏం చెయ్యగల దామె? దాదూని పోగొట్టుకుంది. ఇప్పుడు టీపూనీ పోగొట్టుకో వలసిం దేనా? అయితే ఈలోకంలో ఆమె వొక్కతీ ఏం చేస్తుందీ? ఈఆలోచన తట్టడమే తడువు, చప్పున ఆమె కళ్ళల్లో ధృఢత్వం మెరిసింది. ఆమె ఏదోవొక నిశ్చయానికి వచ్చేసినట్టుంది.

"ఛగన్,—వొప్పుకుంటున్నాను. నువ్వు పెట్టిన షరతువొప్పుకుంటున్నాను. కాని, ఇవాళ రాత్రి పడిందికి ముందే నువ్వు నా టీపూని తెచ్చియిస్తే నే. దాంతో వొక కొబ్బరికాయా, వొక పోకచెక్కా, వొకరాగికానీ కూడా తేవాలి. రేపు ఉదయాన్నే అమ్మవారికి మొక్కు చెల్లించేసి, నా షరతు తీర్చుకోడానికి నీదగ్గిరికి సత్రంలోకి వచ్చేస్తాను"

ఛగన్ మొహం సంతోషంతో చేటంత అయిపోయింది. నాలుగు పక్కలా చూశా డతడు. దూర దూరాల దాకా ఎవ్వరూ అవుపించలేదు. గుల్లీ కేసి వొంగా డతడు. గుల్లీ తుళ్ళి

పడింది.— ఆమె పెదవులు ఎవరి పెదవులో స్పృశించాయి. ఆమె వొళ్ళంతా వొణికింది. గట్టిగా పెద్ద కేక పెట్టిందామె.

“ భగన్, భగన్, నా మొక్కు.. కాలీమాత నిన్నూ నన్నూ తినేస్తుంది. చండాలుడా ! ఎంత పని చేశావూ ?”

భగన్ రెండడుగులు వెనక్కి వేశాడు.

సత్రంలోకి అతడు మాయంకాగానే గుల్లీ పిచ్చి దానిలా పరిగెత్తింది. కడవలోంచి నీళ్ళుతీసి పెదవులు కడిగింది. కాని దాంతో ఆమెకి తృప్తి కలగలేదు. ఎన్నోసార్లు మాటి మాటికీ ఆమె పెదవులు పామిపామి కడిగింది. కిందపడివున్న మసిబొగ్గు తీసి పెదవులు తోమడం మొదలెట్టింది. పెదవుల్లోంచి రక్తం వచ్చేసింది. అప్పుడు కాని మసిబొగ్గు పారెయ్యలేదామె.

పొద్దుగూకుతూ గూకుతూ వుండనగా టీపూని పట్టుకు వచ్చాడు భగన్. టీపూని చూసీచూడ్డంతోనే శిపమెత్తిన ట్టయిపోయింది గుల్లీ.

టీపూ రకరకాలుగా అరిచింది; ఏడ్చింది; నవ్వింది; ఆడింది; గెంతింది.

గుల్లీ దాన్ని వొళ్లోకి లాక్కుంది. ప్రేమగా నువ్వింది.

“గుల్లీ, నామాట నేను దక్కించుకున్నాను. మరి, నువ్వో......?

“ మరిచిపోయాను, భగన్...నా మొక్కుబడి ?”

“ ఊఁ,...పోకచెక్కా, కొబ్బరికాయా, కానీ — అన్నీ తెచ్చాను.”

"సరే, రేపూ. ఇవాళరాత్రి నువ్వు ఎంతమాత్రం రాకూడదిక్కడికి. అమ్మవారికోసం రాత్రంతా జాగరం చెయ్యాలి నేను."

"సరే,"—

ఛగన్ మర్రి కిందనించి వెళ్ళిపోయాడు.

ఆరాత్రి గుల్లీ ఎన్నోసార్లు టీపూని వొళ్ళో పడుకోబెట్టుకుంది. ఎన్నోసార్లు దానికి ముద్దులు పెట్టింది. ఎన్నోసార్లు దాని మొహంమీద మొహంపెట్టి ఏడ్చింది.

గంభీరంగా నుంచున్న మర్రిచెట్టూ, ఆకాశం మీది లెక్కలేని నక్షత్రాలూ అదంతాచూస్తూనే వున్నాయి.

మర్నాడు తెల్లవారింది.

మర్రిచెట్టు కింద గుల్లీ పడుకుని వుంది.

ఇంకా గాఢనిద్రలోనే మునిగివున్నట్టుంది.

మూతలు పడివున్న ఆమెకళ్ళు ఇప్పుడే విడతాయి అన్నట్టున్నాయి.

దగ్గిర హఠాత్తుతో టీపూ—దానికంటే హఠాత్తుతో దాదూ నిశ్చలంగా నుంచుని కన్నీళ్లు కారుస్తున్నారు.

చచ్చిపోయిన గుల్లీకి జలాంజలి అర్పిస్తున్నట్టున్నారువాళ్ళు

అసహ్యమైన సంసారదుఃఖం నించి తరించిపోయి — ఆ తియ్యటి నిద్రలోంచి ఆమె ఇక ఎన్నటికీ మేలుకోదనే నమ్మకం దృఢపడి పోయింది వాళ్ళకి. అయినా చంచల మయిన హృదయంలో ఎదో ఆశ వొదలకండానూ వుంది.

ఆమె తనగాఢ నిద్రలోంచి లేస్తుందేమో! నేరంలేని ఆమె మొహంలో చిరపరిచితమైన నవ్వు మొలకెత్తుతుందేమో!

కాని ఆ ఇద్దరి ఆశా లక్ష్యపెట్టకుండా శాంతంగా, గంభీరంగా, ఇప్పుడిప్పుడే గాఢనిద్రలో మునిగినట్లు పడుకునే వుంది గుల్లీ. మూతలుపడ్డ ఆమెకళ్ళు ఇదిగా ఇప్పుడే విడతాయా అన్నట్టున్నాయి.

సూర్యనారాయణమూర్తి సాక్షిగా తాను చేసిన శపథం పాలించలేదూ గుల్లీ?

మర్రి చెట్టుమీద కాకులు అరుస్తున్నాయి—

क्या ओ? क्या ओ? क्या ओ?

---

# కసి

హాయిగా వుంది మధ్యాహ్నం. సైరను మోగింది. ఫ్యాక్టరీ తలుపులు విడ్డాయి. లోపలి నించి పెద్ద మానవ ప్రవాహం బైటికి ప్రవహించింది. బాగా అలిసిపోయివున్న ఫ్యాక్టరీకూలీల ప్రవాహ మది.

అందరూ మౌనంగా వున్నారు. ఒకరితో వొకరు ఎవ్వరూ మాటా మంతీ లేదు. ఒకర్ని చూసి వొకరు నవ్వుకోడమూ లేదు. పురుషులు స్త్రీలకేసి చూడ్డంలేదు. యవ్వనవతులు యువకులదిక్కు వోరచూపులు విసరలేదు. ఒళ్ళో పిల్లలుకూడా చపలత్వం చూపలేదు. మంచిమంచి భారీజవాన్లు సిరసంతో దిగజారిపోయి వున్నారు. యవ్వనవంతులు ముసిలాళ్ళయి పోయామనుకుంటున్నారు. వయస్సు మళ్ళినవాళ్ళు నరం చచ్చినట్లున్నారు.

తమ స్వార్థ పరత్వం వల్లా, తెలివితక్కువవల్లా ఈఫ్యాక్టరీ కూలీలంతా పాపం, రెండింతల దౌర్భాగ్యం నెత్తిమీద మోస్తున్నారు.

అంతూ పంతూలేని ఆ జనప్రవాహం యావత్తూ, గాలికి చిందరవందర అయిన మేఘంలా క్షణంలో చెదిరిపోయింది పెద్దవానకి వచ్చిన వరదలా మొట్టమొదట ప్రవహించిన ఆ జనమంతా క్రమంగా చిన్నచిన్న తుకిడీలయి, తుదకి జోడీలు జోడీలుగా మారిపోయింది. ఆజోడీలుకూడా వొకర్నొ

కరు పలకరించ కండానే విడిపోయి, కొందరు ఇంటి ముఖం పట్టారు. కొందరు సత్రంలో దూ రారు. కొందరు కల్లు పాకలికి ఎగబడ్డారు. కొందరు బజార్లో తోడ తొక్కిడిలో కలిసి పోయారు.

చిట్టచివర వచ్చేవాళ్ళలో గఫ్తారు వొకడు. బలిష్టమయిన భారీశరీరం అతడిది. అంచేత అందరూ అతణ్ణి గఫ్తారు పహిల్వాను అనేవాళ్ళు. అతడి మొహం మాంచి నిగనిగలాడుతూ వుంటుంది. కళ్ళల్లో నిజాయితీ మెరుస్తూ వుంటుంది. అతడి శరీరసౌష్టవం చూస్తే ఏ భీముడో జ్ఞాపకం వస్తాడు.

గోడల నీడల పక్కలనుంచి పెద్దపెద్ద అంగలువేస్తూ నడిచాడు గఫ్తారు. రెండుమూడు రోడ్లుదాటి దగ్గరదారికోసం వొక సందులో ప్రవేశించాడతడు. త్వరలోనే వొక వెడల్పాటి రోడ్డుమీదికి వచ్చాడు. పెద్దపెద్ద చెట్లతో రెండుపక్కలా నీడగావుంది రోడ్డు.

కింద పడివున్న వొక చెట్టుకొమ్మమీద చక్కని చుక్కలాంటి వొక అమ్మాయి కూచునివుంది. మంచి యవ్వనంలో వుందామె. ఆమెకాళ్ళదగ్గర తట్ట వుంది. పక్కని వొక కుంకా, వాళ్ళో వొకపిల్లాడూ వున్నారు. పిల్లాడు పరిశుభ్రం గానూ, కలకల్లాడుతూనూ వున్నాడు.

కుక్క గఫ్తార్ని చూసింది; ఎరుసుకుండా పరిగెత్తింది. పిల్లాడు తన బుల్లి చేతులు రెండూ అతడికేసి చాచాడు.

గఫ్ఫారు పహిల్వాను తట్ట ముందుకి లాక్కున్నాడు. పెద్దపెద్ద రొట్టెలు పైకితీశాడు. భార్య అతడి మొహంమీదే చూపులు నిలిపి అన్నీ వడ్డించింది. అతడి వొళ్ళో తువ్వాలు పరిచింది. కర్ర చమ్చా చేతికందించింది. ఒక ఎర్రటిసీసా కార్కుతీసి, గ్లాసులో సారా పోసింది.

భోజనాలకోసం ఇచ్చిన ఆటవిడుపు అయిపోగానే మళ్ళీ ఫ్యాక్టరీ సైరను మోగింది. గఫ్ఫారు గబగబా సారాయిగ్లాసు ఆఖరిగుటక కాళీచేసేశాడు. మిగిలిన రొట్టెముక్క కుక్క ముందు పడేశాడు. ఒక పరమలుబ్ధు తన ధనంమూట గుండెల కద్దుకున్నట్టు, తన భార్య చేతులుగూడా వోసారి పట్టుకున్నాడు. అంతే. తరవాత పెద్దపెద్ద అంగలు వేస్తూ ఫ్యాక్టరీ దిక్కు నడిచాడు.

గఫ్ఫారు ఫ్యాక్టరీలో ప్రవేశించాడు. రద్దు ఇనుం పడివున్న పెద్ద గ్రౌండు దాటాడు. తరవాత వర్కుషాపు నొక హాల్లో అడుగుపెట్టాడు. హాలుకిటికీలు పొగచూరి కారెక్కివున్నాయి. గోడలు నల్లగా మసిపారి భయంకరంగా వున్నాయి. నల్లటి మేఘాల్లాటి పొగలు కక్కుతున్నాయి చిమ్నీలు. హాలు హాలంతా ఈ చివరినుంచి ఆ చివరిదాకా పైన పెద్దపెద్ద రాకాసుల్లాటి యంత్రాలు తిప్పుతూ నెత్తిమీద తోలుపట్టీలు తిరుగుతున్నాయి. యంత్రాల్లోంచి ఘోరమయిన వేగంతో పైకి వస్తూన్న ఆవిరి కగ్గ పర్సుని గజగజలాడిస్తూ నాలుగు దిక్కులా తుంపుర్లు చల్లుతున్నది. తక్కిన వర్కుషాపుహాలు

ల్లోంచి కూడా ఇలాగే లోహాలు గుండకొడుతూవున్న భయంకరమయిన శబ్దాలూ, స్త్రీలపాటలూ, యంత్రాల చప్పుళ్ళూ వినిపిస్తున్నాయి.

మొదటి హాలు తరవాత రెండోహాలు ఆరంభ మవుతుంది. రెంటినీ కలుపుతూ వొక సన్నని కర్రవంతెన వుంది. వంతెనపక్కనే వొక పెద్దచక్రం భీషణమైన వేగంతో తిరుగుతోంది.

గఫ్తారు వంతెన మధ్యకి వచ్చేసరికి రెండో హాల్లోంచి వొక యువకుడు పరిగెత్తుకుంటూ ఎదురుగ్గా రావడం చూశాడతడు. కొత్తగావచ్చి వర్కుషాపులో పని నేర్చుకుంటున్నాడా యువకుడు. ఆగుదామన్నా తన్నుతాను ఆపుకోలేనంత జోరుగా పరిగెత్తుకు వస్తున్నాడతడు. గఫ్తారు వెనక్కి వెళ్ళడానికీ అవకాశం లేదు. వంతెనమీాద ఇద్దరు నడవడానికీ స్థలం చాలదు.

చప్పున గఫ్తారు తనభారీ శరీరం పక్కకి వంచేసి, తనకి వీలయినంతవరకూ దారికి అడ్డం లేకండా తప్పుకున్నాడు.

యువకుడు మెరుపులా వచ్చేశాడు. గప్తారుని చూసి గతుక్కుమని పోయి, అతణ్ణి తప్పుకుంటూ ఆ వూపుని ముందుకి పోవాలని ప్రయత్నించాడు. కాని గప్తారుని గుద్దేసి బోర్లాపడి పోయాడు.

వంతెన చాలా సన్నంగా వుంది. అంచేత యువకుడి శరీరం సగం పైకి వేలాడి పోయింది. కింద భయంకర మయిన

రాకాసిలాంటి పట్టే తిరుగుతూ వుంది. లోతుగానూ వుంది. యువకుడు వంతెన మీంచి సగం వేలాడుతున్నాడు. కాని అలా ఎంతోసేపు వుండలేదు.

పరిస్థితి గ్రహించేశాడు గఫ్తారు. ప్రమాదం లక్ష్యపెట్టకండా యువకుణ్ణి పట్టుకోడానికి చెయ్యి చాచా డతడు. యువ కుడు గాభరాలో మతిలేనట్టున్నాడు. పిచ్చెత్తి నట్టుజోరుగా వొక్కవూపుని గఫ్తారు చెయ్యి వట్టేసుకున్నా డతడు. దాంతో కాళ్ళ అదుగుసించీ కంపించిపోయాడు గఫ్తారు. తన్ను తాను సంబాళించుకోడం కోసం మిగిలిన చెయ్యి రెండో దిక్కు విసి రాడు. వెంటనే అతని వేళ్ళు ఏదో వొకదానికి తగులుకు న్నాయి—జోగిపోతూ అతడు తిరుగుతూ వున్న పట్టీమీాద చెయ్యివేసేశాడు. క్షణంలో అతడి చెయ్యి పోచీదగ్గిరికి విరిగి పోయింది. ఒక కర్ర చీలిస్తే ఎలా చప్పుడవుతుందో అలా పహిల్వాను చెయ్యి విరిగేటప్పుడు ఫెళ ఫెళమందని యువకుడు చెప్పాడు, తరవాత. ఆశబ్దంతో హడలెత్తిపోయాడు యువ కుడు.

చెయ్యి విరిగినా పహిల్వాను బుద్ధి చలించలేదు. రెండో చేత్తో యువకుణ్ణి సందిట్లోకి లాక్కుని భద్రంగా వంతెన మీాద పెట్టాడతడు. అంతే. తరవాత భరించలేనంతబాధతో తెలివితప్పి పడిపోయాడు.

వర్కుషాపంతా వొక్కసారి అల్లకల్లోలమై పోయింది. పహిల్వాను తోడి వాళ్ళుభద్రంగా అతణ్ణి కుర్చీమీాద కూచో

పెట్టి, దగ్గరవున్న ఆస్పత్రికి తీసుకుపోయారు. సివిలు సర్జను అతడిచెయ్యి మోచేతిదాకా కోసి తీసేశాడు. మానుపలాస్త్రీ వేసి కట్టుకట్టేశాడు.

పహిల్వాను నయమయేసరికి చాలా రోజులు పట్టింది. ఈ కాయిలాలో అతడు జీవితంలో గడించిన గడన యావత్తూ అయిపోయింది. అతడిభార్య ఇంట్లోని వస్తువులు తాకట్టువేసి షావుకారు దగ్గిర తెచ్చిన రూపాయలూ ఎగిరిపోయాయి. ఇదిగాక, అభిమానులూ స్నేహితులూ పోగుచేసి ఇచ్చిన చందాకూడా ఖర్చయిపోయింది. ఆఖరికి హర్తాలు ఫండు లోంచి ఇచ్చిన సహాయం కూడా చెల్లిపోయింది.

పహిల్వాను కుడిచెయ్యి పోయింది. అంచేత అతడికి ఉద్యోగం దొరకడం దుర్లభమైపోయింది.

ఆప్రమాదం జరిగిన నలభై రోజుల తరవాత పహిల్వాను భార్య ఫ్యాక్టరీలోకి వెళ్ళి క్యాషియరు కిటికీ దగ్గిర నుంచుంది. కర్ర కటకటాలతో క్యాషియరు చిన్నగది ప్రత్యేకంగా వుంది. కిటికీకి దిట్టమైన లావుపాటి ఇత్తడి కడ్డీలున్నాయి. లోపల రూపాయల పెట్టెదగ్గిర వొకముసిలి బాబు కూచుని పేపరు చదువుతున్నాడు. చక్కగా తేటుగా వున్నాడాయన. పహిల్వానుభార్య అతన్ని చూసింది. మరిద్దరు బాబులు ఆయన దగ్గర నుంచుని పెద్ద పెద్ద చిఠాలు విప్పి కాగితాలు విప్పుతున్నారు.

"ఏమిటి కావాలి నీకు ?"– ఆఇద్దరిలో వొకబాబు అడిగాడు, గఫ్తారు భార్యని.

"గఫ్తారుకి ఇవుడెలా వుంది ?" రెండో ఆయన సానుభూతి చూపుతూ అడిగాడు.

"బాగానే వున్నారు. కాని వొకచెయ్యి మొండి దయిపోయింది."

"నువ్వు రావడం... ?"

"ఆయన జీతం కోసం" చప్పన అందా మె.

ఒక బాబు పెద్ద దొక చిఠా విప్పాడు. "గఫ్తార్, గఫ్తార్" అని గొణుగుతూ పేజీలు విప్పాడు.

"అయన పేరు గఫ్తారు ఇనుం పని చేసేవారు. రెండో నెంబరు హాల్లో పనిచేసేవారు–

సుఖువు కోనమని పహిల్వాను భార్య చెప్పింది.

"అవును–గఫ్తారు, ఇదిగో."

"ఆయనజీతం–" పహిల్వాను భార్య పెద్దనిట్టూర్పు విడిచింది. ఆమెకళ్లల్లో దుఃఖం తొణికిసలాడుతోంది.

బాబు వొకసాదాకాగితం మీద ఏవో లెక్కలు వేశాడు. తరువాత కళ్లుమీదికెత్తకండానే అన్నాడు.–"గతసారి అతడు జీతం పుచ్చుకున్నాడా?"

"పుచ్చుకున్నారు"

"మరి?–అతడే ఇవ్వాలి–బాకీపడ్డాడు–"

ముసిలిబాబు తనపేపరు కిందపెట్టేసి మీాదికి చూశాడు. కాని నిరాశతో వున్న పహిల్వాను భార్య మొహంకేసి చూడలేదతడు.

"అతడికి ఎప్పుడుదెబ్బతగిలింది"-ముసిలిబాబుప్రశ్నించాడు.

"గతనెల ఇరవయ్యో తేదీని—బుధవారం రెండుగంటలికి," ఉదాసీనమయిన గొంతుకతో జవాబు చెప్పిం దామె.

"అయితే లెక్క చాలానుళువే"—అన్నాడు ముసిలిబాబు— "సోమవారం వొకటీ, మంగళవారం రెండూ, బుధవారం— రెండున్నర దినాలు మొత్తం ఆరురూపాయ లిచ్చెయ్యి."

తరవాత, సర్దుకున్నట్టు భుజాలు ఎగరవేసుకుని, తిరిగీ పత్రిక చదవడం మొదలు పెట్టాడతడు.

కుంచున్న ఇద్దర్లో వొకబాబు రూపాయలసంచి టేబిలు మీాదపెట్టి విప్పాడు; రూపాయలు లెక్కపెట్టాడు; వొక్క మాటన్నా అనకండా అవి పహిల్వానుభార్యకి ఇచ్చేశాడు.

పహిల్వాను భార్య చెయ్యిచాచింది; అతడేమిస్తే అవి పుచ్చుకుంది.

ఆమెకళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

వెళ్లిపోతూవున్న ఆమె పాదాలచప్పుడు దూరదూరంగా గాలిలోకలిసి పోయాక, ముసిలిబాబు గట్టి గొంతుకతో అన్నాడు.

"మరిచిపోవద్దు' గస్తార్ని పనిలోంచి తీసేశాం ఫారిజస్టరులో నోటుచెయ్యండది."

"గఫ్తారుకి రెండున్నర రోజుల జీతమే ఇచ్చారు."

అగ్గిలాగ ఈ కొసనించి ఆకొసకి పాకిపోయింది ఈ వార్త. పనివాళ్లందరికీ తెలిసిపోయింది. వాళ్ల క్రోధానికి అంతం లేక పోయింది.

ఒకనాడు రాత్రి పనివాళ్ల ప్రతినిధులందరూ వొక హోటలు గదిలో సమావేశమయారు. అన్ని విషయాలూ చర్చించు కొని వొక నిశ్చయానికి రావడంకోసమే ఆ సమావేశం జరి పారు. కమిటీ ఎదట అన్ని సంగతులూ చెప్పడం కోసం గఫ్తార్ని కూడా పిలిచారు.

జరిగిందంతా గఫ్తారు కమిటీ ముందు వివరించాడు. తన మొండిచెయ్యి అందరికీ చూపించాడు. తరవాత కమిటీ సాగిం చిన చర్చల్లో అతడు ఏమాత్రమూ నోరు తెందపలేదు. మాటా డకండా వింటూ కూచున్నాడు.

వొంటిచేత్తో సిగరెట్టు ముట్టించడం వీలయేదికాదు గఫ్తా రుకి. అగ్గిపుల్ల తీసిపెట్టడంకోసం పక్కవాళ్ల సహాయంకోరే వాడతడు.

ఎన్ని ఇబ్బందులున్నా, ఆ ఇబ్బందుల్లోనే సౌఖ్యం సరిపెట్టు కోడం మానవస్వభావం. గఫ్తారు ఇప్పుడు చుట్టలు మొదలు పెట్టాడు, సిగరెట్లు మానేసి. గదిలో మసిబారిన లాంతరు అందరినెత్తిమీదా వేలాడుతూ వెలుగుతోంది. దాని గుడ్డి వెలుగు, గది అంతటా పడడంలేదు.

సిగరెట్టుపొగ గదినిండి పోతూవుంది. ఆ పొగలో వొకరి మొహం వొకరికి కనపడ్డమే కష్టంగా వుంది.

వాళ్లు కదుల్తూవుంటే నీడల్లా తలలుమాత్రం కనిపిస్తు న్నాయి. ఎవరెవరో పోల్చడం కష్టంగానే వుంది.

"నేను యాభై సంవత్సరాలై ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాను."

వెనకనించి గంభీరంగా వొకరి గొంతుక వినిపించింది. అందరి లోకీ పెద్దవాడతడు, వయస్సులో. అందుకనే మొదటమాట్లాడే అవకాశం అతడికి లభించింది.

"మీ అందరికంటే నా అనుభవం హెచ్చు. నా జీవితంలో నేను చాలా ఫ్యాక్టరీల్లో పనిచేశాను. పన్నెండేళ్ల వయస్సులోనే కూలీగా చేరాను. నేను మొదటినించీ అనుకుంటూనే వున్నాను. పనివాళ్లు అసమర్థులయిపోయినప్పుడు వాళ్లని పోషించేటట్టు యజమాన్లని బలవంతం చెయ్యాలని మనలో వొకరు కాలో చెయ్యో విరిగిపోయి అసమర్థులయిపోయాక, వాళ్లజీవనం ఎంత కష్టదాయకమై పోతుందో మీ అందరికీ బాగా తెలుసు."

"నేను కొద్దిసంవత్సరాలే పనిచేశాను."

మరోగొంతుక వినిపించింది-"కాని అనుభవం బాగానేవుంది. మనం ఏకగ్రీవంగా వొకటి కావాలి. రహస్యంగా నిశ్చయించుకుని ఫ్యాక్టరీ యంత్రాలు ముక్కముక్కలుగా విరిచెయ్యాలి. సామానులన్నీ పాడు చేసెయ్యాలి. మనం నిశ్చయించుకుంటే ఫ్యాక్టరీ ఆగిపోయినట్టు యంత్రాల మరలు వొదులుచేసెయ్య గలం. తలుచుకుంటే వొక్కటి అమ్ముడుపోని రద్దు సామాను

తయారు చెయ్యగలం. అప్పుడు దమ్మిడీ అయినా లాభంవచ్చే ఫ్యాక్టరీ స్పెయిన్‌లో ఒక్కటీ వుండదు."

"కాదు, అది సరయిన మార్గంకాదు", మరొక గొంతుక అంది — "పనివాడన్నవాడు ఎవడూ పస్తుగడుపుతో వుండ కూడదు."

"పనిచేసేకాలం ఎనిమిది గంటలుండాలి" ఎన్నో గొంతుకలు కలిసి వినిపించాయి.

"అవును, తొమ్మిదిగంటలు పోయి ఎనిమిదిగంటలు కావాలి"

"జీతాలు పెరగాలి. యూనియను నిశ్చయించిన జీతాలుండాలి."

ఇలాంటి ఘర్షణ తెల్లవారేవరకూ నడపవచ్చు. కాని ఇంతలో ఒక గొంతుక వినిపించింది. ఇంతవరకూ ఆ గొంతుక పలకకండా వూరికేవుంది. ఆగొంతుక గదంతా మెరుపు మెరిసినట్టు వ్యాపించింది.

"మనం ఇక్కడ ఘర్షణ సాగించడానికి సమావేశంకాలేదు.

"మనమీద జరిగిన దౌర్జన్యం ఎదిరించడానికి సమావేశమయ్యాం.

"మీలో శక్తి వుందా?

"వుందనో, లేదనో ఏదో ఒకజవాబు చెప్పండి.

"నాకు తెలుసు, మూడు పెద్ద బాంబులు లభిస్తాయి మనకి.

"అన్నిటికంటే అధికలాభం తెస్తూన్న పెద్దహాల్లో ఒకటి వుంచాలి.

"రెండోది యజమాని సకుటుంబంగా వుంటూన్న బంగాళా దగ్గిర పెట్టాలి.

"బహుశా అందులో ఏదన్నా పేలకపోవచ్చు, అందుకని మూడోది మా దగ్గర పెట్టుకోవాలి.

"మనలో పేర్లు రాసి లాటరీ వేస్తాం.

"ఎవరిపేరు లాటరీలోవస్తే వాళ్లు ఈ పని చెయ్యాలి."

హత్యచెయ్యడం, ఫ్యాక్టరీ తగల బెట్టడం— ఈ తీర్మానం రాగానే మీటింగంతా కొంత సేపు నిశ్శబ్దంగా వుండిపోయింది. తీర్మానంలోవున్న దారుణత్వం వల్ల కొంతమందివూరుకున్నారు. తరవాత పడే శిక్షకి భయపడి కొంతమంది మాటాడలేదు.

మానసికంగా అందరికీ ఈతీర్మానం ఇష్టంగానే వుంది. కాని శారీరక వ్యామోహం బాధిస్తోంది. ఇది చెయ్యడానికి నాకు ధైర్యం వుందంటూ ఒక్కడూ ముందుకిరాలేదు.

గస్తాను ఉద్రేకంగా లేచి నుంచున్నాడు. కాలుస్తూన్న సిగరెట్టు రెండుమూడు దమ్ములు గట్టిగా పీల్చాడతను. తరవాత లాంతరు కిందికి వెళ్లినుంచున్నాడు. లాంతరు వెలుగులో అందరికీ అతడి మొహంలోని దృఢత్వం కనపడుతోంది.

కుట్రకోసం సిద్ధంగావున్న సమావేశకర్తలందరికీ స్పష్టంగా తన గొంతుక వినిపించాడు గస్తాను.

"ఇప్పుడు చెప్పిన వాళ్లందరూ దూరం ఆలోచించకండానో, దౌర్జన్యం పురికొల్పుతూనో చెప్పారు. వితంతువులికి, దిక్కు

లేని వాళ్లకి పొరనిధి కావాలనో, పెన్షను దొరకాలనో మీరు కోరుతున్నారు. అందరూ ఇదే కలగంటున్నారు.

"హర్తాళు చేద్దామంటారా?

"ఎందుకోసం?

"ఇంట్లో బియ్యంలేకపోగానే, కడుపు వీపుకిఅంటుకుపోగానే-మళ్లీ మొహం వేలవేసుకుని పనిలోకి వెళ్లవలిసే వస్తుంది. మొదట ఆకలితో చవ్వడమూ, తరవాత మిల్లు యజమాన్ల షరతులు వచ్చినట్టు ఒప్పుకోడమూ జరుగుతున్నది.

"బాంబుల తీర్మానంలో మనపిరికితనమే కనిపిస్తోంది. నన్నడిగితే నేను ఎవ్వరినీ చంపాలని కోరను. కసితీర్చుకునే భారం నామీద వొదిలి పెట్టండి; నేనెలాంటి ప్రతీకారం చేస్తానో మీరే చూద్దురు గాని.

"ప్రతీకారం జరగడంతో సరిపోదు, మళ్లీ వొకంతట మరపు రాకండానూ చేస్తాను."

గఫ్ఫారు తెచ్చిన ఈ ప్రస్తావన కొంతమంది ఎదిరించారు, గల్లంతు చేసి. కాని తక్కినవాళ్లంతా ఈ తీర్మానం హృదయ పూర్వకంగా అంగీకరించారు.

పిరికితనం కలవాళ్లు భయంవల్ల వొప్పుకున్నారు.

వీరత్వంకలవాళ్లు గఫ్ఫారు కళ్లల్లో అవుపించిన భయంకర మయిన కసి పసికట్టి అంగీకరించారు.

పెద్ద మెరుపుల్తో వచ్చి వర్షం లేకండా చెదరిపోయిన మేఘం లాగ ఆ వేడి వేడిలో సభ ముగిసింది.

మర్నాడు సరిగ్గా ఫ్యాక్టరీ యజమాని బంగళాముందు నుంచుని బిచ్చమడగడం మొదలుపెట్టాడు గస్తారు.

అతణ్ణి బెదిరించారు. లాలించి చెప్పారు. అన్నివిధాలా ప్రయత్నించి చూశారు. ఉఁహూఁ, లాభంలేకపోయింది.

తాను నుంచున్న దగ్గరనించి వొక అంగుళమన్నా కదల్లేదు గస్తారు.

ఫ్యాక్టరీ యజమాని తన బంగళాలోంచి బయలుదేరి ఆఫీసుకి వెళ్ళినప్పుడూ అతడలాగే నుంచుని వున్నాడు.

యజమాని బ్యాంకుకి వెళ్ళినప్పుడూ, తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చినప్పుడూ కూడా అలాగే నుంచుని అడుక్కుంటున్నాడు.

యజమానిగారి భార్య చర్చినించి తిరిగి వచ్చినప్పుడూ, చక్కని చుక్కల్లాంటి ఆమె కుమార్తెలు గువ్వ పిట్టల్లాగ ముస్తాబై, డ్యాన్సింగుహాలుకి వెళ్ళినప్పుడూ గస్తారు అలాగే నుంచుని వున్నాడు.

అందంగా వున్న ఇనపగేటు దగ్గిరే, వొక కిటికీ కింద నుంచున్నాడు గస్తారు. పైన కిటికీకి పట్టు తెరగుడ్డ గాలికి కదులుతోంది.

ఒంటిమీద చింకిగుడ్డలు వేసుకునీ, మొండిచెయ్యి మీది కెత్తీ, బలపపు రాతిగోడని ఆనుకునీ, అక్కడే అతను ఉదయం నించీ రాత్రిదాకా నుంచుని, బిచ్చమడుగుతున్నాడు. అతడి మెడలో వొకబల్ల వేలాడుతూ వుంది. బల్లమీద పెద్ద పెద్ద అక్షరాలు రాసి వున్నాయి, ఇలా:

"మార్టిక్ పేన్‌లవ్ ఫ్యాక్టరీలో ఈ కూలీ చెయ్యిపోయింది. అంచేత పొట్టకూటికి అసమర్థుడయిపోయాడు."

---

# డే ౪

రహీము వొక పేదకుర్రాడు. దిక్కూ మొక్కూ లేనివాడు. నా అన్నవాళ్లెవళ్లూ లేరు అతడికి. ఇదీ అనిచెప్పదగ్గ వొకపనీ అతడికి లేదు. ప్రకృతి వొళ్లోనే అతడి హృదయం పెద్ద పెద్ద భావాలతో పరిణతి పొందింది.

రహీము కళ్లు పగటివేళ అద్దాల్లా వుంటాయి. సాయంకాలం అవి మాసిపోయినట్లు కాంతి లేకండా అయిపోతాయి. రాత్రిళ్లు చీకట్లో మూసుకుపోతాయి. తిరిగి అరుణోదయంతో పాటు ప్రకాశవంతంగా విడతాయి. ప్రభాతం వికసించిన గులాబీకాంతిలో అతడి కళ్లురెండూ బంగారంలాగ తళతళా మెరుస్తాయి. శరత్కాలం బంగారం ఎండ అతడి పొడవాటి తలవెంట్రుకలమీద, తెల్లటి తామ్రం మొహం మీద పడ్డప్పుడు అతడి కళ్లు అగ్నిజ్వాలల్లా మండుతాయి.

శరత్తులో పంటచేలమీద మంచుపడి వుండడ మతడు చూస్తాడు. వాటిమీద ఉషస్సు తాలూకు గులాబీరంగు వ్యాపించడమూ, దూరంగా ఆకాశం ఆరంభంలో నీలి నీలి అడవులమీద పల్చటిపొగమంచు సన్నని తెరగా చుట్టుకోడమూ వొక బూడిదరంగు కుందేలు పంటచేల తరంగాలు కదిలించి, ఇంద్ర ధనుస్సులు సృష్టిస్తూ పరిగెత్తుకు పోవడమూ, పిట్టలు మధురగానం చేసి వొకదాన్నొకటి మేలుకొలుపుతూ, ఎగురుతూ, పోవడమూ, చిన్న చిన్న కొమ్మలు పిట్ట లెగిరిపోవడం

తోనే బరువుతగ్గి మెల్లి మెల్లిగా వూగడమూ—ఇవన్నీ అతడు చూసేవాడు.

ఒరలో బందింపబడ్డ చంద్రహాసం కత్తిలాగ అతడి తీక్షణమైన చూపులో పెద్ద పెద్ద కోరికలేవో మెరుస్తూ వుండేవి. జోళ్లులేని అతడి అడుగుల్లో యువరాజుగారి అరబ్బీ గుర్రాల తేలిక నడక కనిపించేది. అతడి శరీరంలోని ప్రతీ కండరంలోనూ ఉత్సాహమూ, ఉల్లాసమూ తొణికిసలాడేవి.

డేగ వేటంటే అతడికి లోకం కనిపించేదికాదు. ఏనుగు దంతాల్లాంటి తనచేతులమీద, నల్లటి పొడవాటి జుత్తునిండిన తల పెట్టుకుని, దూరంగా డేగవేటగాళ్ల చిత్రమైన కేకలూ, వాళ్ల పరుగులూ విన్నప్పుడు అతడి వెర్రిసరదా చెప్పతరం కాకుండా వుండేది. వేటా—వేటలో ఆ గగ్గోలూ—తరవాత వొక క్షణం వేట వేటంతా నిశ్శబ్దమైపోతుంది. ఆశ్చర్యకరంగా గంభీరమైన నిస్తబ్దత్వం నాలుగు దిక్కులా ఆవరిస్తుంది.

తరవాత?

తరవాత వొక తెల్లటి గీతా, దానికింద నల్లటిగీతా వొక దానిమీద వొకటి ఆకాశంమీద పడతాయి. సుళ్లుతిరుగుతూ అవి నీలాకాశంమీదికి వెళతాయి. వాటిని చూడ్డంలోనే మోచేతులానుకుని నుంచుంటాడు రహీము. అతడికళ్లు విప్పారతాయి. చూపు స్థిరంగావుంటుంది. ఉత్సాహంతోనూ, ఉల్లాసంతోనూ అతడి పెదవులు విడిపోతాయి.

తరవాత?

తెల్లటి చుక్కా, నల్లటిచుక్కా వొక దాన్నొకటి కలును కుని తత్క్షణం విడిపోతాయి; వెంటనే కిందికి పడిపోవడం ప్రారంభిస్తాయి. తెల్లటిది వూగుతూ జోగుతూ దుర్బలంగా పడిపోతూ వుంటుంది. నల్లట[illegible] మీాదుగా, తిన్నగా వొక బల్లెంలాగా— బాణంలాగా దిగుతుంది.

అప్పుడు ?

అప్పుడు నీలాకాశం వేటకాళ్ల కేకల్తో ప్రతిధ్వనిస్తుంది. డేగ గోళ్లలో గుండెలు చీలికలై పోయి కిందపడుతూన్న కొంగని, దాంతో విజయగర్వంతో దిగుతూన్న డేగనీ చూడడానికి గుర్రాలు పరిగెత్తిస్తారు వాళ్లు. వాళ్లతో రహీము కూడా పరిగెడతాడు. గెలిచిన డేగకళ్లు కట్టేసి దాని యజమాని దాన్ని చేతిమీాద నిలబెడతాడు. గెలిచిన సంతోషంతో కంపిస్తూనూ, పోరాటంలో అలిసిపోయిన్నీ వున్న దాని రెక్కలు అతడు దువ్వుతాడు.

అప్పుడు సంతోషంతో చప్పట్లుకొడుతూ అరుస్తాడు రహీము.

రహీము తరుచు వేటకాళ్లతో యువరాజుగారి డేగల చావిట్లోకి వెళ్లేవాడు. అక్కడ డేగలుపెంచే మనిషి బంగారం గిన్నెలో పన్నీరుతెచ్చి యువరాజుగారి డేగ పంజాలు కడిగేవాడు. తరవాత రాజుకొడుకుని తుడిచినట్టు చక్కని పట్టు రుమాల్తో అతి జాగ్రత్తగా తుడిచేవాడు. తుడవడం ముగిశాక దాని మెడమీాద నెమ్మదిగా చేత్తో నిమిరేవాడు. పెదవులా

నించి ముద్దులు పెట్టేవాడు; లాలించేవాడు, సుఖంతో వాళ్లు మరిచినట్టు కళ్లు మూసేది డేగ. అతడి భుజంమీద తలపెట్టేది; వేటగురించి తియ్యని కలలు కనేది.

తన పదేళ్ల ఆయుర్దాయంలో వొకవేళ పోతే పోనీ ఏంగాక,— లేదా తనపదివేళ్లలో వొక వేలే పోతేపోనీ ఏంగాక— వొక్కసారి రహీము యువరాజుగారి ఆ డేగని—వొక్కసారి చేతిమీద పెట్టుకుని దువ్వగలిగితేనా!

కాని ఆడేగని ముట్టనైనా ముట్టలేడు రహీము. ఏమంటే అది పిట్టల్లో రాజు. డేగ పిట్టల్లో రాజు కనక నే రాజబంధువులూ, ధనవంతులూ, ఘరానామనుష్యులూ తప్ప తక్కిన వాళ్లు డేగలు పెంచడంకానీ, డేగవేట సాగించడంకానీ చెయ్యకూడదని యువ రాజుగారి ఆజ్ఞ.

యువరాజుగారి ఆజ్ఞకి తిరుగంటూ లేదు.

డేగలవాడి వాకిళ్లు అల్లికపని చేసిన మేజోళ్లవంటి సంచుల్లో మూసేసి వుంటాయి. వాటి కళ్లు సన్నని డోరియాలున్న మెత్తని ముఖమలు గుడ్డతో కట్టేసి వుంటాయి. అవి తాజా తాజా కవాబు మాంసం తింటాయి. వాటికోసం ప్రత్యేకం వున్న సేవకులు చిత్రంగా చేసే ధ్వనులు విని వాళ్లతో మర్యాదగా మాట్లాడుతాయి.

అలసత్వంతో అరమూతలు పడుతూన్న డేగల పెద్ద పెద్ద కళ్లు చూసి రహీము మనస్సు ఏదోలా అయిపోయేది; ముఖ్యంగా యువరాజుగారి డేగని చూసినప్పుడు చెప్పనే

అక్కరలేదు. దాని కళ్లకి ఎర్రని మఖమలు పట్టీ కట్టి వుండేది. దాని పంజాలకి ఎర్రని మేజోళ్లు తొడిగి వుండేవి. దాని కాళ్లకి వెండిమువ్వలు వుండేవి. వాటికి పట్టుతాడు వేలాడుతూ వుండేది. దాని చూపులో గర్వంతో కూడిన నిర్లక్ష్యం నిండివుండేది. దాంతో దాని వీరగాధలుకూడా మెరుస్తూ వుండేవి.

కొత్తగాపట్టుకున్న పిల్లడేగలికి వేటమప్పేవాళ్లు. వాటిని చీకటి గదుల్లో బంధించివుంచే వాళ్లు. ఆకలితోనూ, క్రోధంతోనూ అవి వాళ్లు పోంగించేవి. రాత్రిళ్లు వాటికళ్లకి పట్టీలు కట్టేవాళ్లు. వాటి ఆహారం వేటాడడంకోసం అవి రెక్కలు చాపేసి వడికిపోయేవి. వేటకి పిలుపు ఎపుడు వినిపిస్తుందా అని మెడలు పోంగించి పైకిచాచేవి. అప్పుడప్పుడు గూళ్లల్లోంచి తీసి రహీము వాటిని చేతిమీద కూచో బెట్టికునేవాడు. వాటి కళ్ల కట్లు విప్పి వాటికి వెలుతురు చూపించేవాడు. హటాత్తుగా అవుపించే వెలుతురు కళ్లకి జిగేలు మనేది వాటికి. అప్పుడు గట్టిగా అతడి వేళ్లు పంజాలతో పట్టుకునేవవి. కాని కొద్ది క్షణాల్లోనే వెలుతురుకి అలవాటుపడి వూరుకునేవి. అపుడు రహీము వాటికి తాజా మాంసం తినిపించేవాడు. ప్రేమగా వాటిని వేళ్లతో దువ్వేవాడు.

అయితే ఏం లాభం? ఈ డేగలతో ఆడుకుని రహీముకి తృప్తి కలిగేదికాదు. వీటిని చేతిమీద పెట్టుకునే సరదా అతడికి తీరిపోయింది. వీటిలో దేనికీకూడా యువరాజుగారి తాతారు డేగలాంటి రెక్కలూలేవు, దానిలాంటి ధీమా, శక్తీకూడాలేవు.

అయితే కొత్త డేగలికి వేట నేర్పడం చూస్తే బ్రహ్మానందంగా వుండేది దతడికి. క్రమంగా వాటి స్వాతంత్ర్యం అవి మరిచి పోయేవి కొత్తడేగలు. దాంతో అవి గంభీరముద్ర వహించేవి; చెప్పినట్లు చేసేవి; కొయ్యలమీద కూచుని వూగడం మొదలెట్టేవి.

మొదట కొత్తలో వాటి రెక్కలు విప్పి స్వేచ్ఛగా ఎగరడం నేర్పేవాళ్లు. కాని అప్పుడు వాటికి గాలిపడగలాగ తాడుకట్టే వుండేది. రాను రాను అవి డేగల పెద్ద పిలుపు వినిపించగానే, కొంగరెక్కలూ, తయారుచేసిన నకిలీ పిట్టలూ పట్టుకోడం నేర్చేసుకునేవి. అప్పుడు వాటిరెక్కలకి కట్టిన తాళ్లు విప్పేసే వాళ్లు. తయారుచేసిన పిట్టబొమ్మలు తాడుకట్టి డేగలపెద్ద ఎగిరేస్తూ తిప్పుతూవుంటే ఎంతసరదాగా వుంటుందని! ఆపిట్ట బొమ్మల గుండెల్లో వేడివేడి తాజా కోడిగుండెకాయ పెట్టివుండేది. డేగలు ఎగిరి ఆ పిట్టబొమ్మలమీదపడి వాటి గుండెలు చీల్చేసేవి. దాంతో, లోపల పెట్టికట్టిన కోడి గుండెకాయలు వాటికి బహుమతిగా లభించేవి. రక్తంమీద లాలసత్వంతో మనిషిమాట వినడం వాటికి అలవాటయి పోయేది. కొత్తలో పట్టుకున్నప్పుడున్న క్రోధం క్రమంగా మాయమైపోయేది. చివరికి యజమాని చెప్పినట్టు ఎగరడమూ, తిరిగీ వచ్చెయ్యడమూ వాటికి పరిపాటి అయిపోయేది. ఇక పారిపోదామన్న వూహే వాటికి వుండేదికాదు. దేన్ని వేటాడిందికీ యజమాని ఇనాం ఇస్తాడో, దేని వెనక ఎగిరి పరిగెత్తాలో అని ఎదురుచూస్తూ

ధీమాగా అవి జోగుతూ వుండేవి. ఇసారా ఇవ్వడమే తడవూ, అలవాటు ప్రకారం రివ్వుమని వంకరగా ఎగిరివెళ్లి వేటపిట్ట మీాదికి వురికేవి. అపుడిక కాళ్ల కట్లు విప్పేసినాసరే, వెనకటి స్వేచ్ఛకోసం వెదికేవి కావవి. స్వేచ్ఛమీాద అభిలాషే వుండేది కాదుమరి.

దాంతో వాటి సామర్థ్యాన్ని బట్టి ఏ డేగ దేన్ని వేటాడగలదో, ఆఖరతమాలు నిశ్చయించేవాడు వాటినిపెంచిన "డేగల పెద్ద."

ఒకటి పోలుగులు వేటాడ్డంలో బహాద్దురైతే, వొకటి తీతికలు వేటాడ్డంలో గాజు. ఒకటి పిచ్చికలు చంపడంలో వస్తాదైతే, ఒకటి దేన్నీ పట్టలేని చచ్చు. ఇలావుండేవి వాటి తరగతులు.

పెద్దడేగలు చెవుల పిల్లులూ, కొంగలూ, గద్దలూ వేటాడ్డానికి ఉపయోగించేవాళ్లు. గద్దలు వేటాడే డేగలు కాకులకంటేనూ చికాకయినవి. అవి లొంగడానికి ఎన్నితిప్పలన్నా పెట్టేవి. వాటిగోళ్లూ, ముక్కులూ చాలా భయంకరమైనవి.

పెద్దజాతి డేగలు వేట నేర్పినపుడు, మొదట పిచ్చికల్లాంటి పిట్ట బొమ్మలు ఎగరవేసి వాటికి శిక్షణ ఇచ్చేవాళ్లు. ఆపిచ్చికల గుండెల్లో డేగలికి నచ్చిన ఆహారం పెట్టేవాళ్లు. ఆ ఉత్తుత్తి పిచ్చికల్ని పట్టుకుని వాటి గుండెల్లోని ఆహారం తినేసేవి డేగలు.

కొన్నాళ్లయాక దెబ్బతిన్న పక్షులు వాటిముందు వదేసి మప్పేవాళ్లు. దెబ్బతిన్న పక్షుల గుండెలు చీల్చేసి, అనాయాసంగా వాటిగుండెకాయలుతినేసేవవి. దాంతో బతికిన పిచ్చికలు చంపె

య్యాలన్న క్రౌర్యం వాటి మనస్సులో రేకెత్తేది. క్రమంగా అవి పెద్ద పెద్ద పక్షులు వేటాడ్డం నేర్చుకునేవి. వేటంటే వెర్రెత్తి నట్టయి, వేటకోసమే. ఎదురుచూసేవి. ఇలా ఘోరమయిన క్రూరత్వం వాటి గుండెల్లో నాటుకునేవి. వేట దొరికే సరికి రక్తం నిషాలో వొక గుటికెడు రక్తం తాగాకగాని వూరుకునేవి కావవి.

వేటాడిన పక్షి రక్తాలు కార్చుకుంటూ కిందపడి గింజుకునేది. డేగలు వెళ్లి యజమాని చేతిమీద వాలి, రాజులాగ జిలుగులు చెక్కిన వెండిగిన్నెలో మసాలా వేసిన కవాబుముక్కలు తినేవి. అవి రాజుడేగలు రాజులాగే వేట నేర్చుకునేవి.

వాటి కళ్లల్లో నిర్లక్ష్యమూ, గర్వమూ ప్రకాశిస్తుంది. కళ్ల పట్టీలు విప్పేసరికి వాటికళ్లు నల్లగా వుంటాయి. వేటకోసం ఎగిరేటప్పుడు కరిగిన బంగారంలా మెరుస్తాయి. భయంతో అగుస్తూ పారిపోతూన్న పక్షిని వెంటాడినప్పుడు జ్వాలల్లా మండుతాయి.

ఈ డేగలన్నీ ఎండలో మండుతూన్న రహీము చేతులమీద వాలేవి. కాని ఇందులో వొకటీ యువరాజుగారి ఆడేగ ముందు దిగదుడుపుకైనా పనికిరాదు.

యువరాజుగారి డేగకళ్లు చక్రవర్తికళ్లు. ఆచూపులో ఎంత ధీమా, ఎంతనిర్లక్ష్యం!

ఈ సాధారణ డేగలతో సర్దా తీరిపోయింది రహీముకి. అవి నరదాగా రెక్కలు విప్పేసరికి వాటి ముక్కు పట్టుకుని గట్టిగా

నాకొక్కేసి వొదిలిపెట్టేసే వాడతను. చేతిమీంచి కింద పడేసే వాడు వాటిని. గెద్ద అరిచినట్టు అరిచి వాటిని చికాకుపెట్టేసే వాడు. నిజంగా గెద్దే అనుకుని అవి కూళ్ళల్లోంచి ఎగిరి వచ్చేసేవి. అలాంటప్పుడు వాటి యజమానులు రహీముని చెడా మడా తిట్టేవాళ్ళు.

యువరాజు ప్రతీరోజూ అరబ్బీ గుర్రం మీదెక్కి వెళ్ళేవాడు, డేగ వేటకి. జరీపని చేసిన ఎర్రటి ముఖమలు దుస్తులు వేసుకునే వాడతడు. తాతారీ డేగ కాండిమువ్వలు ఘలు ఘలు మనిపిస్తూ ఎగిరేసరికి యువరాజు హృదయంలో సంగీతం మోగేది. పెద్ద పెద్ద నిట్టూర్పులు తీస్తూ, ఉదయకాలపు పిల్లగాలులు సారాయిలా ఆస్వాదించి ఉషారెత్తేవాడతను.

ఒకనాడు యువరాజుగారి డేగ పాలలా తెల్లగావున్న వొక కొంగని వేటాడి గుండెలు చీల్చేసింది; రక్తంలో ముంచెత్తింది. కొంగ వొక దగ్గిర పూదిలో పడిపోయింది. వేటకాళ్ళు పరిగెత్తుకు వెళ్ళారు. వచ్చీప్రాణం పోయీప్రాణంతో గిజగిజలాడుతూన్న కొంగని తీసి పట్టుకు వచ్చారు.

కాని డేగ పత్తా కనపళ్ళేదు.

బహుశా అది ఇంకో పిట్టని వేటాడుతూ వెళ్ళిపోయి వుంటుంది.

లేదా నల్లటి నీళ్ళలో తన నీడ చూసి బెదిరిపోయి వుంటుంది.

కాకపోతే, సంతోషంతో గాల్లో ఎగురుతూ పారిపోయి వుంటుంది.

ఎంతో వెదికారు దాన్ని. ఎన్నెన్నో ముద్దుపేర్లతో పిలి చారు. ఈలల్తో అడివంతా నింపేశారు. కాని లాభంలేక పోయింది. అంతా వ్యర్థప్రయాసమే అయిపోయింది.

డేగల పెద్ద మొహం మీద గుర్రం కమ్చీతో కొట్టాడు యువరాజు. అతణ్ణి రక్తంలో ముంచెత్తాడు.

గట్టూ పుట్టా, ఏరూ నీరూ, అడివీ గిడివీ అనకండా అరబ్బీ గుర్రం పరిగెత్తించి తిన్నగా కోటలోకి వచ్చేశాడు యువరాజు.

అతడి పెదవులు బిగుసుకునే వున్నాయి.

కనుబొమలు ముడిపడే వున్నాయి.

ఎక్కడా దొరకలేదు యువరాజుగారిడేగ.

కాని రహీముకి దొరికిందది. ఒక రేగుతుప్పలో పట్టుతాడుతో ట్టిన దాని వెండి మువ్వలు తగులుకున్నాయి. శత్రువుల అక్ర మణ ఎదుర్కోడానికి సిద్ధంగా వుందది. గోళ్లతో డొంకలు పట్టుకుంది. రెక్కలు బారచాసేసింది. నోరుకొంచెం వెళ్ల బెట్టి మెడ చాసేసింది. దాని అవయవాలన్నీ నిరాశతో అవశమై పోయాయి. ఆకలితో వుందది; మృత్యువుకోసం ఎదురు చూస్తోంది.

పచ్చటి చెట్టునిండా ఎర్రటి రేగుపళ్లు వేలాడుతున్నాయి. చెట్టుమీద యువరాజు డేగ రత్నాలు చెక్కిన పచ్చటి పెద్ద బాలీసు మీద కూచుని చక్రవర్తి యుద్ధం ప్రకటిస్తున్నట్టుంది.

చూసీ చూడ్డంతోనే వెళ్లి డేగని విడిపించాడు రహీము.

ముళ్ళల్లో చిక్కుకున్న దానికాళ్ళ మువ్వలు విడిపించడానికి
[illegible] చేతులు పడినాయి.

యమున [illegible] గు చిక్కున వెండిమువ్వలు రహీము
చేతిలో [illegible]. [illegible] అతని హృదయమూ
ఆనంద[illegible] ప్రతిధ్వనించింది.

రహీము [illegible]. అతడి [illegible] కూచుం
దది. [illegible] అతడి చెయ్యి పట్టుకుంది. రహీము
ఆనందం[illegible].

[illegible] అతడు [illegible] పట్టుకున్నాడు. ఇప్పుడు
తనదే అది. ఈ [illegible] ఈ పెద్ద [illegible]లదేగా—
ఎవరి[illegible]— [illegible] అన్యులకు తనదే. తనదే అది.

[illegible] వాడి [illegible]. అన్యంగా తనదే అది.
[illegible] పంజరం
[illegible] వారికి [illegible], [illegible] తేల
కండా[illegible] [illegible] అడివిలోకి
వెళతాడు [illegible] వాడు లేని
అడివి[illegible] వేటకోసం
[illegible] పరి
చయం [illegible]. జేగ తనని ప్రేమిస్తుం[illegible]. తన సంగతి
చెప్ప[illegible] లేకు— ఎన్నా[illegible] జేగని ప్రేమిస్తున్నాడతడు.
వాళ్ళతల మీద [illegible] బంగారం [illegible]. ఉభ
యుల [illegible] కలిసిపోతుంది. జేగని

తాను తన గుండెలకద్దుకుంటాడు; పట్టుకెళ్ళ మూతని మరిపించేస్తాడు.

డేగని వొక చెట్టుకొమ్మకి కట్టేసి, దగ్గరేవున్న వొక చెరువుకి పరిగెత్తాడు రహీము. చెరువులో ఎవరివో పెంపుడు బాతులు ఈతలాడుతున్నాయి. దొంగచాటుగా వొక రాయితీసి అందులో వొక బాతుని కొట్టేశాడతడు. ఈదుకుంటూ వెళ్ళి బాతు పట్టుకుని వొళ్ళోదాచేసి, ఎవ్వరికీ కనపడకుండా అడవిలోకి వచ్చేశాడు. ఆ బాతు గుండెలు చీల్చి వేడిరక్తం తాగింది డేగ. అది చూస్తూ రహీము ఉల్లాసంతో గంతు వేశాడు. డేగ తనని అసహ్యించుకోలేదు. తనదైపోయిందికి సమ్మతించిందది.

నిజంగా ఆ డేగ రహీముదే అయిపోయింది.

రహీము వేకువనే చీకటితో లేచేవాడు. మంచుతో ముద్దయివున్న ఆకులు తొక్కుకుంటూ అడవిలోకి వచ్చేవాడు. అతడి అడుగుల చప్పుడుకోసం కనిపెట్టుకుని వుండేది డేగ. స్థిరమయిన చూపుల్తో, అతడు రావడం వినేది. మెడ చాచేది. రహీము చెయ్యిచాచడమే తడువు, పంజరంలోంచి పైకి వచ్చేసేది. అతడి చేతిమీద కూచునేది. ఎగరడానికి వుంకించినట్టు రెక్కలుచాచేది; కాని ఎగిరిపోయేది కాదు. కాని వూరికే ఎగరడం సూచించేది; అంతే. తరవాత క్రమక్రమంగా వెలుతుర్లో ప్రకాశించే మైదానం మీంచి ఇద్దరూ పరిగెడుతూ బయల్దేరేవాళ్లు; డేగా రహీమునూ.

వాళ్ల కళ్లు ఎర్రటి ఆకాశంలో వేటకోసం వెదికేవి. దూరపు కొండలు పచ్చి చీకటిలా అవుపించేవి. వాటిమీద నల్లటి ముసుగు లాగ చెట్లు కదలకండా నిద్రపోతూవున్న పిట్టలతో వాటికొమ్మలు బరువుగా వుండేవి. రానురాను ఆకాశం బంగారమూ, సిందూరమూ కలిసి మెరిసేవి. నల్లటి రేఖలన్నీ సిలిసిలిగా మారిపోయేవి. గుడ్లగూబలు ఎగిరి తమగూళ్లల్లో దాక్కునేవి. పగలు తిరిగే పక్షులు రెక్కలు విదుల్చుకుంటూ మేలుకునేవి. మొదట మృదువుగా అరిచేవవి. తరవాత కలకలారావాల్తో గూళ్లువిడిచి వెలుగులోకి వచ్చేసేవి; చల్లగాలిలో బాణాల్లాగ ఎగరేవి; విహారించేవి.

రహీమూ, తనడేగా ఈ పక్షుల్ని వేటకి అక్కర చేసే వాళ్లు కాదు. వాటిని వొదిలేసి ఇంకా తిరుగుతూనే వుండేవాళ్లు. పిగిలి పిట్టలూ, పిచ్చికలూ, తీతికలూ— ఇవన్నీ చిన్నపిట్టలు. వేటకి పనికిరానివి. బురదా, వూబీ వున్న దగ్గిరనించి కొంగలూ నత్తగొట్టూ, పాములనార్లూ అరిపడమూ, అవి రెక్కలాడించడమూ వినపడేది. అదిగో అవే వాళ్ల వేటకి తగిన పక్షులు. వాటి ఇసారా దొరకడంతోటే రాజు డేగని మీదికి విసిరేసేవాడు రహీము.

ఉదయిస్తూ వున్న సూర్యుడి కిరణాల్లో డేగ రెక్కలు మెరిసేవి. రహీము వ్యగ్ర హృదయంతో వాకేదృష్టితో చూసేవాడు. మంచు విడిపోయిన ఆకాశం మీద ముదుచుకుని ఎగిరి

పోయేదది. పిట్టల కలకలశబ్దాలు పరిహసిస్తున్నట్టు మోగేవి, దానికాళ్ల వెండి మువ్వలు.

డేగకి భయపడి కొంగలు పల్టీలు కొట్టేవి. నీళ్లలో పడిపోయేవి. మెడలు చాసేసి, తమ తెల్లటి శరీరం పైకి చూపిస్తూ, వీలులేని స్థలాల్లో దాక్కుందికి తెలివి తక్కువగా ప్రయత్నించేవి. డేగని తప్పించుకుందికి రెక్కలుచాచుకుని, వలయాకారంగా ఎగురుతూ మీదికి పారిపోయేవి. డేగ తమ దగ్గిరికి రాకముందే బతికిపోదామని వెర్రి వెర్రి ప్రయత్నాలు చేసేవి. భయంతో వాటి గుండెలు ఎండిపోయేవి. ప్రభాత వాయువులో విల విల లాడే గరికిపోచల్లా వాటి వాటి హృదయాలు వడ వడా వడికి పోయేవి.

కొంగల మందలో అన్నిటికంటే పెద్దది— బాగా బలిసింది— సరిగా తనపైన ఎగురూతూ వుండేది ఎంచుకునేది డేగ. ఎప్పుడూ తన శక్తి వ్యక్తపరచాలన్న అభిలాషతోనే వుండేదది. అంచేత పెద్ద కొంగ మీదే తనచూపు నిలిపేది.

ప్రశాంతమయిన గాలిలో తిన్నగా తారాజువ్వలాగ మీదికి ఎగరడమంటే సరదా డేగకి. ఒక కిరణంపట్టుకుని వెళ్లినట్టు నిటారుగా ఆకాశం మీదికి లేచిపోయేదది. మహావేగంతో, అన్ని పక్షుల్ని వోడించేసి, అన్నిటికంటే మీదికి వెళ్లిపోయేది. అప్పుడది చిన్నపిచ్చికకంటేనూ చిన్నదిగా అవుపించేది. అక్కణ్ణుంచి రెక్కలువిప్పేసుకుని చప్రుస, బాణం కొట్టినట్టు కిందికి దిగేది. తిన్నగా కొంగమీదికి— భయంతో

మెడ వంకరగా పెట్టుకున్న కొంగమీదికి— వచ్చిపడేది. రెండూ వాళ్ళ రాతిముక్కలా తిన్నగా కిందికి పడిపోయేవి.

డేగ రెక్కగానీ, దాని చిన్న వెంట్రుక ముక్కగానీ వంకర కావడం కనపడేదికాదు.

అప్పుడు?

అప్పుడు రహీము చువ్వలా పరిగేత్తేవాడు. బురదలోంచీ నీళ్ళలోంచి ఈదుకునీ,— అవసరమయితే అడివి తుప్పలు దాటుకునీ పరిగెత్తుకు వెళ్ళేవాడు రహీము.

మెరుపులా వెళ్ళి, దెబ్బతిని పడిపోయిన కొంగ దగ్గరికి— వచ్చే ప్రాణం పోయే ప్రాణంతో వణికిపోతూ, రక్తాలు కార్చుకుంటూన్న కొంగ దగ్గిరికి చేరుకునేవాడతడు. చావుభయంతో ఏమో కొంగ దాని పొడవాటి ముక్కుతో డేగ రెక్కలు కరిచేస్తుందేమో ! అదీ రహీము భయం.

రహీము వెళ్ళేసరికే కొంగని చావుదెబ్బ కొట్టేసేది డేగ. పెద్ద పెద్ద గుడ్లతో యజమాని దిక్కుచూసేదది. తాను వేటాడిన దాని వేడి వేడి గుండెకాయ కోసమూ ఎదురు చూసేది.

ఇదయాక ఆ రోజంతా డేగ మరి ఎగిరేదికాదు.

డేగని గాల్లో విసిరేసి, దానికి ఉషారిస్తూ ముందు పరిగెత్తేవాడు రహీము.

రెండు మూడుసార్లు రెక్కలు ఎగరవేసి రహీము దగ్గిరికి వచ్చేసేది డేగ.

ముసిముసి నవ్వులు నవ్వేవాడు రహీము.

అతడి భుజం మీద వాలేది డేగ; అతడి మొహం దగ్గర మొహం పెట్టేది.

చిన్నపిల్లల ఆటలా ఇలా ఎగరడం డేగకి నచ్చేదికాదు.

రహీము కూడా వూరుకునేవాడు.

రహీము ప్రాణంపెట్టి ప్రేమించాడు ఆడేగని. అంతహెచ్చుగా ఇంతవరకూ దేన్నీ ప్రేమించలేదతడు. ఆడేగే అతడిప్రాణం. అదే అతడి అభిలాష. అదే అతడి సర్వస్వమున్నూ.

దాని రెక్కలెంత పెద్దవో !

దాని చూపులో ఎంత విజయగర్వమో !

ఐతే రహీము రహస్యప్రేమలో వొక బాధ ఎప్పుడూ బాధిస్తూవుండేది. ఎప్పుడో హటాత్తుగా ప్రమాదం వచ్చిపడుతుందని సందేహంగానే వుండేది. అదే అతడి ఆనందం కలతపరిచేది.

బహుశా వున్నట్టుండి ఎప్పుడయినా డేగ తనని విడిచిపెట్టేసి ఎగిరిపోతుందేమో అని అప్పుడప్పుడు భయపడేవాడతడు. వెండి మువ్వలు ఘల్లు మనిపించి అతిణ్ణి వెక్కిరిస్తూ అది తన దృష్టికందకండా మాయమై పోతుందేమో !

డేగ లేకపోతే ?

డేగలేకపోతే తాను బతికి వుండినీన్నీ చచ్చినట్టే.

ఏదో మహాశక్తి డేగరూపంలో ఇలా వుందనిపించేది, అప్పుడప్పుడు రహీముకి. అవును, ఆశక్తే ఇలా భూమ్మీద, మూర్తీ

కిరణాలు కదిలిస్తూ ఎగురుతోంది. తన భుజం మీద కూచుని కొత్త కొత్త ప్రఖ్యాతి సంపాదించుకోవాలని ప్రయత్నిస్తోంది.

ఈ భావం కలగడంతోనే తన అల్పత్వం తనకి జ్ఞాపకం వచ్చేది రహీముకి. డేగదిక్కు కళ్లెత్తి చూడడానికి సాహసం కలిగేది కాదతడికి.

ఇంకో విషయం కూడా బాధించేది రహీముని. తన ఆనందం కళ్లెత్తి చూసేది కాదు డేగ. తన చూపులో చూపు కలిపి ప్రేమ మురిపించేది కాదది.

ఒకనాడు :

రహీము అడివిబయల్లో వెల్లికిలా పడుకుని ఆకాశం చూస్తూన్నాడు. ఆకాశంగుండెల మీంచి మేఘాలు మనిషి భాగ్యంలాగే ఈదుకుంటూ వెళ్లిపోతున్నాయి. అప్పుడప్పుడు బరువుగా, మందంగా నడుస్తూన్నాయవి. ఉండి వుండి పలుకూ వులుకూ లేకండా తేలికగా పరిగెడుతూ పోతున్నాయి. కొన్ని అందంగావున్నాయి. కొన్ని చింపరవందరగానూ వున్నాయి. కనపడకండా గాలి చేతులు మేఘాల వీపుమీద కొడుతూ, ఫలానా చోటని వాళ్ళ నిశ్చయంలేకండా ఎక్కడికో రొప్పుకు పోతున్నాయి. చెట్లూ చేమలూ వడవడా వడుకుతూ, గాలి విషయం రహీము చెవుల్లో వూదాయి.

రహీము తన ప్రాణమయిన డేగకి కథలు చెబుతున్నాడు. పాదుషా హారూన్ రషీదుగారి గుప్తవైభవానికి చెందిన కథలవి.

రషీదు ఆకాలంలో ఎలాంటి పాదుషావో, జాఫరుకూడా అలాంటి మంత్రి. రషీదు తెల్లటి పెద్ద అరబ్బీ గుర్రం మీద గేలపు తీసేవాడు. అతడి భుజంమీద గొప్పడేగ పెద్ద పెద్ద కళ్లు పెట్టుకొని వేటకోసం ఉత్సాహంతో నిరీక్షిస్తూ వుండేది.

నల్ల మేఘాలు,

కనపడని గాలుల దెబ్బతింటున్నాయి,

మనిషి అదృష్టంలాగ,

రహీము నెత్తిమీద ముసురు కుంటున్నాయి.

అరబ్బీ కథల్లోని రాక్షసపట్నంలో గుహల తోరణాల్లా వున్నాయవి.

మేఘాల సందుల్లోంచి మీంది సూర్యకిరణాలు బల్లెం మొనల్లా తొంగిచూస్తున్నాయి.

తల వ్రాపుతూ జోగుతూవున్న డేగ పాదుకల కందో ఏమో, చప్పున తుళ్లిపడి లేచింది కోపంతో; దబాదబా జోరుగా రెక్కలాడించింది; అరిచింది.

కొంతమంది కుర్రాళ్లు తిరుగుతూ తిరుగుతూ అక్కడికి వచ్చారు. యువరాజుగారి తప్పిపోయినడేగ రహీము చేతిమీద వుండడం వాళ్లుచూశారు.

కొంచేపట్లో యువరాజుగారి బంట్రోతులు వచ్చారు; రహీముని పట్టుకున్నారు. రహీముని డేగనీ యువరాజుగారి హుజూరికి తీసుకుపోయారు.

రహీము చేతిలోంచి డేగ లాక్కున్నాడు. ఐనా ఎప్పటిలాగే వుందిడేగ, నిర్వికారంగా, గంభీరంగానూ. ధీమావొదలని కళ్లతో వొక్కసారికూడా రహీముదిక్కు చూడలేదది. అంతేత గుండెల్లో దెబ్బ తగిలినంత బాధ కలిగింది రహీముకి.

బంట్రోతులు డేగని యువరాజుగారి దగ్గిరికి తీసుకుపోయారు. డేగ దొరికిందని పిసరంతయినా సంతోషించలేదు యువరాజు. తప్పిపోయి దొరికిన తనముద్దులడేగతో ప్రేమగా వొక్క మాటన్నా మాటాడలేదతడు. నీచుడొకడు ముట్టుకోవడంతో మైలపోయిందది. దాని రాజు గౌరవం పతితమై పోయింది; కులం చెడిపోయింది.

యువరాజు గంభీరంగా వొకసారి రహీముదిక్కు చూశాడు. రహీముని చూడడంతోనే రాజాజ్ఞా, వేటకి సంబంధించిన శాసనమూ అతడికి జ్ఞాపకం వచ్చాయి. దారుణమైన వొక సంతోషం అతడి హృదయంలో తాండవమాడింది. క్రూరమైన ఉత్సాహంతో అతడి కనుబొమలు ముడిపడ్డాయి. కళ్లు ఎర్రపడ్డాయి. శాసనం కళ్లముందు మూర్తిమంతమై నుంచుంది.

రాజుగారిడేగ దొంగిలించిన నేరానికి పన్నెండు వెండి ముద్రలు జరిమానా ఇవ్వాలి. లేదా, ఆకలితోవున్న ఒకడేగ ముక్కుతో గుండెచీల్చి ఆరుతులాలు రక్తమివ్వాలి.

రహీము నిరుపేద. యువరాజు బాగా ఎరుగునది. విశాలంగానూ, పుష్టిగానూ, పైనగుడ్డ లేకండానూ వున్న రహీము గుండెలదిక్కు తేరిపార చూశాడతడు. మనంబజార్లో కొనబోయే

మేకని ఏవిధంగా మెడా, చట్టలూ నొక్కి-చూస్తామో, అలా రహీము గుండెలు నొక్కి-నొక్కి- చూశా డతడు.

"మూడురోజుల తరవాత మంచి తమాషా అయిన వేట జరుగుతుంది. మీరూ మీ ఇద్దరి కుమార్తెలూ వ స్తే, మీ ఎదట వేట మరింత తమాషాగా వుంటుంది......"

నది అవతలి వొడ్డునివున్న నవాబు గారికి పై విధంగా ఆహ్వానం పంపించాడు యువరాజు.

జైలుగది చీకట్లో రహీము కళ్ళు విప్పారినై. జైలుగది కంటేనూ చీకటి నల్లగా వున్న అతడి కళ్లునిశ్చలంగా వున్నాయి. పగటివేళ గదిలైటి ఎండ వెలుగుకి మాత్రం అద్దంలా రవంత ప్రకాశించే నవి.

మూడు రోజులు గడిచాయి.

యువరాజు వేట బయలుకి బయల్దేరాడు. అతడి వెనక "డేగల పెద్ద" చేతిమీాద, కులంచెడ్డ డేగా బయల్దేరింది. మూడురోజులై ఆహారంలేదు దానికి. ఆకలితో ఘోరంగా వున్న దాని కళ్లు పట్టీతో కట్టేసివున్నాయి. వాడి వాడి గోళ్లు సంచుల్లో బంధించి వున్నాయి.

వాళ్ల వెనక వొకే వరసలో ఆరుగుర్రాలు వస్తున్నాయి. అగ్నిజ్వాలల్లా వొకేరంగులో వున్నాయవి. వాటి మొహాలు నిగ నిగా మెరుస్తున్నాయి. గుర్రాలమీాద మెడల దాకా జరీ దుస్తులు వేసుకున్నాయి. బుటేదారు దుస్తులు వేసుకుని వాటి ముందు వాటి నయినులు నడుస్తున్నారు. ఆరుగుర్రాలూ

నాలుగు ఎఱ్ఱటి రక్తం రంగుబగ్గీ లాగుతూ నడుస్తున్నాయి. బంగారం లతలు చెక్కిన ఎంతో గొప్పగా వుంది బగ్గీ.

బగ్గీలో నవాబుగారి కూతుళ్లిద్దరూ, కూచుని వున్నారు. వాళ్లి వొంటినిండా వజ్రాలూ, ముత్యాలూ కూర్చిన బంగారం నగలు మెరిసిపోతూ వున్నాయి.

బగ్గీ బండి వెనక మఖమలు పరదాలు వేసిన ఆరు సవారీలు నడిచాయి. నవాబు కన్యలదాసీలు ఆరుగురు వాట్లో కూచుని వున్నారు. వాళ్ల జుత్తుల్లో ఎఱ్ఱటి గోరింటపువ్వు లున్నాయి. కళ్లల్లో నల్లటి సురమా వుంది.

సవారీల వెనక పెద్ద ఏనుగు నడుస్తోంది. దాని మీద ఏనుగు దంతం హంబారీవుంది. హంబారీలో నవాబు కూచుని వున్నాడు. నవాబు తలమీద బంగారం గొడుగు వుంది.

ఆరుగురు వేటగాళ్లు కొమ్ముబూరాలు వూది కార్యక్రమం ఆరంభమైందని సూచించారు.

వంకరబూరాల్లోంచి వచ్చినధ్వని వొక చక్రంలా పైకిలేచి అడివంతా ప్రతిధ్వనించి లీనమై పోయింది. బయల్లోని ఎగుడు దిగుళ్లు ఆధ్వనిలో నాట్యం చేసినట్టనిపించింది.

ఉదయాకాశం మీది ఎఱ్ఱటిసారాయిరంగు మేఘాలమీద పడి సీతాకోకచిలకల రెక్కల్లా మెరుస్తోంది.

అందరూ వచ్చేశారు; వొక పొద దగ్గిర వొకరి పక్క వొకరు నుంచున్నారు. వేట కట్టేవుంది.

గుర్రాల వీపులమీది దుస్తులు గాలికి ఎగురుతున్నాయి. వాటి మీద వెలుగు నీడలు శిలకంఠుల న్యాయంగా పడుతున్నాయి. వాటి ఎర్రరంగు తృప్తిలేని కోరికలా మరింత గాఢంగా అవుపిస్తోంది. ఎక్కడ ఎండ తొంగి చూస్తోందో అక్కడ విజయోల్లాసం నాట్యంచేసినట్లుంది.

నవాబుకూతుళ్ళు, నిండుచూపులు బగ్గీపరదాల్లోంచి తొంగి చూస్తున్నాయి. వాళ్ల తెల్లని మెడలు దిగజారి, భుజాలమీంచి పల్చటి జరీముసుగులు కిందికి వేలాడుతున్నాయి. పరదాలోంచి వొక తెల్లటిచెయ్యి కొంతభాగం బైటికి కనపడుతోంది. దూరానికి అది వొక కొంగలావుంది.

బూరాధ్వనికి అది బెదిరి ఎగిరిపోతుందే అకున్నాడు, ఆచెయ్యి. నిజంగా కొంగే అని భ్రమపడిచూస్తూన్న రహీము.
విసిరిన రాళ్లలా వినిపించాయి బూరాలు. తరవాత అందరూ నిశ్శబ్దంగానే వున్నారు.

బూరాల ధ్వనికి తుళ్లిపడ్డ చెయ్యిపరదా తొలిగించేసింది. రహీము అటుచూశాడు. ఇద్దరు పడుచులు బగ్గీలో కూచుని వున్నారు. వాళ్ల పెదవులు పొవ్వరతీసిన బాదాం పలుకుల్లా వున్నాయి. కలలు కంటునట్టున్నాయి కళ్లు. దూరదూర దృశ్యాలు చూస్తూన్నట్టున్నాయి చూపులు. గూళ్లల్లో నిద్ర పోతూన్న పక్షుల్లాగ వాళ్ళ ఒళ్లో పడివున్నాయి చేతులు. కళ్లు మిరుమిట్లుపెడుతున్నాయి వాళ్ల ముస్తాబులు. అపూర్వంగావుంది

సౌందర్యం. స్వర్గం నించి దిగిన అప్సరసలా అనిపించింది రహీము కళ్ళకి.

నవాబు కన్యల ఎదట భయభక్తులతో నుంచున్న జనం ముందు విశాలంగా వున్న మైదానం మీద దూరంగా దృష్టి పరిగెత్తించాడు రహీము. ఆ మైదానం మీదే తాను పరిగెత్తి పరిగెత్తి అలసిపోయేవాడు. అలా తనకి చిరపరిచితమైన మైదానం అది.

తనకోసం ఎలాంటి శిక్ష ఎదురు చూస్తూవుందో రహీముకి తెలుసు మొన్నటి దాకా తనదిగావున్న యువరాజుగారి డేగని చూశాడతడు. కళ్ళకి పట్టీకట్టి, గోళ్ళు సంచుల్లో బంధించీ వుందది. వెంటనే గ్రహించేశాడు రహీము. తనని శిక్షించవలసిన పని దాని మీదే పడింది.

అతడి హృదయం సంతోషంతో పులకరించింది.

తాను స్వయంగా ఆ డేగ యజమానిగా వుండేవాడు రహీము. గాలిపాటలు వింటూ, చెట్లనృత్యాలు చూస్తూ పగలు పగలంతా డేగతో గడిపేసే వాడతడు. అదిగో ఆరోజుల్లో వడికినట్లే అప్పుడూ వడికింది అతడి హృదయం.

డేగ కళ్ళ కట్టు విప్పేశారు. మూడు రోజుల తరువాత వెలుతురు చూసిందది. వెర్రెత్తినట్టు నాలుగు దిక్కులూ వొకసారి చూసింది. ఎగరడానికి వుంకించినట్టు రెక్కలు పడ పడలాడించింది. డేగలపెద్ద తనని గాలిలోకి విసురుతాడేమో అని నిరీక్షించింది. దానిచూపులు వేటకోసం ఆకాశంమీదికి

పరిగెత్తాయి. ఆచూపులు ఎహాలు తీక్ష్ణంగా వున్నాయి. ఆక లితో క్రూరంగా వున్నాయి. అగ్గినిప్పుల్లాగ కనకన మండు తున్నాయి. ఆ చూపుల్లో వెనకటి స్మరణ లవలేశమూ లేదు. ప్రేమన్న వూసే లేదందులో. తనదని దేనినీ పోల్చలేకండానూ వున్నాయి ఆ చూపులు.

రహీము రెప్పవెయ్యకండా దేగని చూస్తున్నాడు. ఒక్క సారయినా తనకళ్లతో దేగకళ్లు కలిస్తే తనని పోల్చుకుంటుందే మో అని అతడిఆశ. కాని, తనదృష్టితో దేగదృష్టి కలవనేలేదు.

రహీము కళ్లల్లో నీళ్లుతిరిగాయి.

తన బతుకు చివరి అభిలాషా, చివరి ఆనందమూ, చివరి స్వప్నమూ, సౌఖ్యమూ దేగకళ్లల్లో చూడాలని ఆశించాడు రహీము. కాని అతడికి కనపడిందల్లా వేటజంతువుని చంపా లన్న ఆకలీ, క్రౌర్యమున్నూ మాత్రమే, ఆకళ్లల్లో.

యువరాజు పల్చటి పెదవుల మీద ఏవగింపూ, ఎత్తి పొడుపూ, పైశాచికమైన నవ్వొకంటే, దేగ తాలూకు అనాదరణే రహీము హృదయం ముక్కముక్కలు చేసేసింది. మొహం తిప్పేసుకున్నా డతడు. అతడికళ్లు మూతలుపడ్డాయి.

ఇంతలో వొక రాజోద్యోగి గట్టిగా అరిచాడు:

" రాజుగారి వేటకి విరుద్ధంగా నేరం చేసినవాళ్లు పన్నెండు తులాలవెండి — లేదా గుండెల్లోంచి ఆరుతులాల రక్తం ఇచ్చి తీరాలి.ఇది రాజశాసనం. ఈ శాసనమే రాజుగారి వేట కాపా డుతూ వుంది. "

రహీము కళ్లు విప్పలేదు.

రక్తంవాసన తగిలి డేగ పరిగెత్తాలి. దాని వాడి గోళ్లతో గుండెలు చీల్చెయ్యాలి. ములుకులాంటి ముక్కులోపలికి గుచ్చెయ్యాలి. అందుకని రహీము గుండె చాకుతో గీకారు.

అయినా రహీము కళ్లు విప్పలేదు.

రక్తం కారుతూన్న అతడి గుండెల మీదికి నిజంగానే పరిగెత్తింది డేగ.

గోళ్లతో రక్కింది.

ముక్కుతో పొడిచింది.

అప్పుడూ రహీము కళ్లు విప్పలేదు.

ఒక్క మాటన్నా అతడి నోటరాలేదు.

ఒక్కసారి-వొక్కసారి మాత్రం రహీము శరీరం యావత్తూ వణికింది. ఆ వణుకుతో డేగ మరింత పేట్రేగి పోయింది. దాని కళ్లల్లోంచి నిప్పులు రాలాయి. రెండు రెక్కలూ చాపేసిందది. ఆ రెక్కలతో రహీముని చంపెయ్యడానికే సిద్ధపడిందది.

ఉత్సాహంతో నవాబు కన్యల శిరస్సులు మరింత ముందికి వొంగాయి. కలల మత్తుతో వున్నాయి వాళ్ల కళ్లు. ఆ కళ్లల్లో కుతూహలం మంటలా మెరిసింది. వొళ్లో వాళ్ల చేతులు ఎప్పటిలాగే పడివున్నాయి, నిర్లక్ష్యంగా. ఎలా దిగజారివున్నాయో అలాగే దిగజారి వున్నాయి ముసుగులు.

రక్తం వాసన గుర్రాలికీ తగిలింది. ముక్కులతో బుస కొట్టాయవి. కాళ్లతో నేల తవ్వడం మొదలు పెట్టాయి, అశాంతిగా.

గుర్రాల వీపులమీద వేసిన ఎర్రటిజీనుల ముత్యాల జాలర్లు వూగుతూ గల గల మన్నాయి.

రహీము కేకలువేసి ఏడిస్తే, అది వినపడకండా చెయ్యడం కోసం బూరాలు మూతులికి తగిలించుకుని సిద్ధంగా వున్నారు బంట్రోతులు.

కాని బూరాల అవసరమే లేకపోయింది.

రహీము కిక్కురు మనలేదు. కదలకండా అలాగే నేలమీద వెల్లకిలాపడి వున్నాడు.

మొదటి దెబ్బ రహీముని భరించలేనంత బాధ పెట్టింది. గుండెకాయ వొక్కసారి బైటికి వచ్చేసిన దనిపించిం దతడికి. ఉత్తరక్షణంలో బాధతీవ్రత్వం మీంతి మీరిపోయి, ఏదో చిత్ర మైన సౌఖ్యంలా అనిపించిది. చీలికలయిన తన గుండెల్లోంచి వేడిరక్తం పైకి ప్రవహించడం అతడికి అర్థమైంది.

డేగ తన వాడిముక్కుతో పదే పదే పొడిచి అతడి గుండె నెత్తురు తాగుతోంది. ఆనందంతో ఏదో స్వప్నలోకంలో మునిగి పోయాడు రహీము.

తన చావు రాజుడేగ గోళ్లతోనూ ముక్కుతోనూ సంభ విస్తోంది. ఎంతగౌరవం తనకి. అతడి ఆత్మ పులకరించింది. ఒక

దివ్య భావం తనలో ఆవేశించింది. తనకళ్లు మిరుమిట్లు గొలిపిందది.

శాసనం ప్రకారం ఆరుతులాల రక్తం వసూలైపోవడంతోనే తనవాళ్లకి సంజ్ఞచేశాడు యువరాజు.

వేట ముగిసిందని బూరాలు వూదారు బంట్రోతులు.

రహీము గుండెల మీంచి డేగని తీసేశారు.

నెత్తురుతాగి తృప్తిపడింది డేగ. దాని కళ్లల్లో శాంతీ, గర్వమూ ప్రకాశించాయి.

రాజువేటచూసి సిపాయిలు మహానందంతో పట్నంవేపు మళ్లారు, లయమీద గుర్రాలు కదంతొక్కించుకుంటూ.

రహీముని మాత్రం మళ్లీ లేవదీయలేక పోయారు వాళ్లు.

సుఖమయమయిన మృత్యుస్వప్నంలో శాశ్వతంగా మునిగి పోయాడతడు. అతడి చేతిఅరదండాలు తీసేసి, అక్కడే అలాగే వొదిలేసి వచ్చేశారు.

అయితే ఆడేగకి తిరిగీ యువరాజుగారి డేగలచావిడిలో స్థానం దొరకలేదు. నీచస్పర్శవల్ల కులం చెడిపోయిందది.

# దొంగ

ముఖ్యమైన ఇతర విషయాల మీదికి మనస్సు మళ్లించుకోవాలని ప్రయత్నం చేస్తూన్నాడతడు. కాని లాభంలేకపోతోంది. తన పనిమనిషి తనని దోచేస్తోంది. విచారకరమైన ఈవిషయం తన బుర్రలోంచి వొదలకండా వుంది. ఎంతకాలం నించో తన దగ్గర పనిచేస్తోం దామె. అంచేత ఇంట్లోని వస్తువులు స్వయంగా జాగ్రత్త పెట్టుకునే అలవాటు తప్పిపోయిం దతడికి.

బట్టల బీరువా గదిలోనే వుండేది. రోజూ ఉదయం అది తెరిచేవా డతడు. చొక్కాల దొంతిలోంచి శుభ్రమైన మీది చొక్కా వొకటి తీసి వేసుకునేవాడు. అడపా దడపా పని మనిషి జోహంకా వచ్చి వో చింకిచొక్కా చూపించేదతడికి అన్నీ అలాగే వున్నాయనీ, కొత్తవి పట్టుకురావాలనీ చెప్పేది.

"మంచిది" అంటూ యజమాని తిన్నగా బజారుకి వెళ్లేవాడు. తనకంట పడ్డ మొదట బట్టల దుకాణంలోంచి అరడజను చొక్కాలు కొనిపట్టుకు వచ్చేవాడు. ఇదేపనిచేసి ఎన్నాళ్లో కాలేదని మసక మసకగా అతడికి జ్ఞాపకంవచ్చేది. అంతే.

ఒక్క చొక్కాల విషయమేకాదు, కాలర్లూ, టైలూ, బట్టలూ, జోళ్లూ, సబ్బులూ — భార్యలేకపోయినా నిత్యజీవితంలో తనకి అవసరమయిన యావత్తు వస్తువులసంగతీ ఇలాగే వుండేది. తడవకితడవ ప్రతీవస్తువా కొత్తది అవసరమయేది.

తనముసిలితనంవల్ల తన ప్రతీవస్తువూ అలాముసిలిదై పోయేదో ఏమో! లేదంటే భగవంతుడికే తెలియాలి వాటికేమవుతుందో అలాగ! వరాసగా కొత్తవి కొంటూనే వుండేవాడతడు. కాని ఎప్పుడు బట్టలబీరువా తీసినా చింకిపీచీకిపీ మాత్రమే అందులో అవుపడేవి. అవి ఎప్పుడల్లా అయిపోయాయో అతడికి అర్థ మయేదికాదు. అయితే ఈ విషయం అతడు పట్టించుకునే వాడు కాడు. ఏమంటే, ఇంటివస్తువుల చింతే అతడి కుండేదికాదు. ఆబాధ్యత యావత్తూ జోహాంకాదే.

ఇన్నేళ్ల తరవాత ఇవాళ అతడికి తొలిసారి తట్టింది, తన ఇల్లు దోపిడై పోతూ వుందని. అసలు జరిగిందేమిటంటే — ఆవాళ వొకవిందుకి రావలసిందని, ఉదయాన్నే అతడి కొక ఆహ్వానమందింది. సంవత్సరాలతరబడి అతడెక్కడికీ వెళ్లలేదు. అతడికి స్నేహితులూ తక్కువే. అంచేత, అనుకోకండా వచ్చిన ఆహ్వానం తనకే చిత్రమనిపించింది. దాంతో పట్టలేనంత సంతోషమూ కలిగిం దతడికి.

ముందు బట్టల బీరువా తెరిచా డతడు. మంచిచొక్కా వొకటి ఎంచుకోవాలని అతడి అభిప్రాయం. ఉన్న కమీజు లన్నీ తీశాడు. ఒక్కటీ మంచిచొక్కా లేదందులో. చిరిగి పోయినవే అన్నీనూ.

జోహాంకాని పిలిచాడతడు, "మంచిచొక్కా అంటూ ఏదన్నా వుందా, అన్నీ ఇవేనా ?" అంటూ.

జోహాంకా గుక్కిళ్లు మింగింది. ఒక్క క్షణం మాట్లాడకండా నుంచుందామె. తరవాత చల్లగా చెప్పింది, "అన్నీ పాలిపట్టుల్లా అయిపోయాయి. అతుకులు వేసి లాభంలేదు. కొత్తవి పట్టుకు రావాలి" అని.

కొద్దిరోజుల కిందే కొత్తషర్టులు పట్టుకు వచ్చినట్టు లీలగా అతడికి తడతూనే వుంది. కాని స్థిరంగా ఏమీ గుర్తుకి రాలేదు. అంచేత ఏమీ అనకండా, కోటు వేసుకుని బజారికి వెళ్లడానికే సిద్ధపడ్డాడు.

కోటు వేసుకున్నాక అప్రయత్నంగా అతడి చేతులు కోటు జేబులో ప్రవేశించాయి. జేబుల్లో ఎన్నో కాగితాలున్నాయి. పనికి రానివి పారెయ్యడం కోసం ఆ కాగితాలు తీసి చూడ్డం మొదలు పెట్టాడు. అందులో షర్టులుకొన్న ఆఖరి బిల్లుంది. ఫలానా తేదీనీ డబ్బిచ్చి పుచ్చుకున్నట్టు స్పష్టంగా వుంది బిల్లు.

ఏడు వారాల క్రితం.

ఏడు వారాల క్రితం, అరడజను కొత్త, షర్టులు!

అదీ అతడి డిస్కవరీ.

కొత్త వాటికోసం మరి బజారికి వెళ్లలేదతడు. గదిలోనే పచారుచేస్తూ వుండిపోయాడు. సంవత్సరాల తరబడి గడుపుతూవస్తూన్న తన వొంటరి జీవితం తలుచుకున్నాడు.

భార్య చనిపోయినప్పటి నించీ పూతికపుల్లతో సహా ఇంటి యాజమాన్యం యావత్తూ జోహాంకా చేతుల్లోనే వుంది. ఆమె మోసం చేస్తుందన్న సందేహం వొక్కసారికూడా అతడి

మనస్సుకి తట్టలేదు. కాని ఇన్నాళ్లూ ఆమె తన ఇల్లు గుల్లచేసేస్తోందన్న భావం ఇవాళ తన మనస్సుని బాధ పెడుతోంది.

చుట్టూ చూశాడతడు. ఫలానా వస్తువు పోయిందని చెప్పలేక పోతున్నాడు. కాని పరకాయించి చూస్తూంటే అక్కడా అక్కడా వుండవలసిన వస్తువులు లేనట్టు అర్థమవుతోంది. తాను ఇంతకుముందు వాడినవాటిని, తన చిరపరిచిత మయిన వాటిని జ్ఞాపకం చేసుకుంటున్నాడతడు. వాటిలో వొకటీ కనిపించ లేదతడికి. తనభార్య వస్తువులు దాచిపెట్టిన బీరువా సొరుగు తెరిచాడు. పనికిమాలిన వేవోకొన్ని పడివున్నాయందులో. ఒక్కటీ అందులో మంచిది లేదు. ఓయి భగవంతుడా! తనభార్య వొదిలిపెట్టిన వస్తువులన్నీ నిజంగా ఇవేనా? ఏమయి పోయాయి అవన్నీ?

సొరుగు మూసేశాడతడు. మనస్సు బలాత్కారంగా ఇతరవిషయాల మీదికి మళ్లించాలని ప్రయత్నించాడు. సాయంకాలం విందుగురించి ఆలోచించబోయాడు. కాని గతించిన సంవత్సరాలు పట్టుపట్టి తనబుర్రలోకి తిరిగివచ్చినట్టున్నాయి. వాట్లల్లో అతడు గడిపినప్పటికంటే ఇప్పుడవి ఘోరంగానూ, పాడుగానూ, నిర్మానుష్యంగానూ వున్నాయి. బాధతో వాటిలో మూలుగుతున్నాడు తాను.

మధ్యమధ్య అతడు హాయిగా నిద్రపోయినప్పటికీ, తన కునుకుపాటులో ఏదో కనబడని చెయ్యి ఏకాకిగావున్న తనని దోచేస్తున్నట్టు — తనతలకింది తలగడకూడా చపాయించేస్తున్నట్టు

స్పష్టంగా కనిపిస్తూనే వుందతడికి. తనదిక్కుమాలినతనం తనకి అవగతమయింది. అవాళ్ల తన భార్యని సమాధిచేసి తిరిగివచ్చిన నాటికంటే కూడా ఇవాళ బాధగా వుందతడికి. తాను బాగా ముసిలివా డయిపోయా డిపుడు. అవయవాలు మునుపటిలా లేవు. జీవితం తనని క్రూరంగా నలిపివేసింది.

ఏదిఏమయినా వొకక్కటిమాత్ర అర్థంకాలేదు తనకి "నావస్తువులామె ఎందుకని దొంగిలిస్తున్నట్టు ? అవి ఏంచేసుకుంటుందామె ?—ఓహో, అర్థమైంది. "—

హటాత్తుగా అతడికి జ్ఞాపకం వచ్చింది. దాంతో వొక విధమయిన తృప్తి కలిగినట్టయింది. ఏమిటది?

జోహాంకాకి ఎక్కడో వొక మేనల్లుడున్నాడు. అతణ్ణి వెర్రిగా ప్రేమిస్తుందీ బుద్ధిలేని మేనత్త.

"ఆ ముద్దుల మేనల్లుణ్ణి పొగుడుతూ ఎన్నిసార్లు నాతో చెప్పలే దామె ! ఆఁ, జ్ఞాపకం వచ్చింది. కొద్దిరోజుల కిందట, వాడి ఫోటో చూపెట్టింది నాకు. ఉంగరాల జుత్తూ చప్పిడి ముక్కూ, ముఖ్యంగా రౌడీలాంటి మీసాలున్నూ.—

"ఆఁ అదీ సంగతి. నావస్తువులన్నీ వాడి దగ్గిరకే వుడాయిస్తున్నా యన్నమాట !"—తనలో తాను గొణిగాడు. ఈ భావం బుర్రలోకి రాగానే కోపంతో మండిపోతూ వంటింటి దిక్కు నడచాడతడు. జోహాంకాని "పాడు ముసిలివెధవా" అనో, లేదా అలాంటిదో ఏదో అనో అనేసి చరున తిరిగి వచ్చేశాడు, తలుపు మూసేసుకుంటూ భయపడుతూ గొర్రె కళ్ల

లాంటి మునలికళ్లు మిటకరిస్తూ వుండిపోయింది జోహాంకా.

ఆరోజంతా అతడు జోహాంకాతో మాట్లాడలేదు. యజమాని అడ్డమైన మాటలూ అన్నాడంటూ బుంగమూతి పెట్టుకుందామె. పెద్ద పెద్ద నిట్టూర్పులు తీసింది. తన కోపమంతా గిన్నెలమీదా, కంచాలమీద చూపడం మొదలెట్టింది. ఎదటపడ్డ ప్రతిదీ విసిరేసేది; సిర సిర లాడేది. అయితే యజమాని ఎందుకు కోప్పడ్డాడో మాత్రం అర్థంకాలేదామెకి.

రెండోపూట అతడు బీరువాలూ, సొరుగులూ అన్నీ పూర్తిగా తిరగవేశాడు. ఘోరం! ఉండీ వుడికీ వొక్కొక్క వస్తువూ జ్ఞాపకం వచ్చే దతడికి. అవన్నీ అతడు ఎంతో కొంత కాలం ఉపయోగించినవే. తాత తండ్రుల కాలంనించీ కుటుంబానికి చెందిన రకరకాల వస్తువులవి. ఈనాడవి ఎంతో విలువయిన వనిపిస్తున్నా యతడికి. అందులో వొక్కటీ మిగలలేదు. ఇల్లు తగలబడిపోతే నాశనమైనట్టు మచ్చుకన్నా వొక్కటీ దక్కలేదు. నడుం విరిగినట్టయి కూలబడిపోయా డతడు. కోపంతో ఏడ్చేశాడు, వొంటరిగా.

తెరిచిన డ్రాయర్ల మధ్య దుమ్ములో మునిగిపోయి నిట్టూరుస్తూ కూచున్నాడతడు. చేతిలో తనతండ్రి తాలూకు పర్సు, వూసలసంచి వుంది. రెండుపక్కలా కన్నాల్తో వుందది. ఇంట్లోని వస్తువులన్నిటిలోకీ ఇదొక్కటే మిగిలింది. ఆమె ఎన్నాళ్లయిందో చేస్తోందో తనని! ఇల్లుఇల్లంతా గుల్ల చేసి వొదిలిపెట్టింది!

కోపంతో మతిపోయిందతడికి. ఆ సమయంలో జోహాంకా తన ఎదటికి వస్తేనా, దవడపగలగొట్టేవాడు నిజంగా.

"ఏంచెయ్యాలి దీన్ని?" ఉద్రేకంతో గొణిగాడతడు—

"వెంటనే నుంచున్నపాటుని తగిలేసేదా? — పోలీసువాళ్లకి అప్ప గించేస్తేనో? — రేపటి వంటమాటేమిటి? హోటల్లోతింటాను. కాని స్నానానికి వేణ్ణీళ్లమాట? పొయ్యేవరు ముట్టిస్తారు?"

బలాత్కారంగా ఇది మనస్సులోంచి వొదిలించుకున్నా డతడు. "శంవోరంవో రేపు తేల్చేసుకుంటాను" అంటూ అప్పటికి మనస్సు దిలాసా చేసుకున్నాడు.

"రేపటికి ఏదో వొకటి తప్పకండా తేలిపోతుంది. కాని—

"జోహాంకా లేకండా నాపనిగడవడం కష్టం!—" ఈభావం వచ్చేసరికి తనలో వేడిచల్లారిపోయేది.

"నన్నిది దోచేసింది. ఇల్లుగుల్లచేసేసింది. దీన్నివూరికే వొదిలిపెట్టకూడదు." ఇలాతట్టేసరికి తిరిగీవాళ్ళంతా వుడుకెక్కి పోయేది.

మునిమాపు వేళయింది. బాగాఆలోచించాక తనగదిలోంచి బైటికి వచ్చాడతడు. వంటింటి దగ్గిరికి వెళ్లాడు. ఏదోసాకుచెప్పి జోహాంకాని అక్కడికీ ఇక్కడికీ వెళ్లమన్నాడు. ఏవోఅర్థంలేని పనులు చెప్పి వెంటనే అవిచేసుకు రమ్మన్నాడు. ఎంతోఆలోచించి ఆపనులన్నీ బెత్తాయించా డతడు. జోహాంకా పల్లెత్తి మాటాడ లేదు. జీవితకాలమంతా యమయాతన పడుతున్న దానిలా ఋంగమొహంతో తలవూపేసి బైటికి వెళ్లిం దామె.

బైటి తలుపు దభీమని వెయ్యడం అతడు విన్నాడు. ఇపుడు ఇంట్లో అతడు వొక్కడే వున్నాడు. మెల్లిగా అడుగులు వేస్తూ అతడు వంటింటి దిక్కు నడిచాడు.

అతడి గుండెలు కొట్టుకుంటున్నాయి. వంటింటి తలుపు మీద చెయ్యి వేసి ఎంతో సేపు నుంచున్నాడతడు. ఏదో భయం ఆవరించిందతణ్ణి.

"దొంగలాగ జోహాంకా పెట్టె తెరిచి వెదకడం నాచేత కాదు" అంటూ అతడి హృదయంలో తడుతోంది. తిరిగి వచ్చేద్దామనీ అనుకున్నాడతడు. కాని అప్రయత్నంగా అతడి చేతులు ముందుకి తోశాయి. వంటింటి తలుపు తెరుచుకుంది. అతడు లోపల ప్రవేశించాడు.

వంటిల్లు పరిశుభ్రంగా మెరుస్తోంది ఓమూల జోహాంకా బీరువా వుంది. తాళం వేసి వుందది. తాళపు చెవి పత్తా లేదు. తాళం వేసివుండడం తోనే అతడి సందేహం గట్టిపడింది. వంటింటి చాకుతో తాళం కప్ప విప్పాలని ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది. ఇల్లంతా తాళాలుకోసం గాలించాడు. కాని దొరకలేదు. తన తాళపు చెవులన్నీ పెట్టి చూశాడు. అలా అరగంట తంటాలు పడ్డాక, బీరువా తాళం వెయ్యలేదనీ, వూరికే తాళంకప్ప కొక్కెం నొక్కేసివుందనీ తెలుసుకున్నాడు.

జోహాంకా బీరువా ప్రతీ అరలోనూ చక్కగా ఇస్త్రీ చేసిన బట్టలున్నాయి. మీది అరలో అతడి అరడజను కొత్తకమీజులూ ఎలాంటివి అలాగే, షాపులో కట్టియిచ్చిన నీలిరిబ్బ

నుతో కట్టివున్నాయి. ఒక కాగితం పెట్టిలో తన భార్య తాలూకు రత్నాలబ్రూచ్ తనతండ్రి తాలూకు! ముత్తె పుచిప్పల చేతి బొత్తాయిలూ, దంతపుచట్రంలోవున్న తన తల్లి ఫోటోగ్రాఫూ వున్నాయి. "హారి కర్మమా! ఇవికూడా ఇది వొదిలిపెట్టలేదన్న మాట!"

బీరువాలోని వస్తువులన్నీ పైకిలాగా డతడు. తన మేజోళ్లూ కాలర్లూ, సబ్బుపెట్టే, పళ్ల బ్రష్షులూ, పాతసిల్కు వేస్టుకోటూ, తలగడగలేబూ, ఆఫీసర్ల పాత పిస్తోలూ దొరికాయి. తనబీరువా లోని కొద్ది పాటి వస్తువులు మాత్రమే ఇవి.

"అధికం సామానులు తప్పకండా ఆ వుంగరాల జుత్తు మేనల్లుడికి చాలాకాలం కిందే చేరిపోయి వుంటాయి!"

మొదటి ఉద్రేకం అతడిలో తగ్గిపోతూ వచ్చింది. దాని స్థానంలో క్రమంగా విచారంఆక్రమిస్తూ వచ్చింది.

"చివరికి ఇదా పర్యవసానం!... జోహాంకా, నన్నిలా చెయ్యడం న్యాయమేనా నీకు!

తనవస్తువులు వొక్కొక్కటీ తనగదిలోకి తెచ్చేశా డతడు. అన్నీ తన టేబులు మీద పేర్చాడు. చిన్నప్రదర్శ నంలా తయారయా యవి. జోహాంకా సామాను లామె బీరువాలో పెట్టేశాడు. అన్నీ యథా పూర్వంగా పేర్చిపెట్టా లనే అతడి ప్రయత్నం. కాని సాధ్యపడలేదు. దోచుకున్నాక పడి వున్నట్టు బీరువా సగం తెరిచే వుండిపోయింది.

జోహాంకా వచ్చేస్తుం దేమో! ఆమెతో సీరియస్‌గా

మాట్లాడ వలసి వస్తుంది! ఈభయంతో తొందరపడ్డా డతడు. గబగబా దుస్తులు వేసుకోడం మొదలెట్టాడు.

"రేపూ దాని పని పట్టిస్తాను," తనలో తాను గొణి గాడతడు— "తన దొంగతనం నేను పట్టేశానని గ్రహిస్తుం దది! ఇవాళకి ఈమాత్రం చాలు."

కొత్త షర్టుల్లోంచి వొకటి తీశా డతడు. కాగితం లా స్టిప్పుగా వుందది. అంచేత ఎంతప్రయత్నించినా కాలరు తగిలించ లేకపోయాడు. పైగా జోహాంకా ఏనిమిషాన్నయినా వచ్చేస్తుందేమో!

చప్పున వొక పాతకమీజు తొడిగేసుకున్నా డతడు. అది చిరిగిందన్నమాటే గుర్తులేదతడికి. బట్టలేసుకున్నాక, దొంగలాగ ఇంట్లోంచి బైటికి వెళ్ళిపోయాడతడు.

విందుకి ఇంకా వొకగంట టైముంది. అందాకా వర్షంలో రోడ్లమీదే తచ్చాడా డతడు.

విందులో ఎంతో మంది సమావేశమయారు. కాని అతడు మాత్రం వొంటరిగానే ఫీలయాడు. పాతపరిచయస్తుల స్నేహసంభాషణలో పాల్గొనాలని ప్రయత్నించాడు. కాని ఏమి మాట్లాడాలో తోచలే దతడికి. వాళ్ళని కలుసుకుని ఎంతో కాలమైపోయింది. ఈలోగా ఎంతోమారిపోయింది ప్రపంచం. ఎవరినేమనడానికీ లే దతడికి. ఒంటరిగా వోదగ్గిర చిరునవ్వు నవ్వుతూ నుంచుండిపోయా డతడు.

లైట్లు మిరుమిట్లు గొలుపుతున్నాయి. అంతటా సందడిగా వుంది. ఇంతలో ఎంచేతో వో కొత్తరకం భయం అతడిలో ప్రవేశించింది. —

" ఎంత ఘోరం! నేనెలా కనిపిస్తున్నానో! నా షర్టు నించి దారాలు వేలాడుతున్నాయి! నా డ్రెస్సింగు కోటుమీద మరక! నా జోళ్ళు చెప్పే అక్కర లేదు! ఓయి భగవంతుడా!"

భూమిలోకి కుంగి పోవాలని పించిందతడికి. దాక్కుండికి స్థలం కోసం చుట్టూ చూశాడు. కాని అంతటా పెద్ద పెద్ద దీపాలే కనపడకండా ఎక్కడికి ఎలా వెళ్ళడం?

ద్వారం దిక్కు అడుగు తీసి అడుగు వెయ్యడానికే భయ పడ్డా డతడు. — అందరి చూపులూ వొక్కసారి చప్పున తన మీదే వాల్తాయి! గాభరాలో ముచ్చెమటలు పోశా యతడికి. కదల కండా నుంచున్నట్టే నడుస్తున్నా డతడు. కాని అంత సేపూ కాళ్ళు అంగుళం అంగుళమూ ముందుకి ద్వారం దిక్కు జరుపుతూనే వున్నాడు, తెలియకండా.

ఇంతలో దురదృష్టవశాత్తూ హైస్కూల్లో తనతో చదువు కున్న తన పాత స్నేహితు డొకడు అతణ్ణి కలుసుకున్నాడు. దాంతో అతడి గాభరా మరింత హెచ్చిపోయింది. స్నేహితు డేదో అడిగితే అతడింకేదో జవాబు చెప్పాడు. చికాకు వేసి అతడి దగ్గిరనించి వెళ్ళిపోయాడు స్నేహితుడు.

బలి కాను దేవుడా అనుకున్నాడతడు. ఇంకా ద్వారం ఎంత

దూరముందో చూసుకున్నాడు. మెల్లి మెల్లిగా జరుగుతూ నడిచాడు. తుదకి ఎలా అయితేనేం బైటపడ్డాడు.

పెద్ద పెద్ద అంగలు వేస్తూ ఇంటికి నడిచా డతడు. ఇంకా అర్ధరాత్రన్నా కాలేదప్పటికి.

దార్లో మళ్లీ జోహాంకా జ్ఞాపకం వచ్చిం దతడికి. గబ గబా నడవడం వల్ల అతడి మెదడుకీ చురుకు వచ్చింది. జోహాంకాతో ఎలా మాట్లాడాలో, ఆమెని ఏమనాలో అదంతా మనస్సులో నిశ్చయించు కున్నా డతను.

"ఎన్నడూ లేనంత నెమ్మదిగా, గంభీరంగా మాట్లాడ తాను. దిట్టమయిన శబ్దాలు ఉపయోగిస్తాను. దీర్ఘమయిన వాక్యాలు ప్రయోగిస్తాను. పుచ్చు చీవాట్లు వేస్తాను. తరవాత దయ చూపిస్తాను. అవును, దయ; దయచూపిస్తాను."

అంతా అయాక ఆమెని క్షమించాలనే నిశ్చయించుకున్నా డతడు. ఆమెని నడివీధిలో పెట్టడం తన కెంతమాత్రం ఇష్టం లేదు.

"జోహాంకా ఏడుస్తుంది. కాళ్లా వేళ్లా పడుతుంది. మరె ప్పుడు ఇలా చెయ్యనని ప్రాధేయ పడుతుంది.

అదంతా వింటాను, చలించకండా. ఒక్కమాటన్నా అనకండా వింటాను. తరవాత గంభీరంగా అంటాను: 'జోహాంకా, నీమోసంనువ్వుసరిదిద్దుకుందికి మరోఅవకాశం ఇస్తున్నాను నీకు. భక్తివిశ్వాసాల్తో నడుచుకో. నీనుంచి ఇదేఆశిస్తున్నాను. నేను

ముసిలాణ్ణయిపోయాను. నిన్ను శిక్షించడమంటే మనస్కరించడంలేదు నాకు.'

ఈఆలోచనలో అతడెంత మయిమరిచి పోయాడంటే, తన గుమ్మంలో తానెప్పుడు అడుగు పెట్టాడో తనకి తెలియడం లేదు.

తలుపు తీసిలోపల ప్రవేశించాడతడు. జోహాంకా గదిలో దీపం వెలుగుతోంది. గుమ్మంలో వేలాడుతూన్న తెరసందులోంచి వంటింట్లోకి తొంగిచూశాడతడు.

హారి భగవంతుడా!

ఏమిటది?

ఏడ్చిఏడ్చి జోహాంకా కళ్లుభాగావాచిపోయి వున్నాయి. గదంతా కదంతొక్కేస్తోందామె. తనవస్తువులన్నీ వొకట్రంకు పెట్టెలో సర్దేస్తోంది.

చూసి హడలెత్తిపోయా డతడు.

“ ఈట్రంకేమిటి ? ”

ఏమీ అర్థం కాలేదు. మతిపోయిందతడికి. వేళ్ల మీద నడిచి మెల్లిగా తన గదిలోకి వెళ్లిపోయాడు, తడబడి పోతూ.

“జోహాంకా వెళ్లిపోతుందా ఏమిటి కొంపదీసి ?”

గదిలో ఎదురుగుండా టేబిలు మీద, జోహాంకా దొంగిలించిన వస్తువులన్నీ వున్నాయి. వాటిని వేళ్లతో తాకాడతడు. అవి దొరికాయన్న సంతోషం రవంతా కలగలేదతడికి.

"తన దొంగతనం నేను కనిపెట్టేశానని జోహాంకాకి తెలిసిపోయింది. వెంటనే తనని తగిలేస్తానని భావించి వుంటుం దామె. అందుకనే మూటా ముల్లే కడుతోంది.— అదీసంగతి" తనలో తాననుకున్నా డతడు.

"బావుంది— రేపు తెల్లవారీ దాకా అలాగే అనుకోనీ అది;—దానికి తగిన శిక్షే అవుతుందిది, అవును రేపు ఉదయమే ఆమెతో మాట్లాడతాను. కాని, బహుశా, ఇప్పుడే వచ్చి క్షమా పణ చెప్పొకుంటుం దేమో! నాముందువచ్చి గోలెత్తి ఏడుస్తుంది; మోకరిస్తుంది.అప్పుడూ ? ఆమాత్రంచాలు జోహాంకా, నిన్ను బాధించడం నాకిష్టంలేదు; నువ్వు వుండొచ్చు."

సాయంకాలపు దుస్తులు వేసుకున్నా డతడు. జరగబోయే దానికోసం కనిపెట్టుకు కూచున్నాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. చీమ చిటుకంటే వినిపిస్తుంది. వంటింట్లో జోహాంకా తాలూకు ప్రతీ అడూగూ వింటున్నా డతడు. ఆమెకోపంతో ట్రంకుపెట్టెమూత దభీమని వెయ్యడం విన్నాడు—తరవాత మళ్లీ నిశ్శబ్దం.

ఏమిటది ?

భయంతో వున్నపాళాన్ని నుంచున్నా డతడు ; వింటు న్నాడు:

పెద్ద భయంకరమయిన ఏడుపు !

ఏదో జంతువు అరిచినట్టు !!

క్రమంగా అది తగ్గి తగ్గి అంతంలేని పిచ్చి పిచ్చి వెక్కిళ్ల కింద పరిణమించింది.

తరవాత?

తరవాత చాపచుట్టగా కూలబడ్డట్టు చప్పుడు.

అనంతరం అణుచుకుంటూ ఏడుపు.

జోహాంకా ఏడుస్తోంది.

ఏదో వొకటి జరుగుతుందని అతడు సిద్ధంగానే వున్నాడు. కాని ఇదిమాత్రం అతడు అనుకోంది. దబదబా కొట్టుకుంటూన్న గుండెలతో నుంచుని అతడు వింటున్నాడు.

"పంటింట్లో ఏమిటి జరుగుతోంది?

"ఏమీ లేదూ.

"ఓరి ఏడుపు.

"జోహాంకా తనంతటతాను వచ్చి, ఇప్పుడే క్షమాపణ చెప్పుకుంటుంది."

గుణించుకుని తాను నిశ్చయించుకున్నదంతా తిరిగీ జ్ఞాపకం చేసుకుందికి గదిలో తచ్చాడడం మొదలెట్టాడతడు.

కాని ఏదీ, జోహాంకా రాలేదు.

ఉండివుండి ఆగి వినేవాడతడు.

జోహాంకా ఏడుపు అదేపనిగా వెక్కిళ్లకింద మారింది.

చికాకయిన ఈవ్యవహారమంతాఅతణ్ణి బేజారెత్తించేస్తోంది.

"నేనే ఆమెగదిలోకి వెళతాను. అనవలసినమాట నేనే అనేసి వస్తాను. ఇది నీకొక గుణపాఠమనుకో. జోహాంకా, మరి

ఏడవకు, పూరుకో. జరిగిపోయిందేదో జరిగిపోయింది. అంతా మరిచిపోతాన్నేను. ఇక ముందు మాత్రం నమ్మకంతో మసులుకో —"

హటాత్తుగా బ్రరుని విడిపోయాయి గదితలుపులు.

ద్వారం దగ్గిర పెద్ద పెట్టుని ఏడుస్తూ నుంచుంది జోహాంకా. ఏడ్చిఏడ్చి ఆమె మొహం వాచిపోయి, చూడశక్యం కాకుండా వుంది.

"జోహాంకా," నిట్టూరుస్తూ అన్నాడతడు. —

"ఇదీ — ఇది — న్యాయమేనా మీకు?" గట్టిగా అంది జోహాంకా — "చాలు, పదివేల దండాలు మీకు. — ఆఁ, నేనేదో దొంగనైనట్టు — ఇ — ఇ — ఇంత అవమానమా?"

"కాని, జోహాంకా," భయపడుతూ గట్టిగా అన్నాడతడు, — "నువ్వు నావస్తువులు తీసుకున్నావు! — ఇవిగో, ఇవన్నీ — కనపడుతున్నాయా? ఇవి తీశావంటావా లేదా?"

కాని జోహాంకా వినిపించుకోలేదు. "నేనేం చేశానని — ఇంత అవమానం నాకు! నాబీరువా తనిఖీ చెయ్యాడమా? నేనేదో-కన్నంవేసే జిప్సీలాగ! నాకా — నాకా ఇంత అవమానం? అవ్వవ్వ! మీకెంతమాత్రం తగ దిది. — అయ్యగారూ, నన్ను అవమానపరచడానికి మీకధికారంలేదు. లేదు — నేనుచస్తే తప్ప — ఇలానన్ను చేస్తారని కల్లోకూడా అనుకోలేదు. నేనేం దొంగనా? నేనూ — దొంగనా?"

ఆవేశంతో పెద్ద పెట్టుని ఏడుస్తూ అందామె.

"నిజంగా – నిజంగా నేను దొంగనా? నాకుటుంబం మర్యాదా అన్నా చూడొద్దా? నేనెన్నడూ అనుకోలేదిలా! నాకా ఇంత అవమానం! అవ్వవ్వ!!"

"కాని, జోహాంకా," దిగజారుతూన్న ధైర్యంతో అన్నాడతడు–"తొందరపడకు. మరి, ఈ వస్తువులు నీ బీరువాలోకి ఎలా వచ్చాయంటావు? ఇవి నీవంటావా, నావంటావా? చెప్పు, నువ్వు దొంగవి కావు, మంచిదానివే. చెప్పు, ఇవన్నీ నీవా?"

"ఎంత సిగ్గుచేటు! నే నేదో జిప్సీనయినట్టు!–నా బీరువా తనిఖీ చెయ్యడం! కాని ఈక్షణం"–ఆవేశంతో అరుస్తూ అందామె–"ఈ క్షణం వెళ్లిపోతాన్నేను తెల్లవారేదాకయినా ఈ ఇంట్లో ఉండను. ఉఁ ఊఁ, ఉండనూ—వుండను."

"కాని, చూడూ" భయంతో అడ్డుపడుతూ అన్నాడతడు,–"నేను నిన్ను పొమ్మనలేదుకదా! ఉండు, జోహాంకా, జరిగిందేదో జరిగిపోయింది. భగవంతుడే వున్నాడు మీూద. ఇంతవరకూ పల్లెత్తి మాటన్నా అనలేదుకదా, నిన్ను. ఏడవకు వూరుకో."

"మరొక మనిషిని చూసుకోండి," కన్నీళ్లతో బెక్కుతూ అంది జోహాంకా–"నేను మరి వుండను. తెల్లారేదాకన్నా ఇక్కడ వుండను. నే నేమంత దిక్కుమాలినదానిక్కానా?– ఏది పడితే అది సహించి పడి వుండడానికి? ఉఁఊఁ– వుండను." తెగతెంపులు చేసుకున్నట్టు చిత్రంగా అందామె–"నా ఎత్తు

బంగారం కుప్పపోసినా వుండను. రాత్రంతా రోడ్డుమీదపడి వుంటాను కాని ఈ ఇంట్లో మరి వుండను."

"ఎందుకని, జోహంకా," నిస్సహాయుడైనట్టు వాదించాడతను— "నిన్నేమన్నా నొప్పించానా? అయినా, నువ్వు కాదనలేవుకదా!—

"కాదు, నొప్పించడం మాట కాదు," మరింత బాధపడుతున్నట్టు అంది జోహంకా, ఏడుస్తూ —"నన్ను నొప్పించడం సంగతి కాదు. నేనేదో దొంగనయినట్టు నాబీరువా వెదకడం మాట చెబుతున్నాను. మీకు అది ఏమీ కాకపోవచ్చు. నాకు మాత్రం తల కొట్టేసినంతపని. అవ్వవ్వ! ఇంత అవమానమా? నేను — నే నేదో వీధుల్లో తిరిగే ముష్టి మనిషిని కాదు."

వెక్కి వెక్కి ఏడుస్తూ దభీమని తలుపుతో సేనుకుని వెళ్ళిపోయిందామె.

నిశ్చేరపోయి నుంచుండి పోయాడతను.

"లెంపలు వాయించుకోడం పోయి, పైగా ఈ నాటకం! ఏమిటీ దీని ఉద్దేశం! మాలకాకిలా వాళ్ళొక్కొక్క వస్తువూ చపాయించింది. నేను కని పెట్టేసే సరికి దానికి అవమానంపట్టుకుంది! దొంగతనం చెయ్యడానికి సిగ్గువెయ్య లేదూ! గుట్టు బైటపడే సరికి మాత్రం ఎక్కడలేని ఇదీ వచ్చేసింది! దీనికేమీ పిచ్చెత్తలేదు కదా!"

కొంతసేపు గడిచింది.

మెల్లిమెల్లిగా ఆమెమీద జాలిపుట్టుకు వచ్చిం దతడికి.

"ప్రతీమనిషిలోనూ ఏదో దౌర్బల్యం వుంటుందని మనం గ్రహించాలి ఆ దౌర్బల్యంఎత్తి చూపిస్తే మనిషికి చ్రుమం టుంది. అది కోపంకింద పరిణమిస్తుంది. తనలో బోలెడన్ని దుర లవాట్లున్నా మనిషితాను కడిగేసిన సాలగ్రామాన్నే అను కుంటాడు. చెడ్డని నిందిస్తూనే తాను చెడ్డచేస్తూవుంటాడు. తన తప్పుమాట ఎత్తితేచాలు తోకతొక్కిన తాచులా బుస్సు మంటాడు. నేరంచేసినవ్యక్తి లెంపలు వాయించుకోడమంటూ ఎప్పుడూ వుండదు. నేరంపట్టుకుంటే మాత్రం నాగుపాములా విషం కక్కుతాడు."

వంటింట్లోంచి వెక్కి వెక్కి ఏడుపు వినిపిస్తోంది. లోపలికి వెళ్ళాలనుకున్నాడతడు. కాని లోపలినించి తలుపు గెడవేసేసి వుంది. తలుపవతల నించి జోహంకాని బుదిరించాలని ప్రయ త్నించా డతడు. దానికి జవాబుగా మరింతగట్టిగా ఏడుపే విని పించింది.

అతడిమనస్సు జాలితో విలవిల లాడిపోయింది. తనగదిలోకి తిరిగి వచ్చేశాడతడు.

దొంగిలించిన వస్తువులన్నీ టేబిలుమీద పడివున్నాయి.— కొత్తకమీజులూ, సబ్బుపెట్టే మొదలయినవి. వాటినిచేత్తో తాకాడతడు. ఆ తాకడంలో ఏదోబాధ కనపడుతూనే వుంది, అవ్యక్తంగా.

# పిల్లలూ-ముసిలాళ్లూ

ప్రతీరాత్రీ పక్కమీదికి వెళ్లేముందు, ఆపిల్లలు అవీ ఇవీ మాట్లాడుకునేవాళ్లు. వాళ్ల. గదిలో పెద్ద పొయ్యి వుండేది. దాని దగ్గిర కూచుని, వాళ్ల బుర్రలోకి ఏది వస్తే అది చెప్పుకునేవాళ్లు. గదికిటికీ మసక మసకగా వుండేది. కలలతో బరువెక్కిన కళ్లతో, సాయంకాలపు వెలుతురు కిటికీలోంచి తొంగి చూసేది, గదిలోకి. ప్రతీమూలనించీ నీడలు కమ్ముకువచ్చేవి, నిశ్శబ్దంగా. వింత వింత కథలూ పట్టుకువచ్చేవవి. వాళ్లకోసం.

వాళ్ల బుర్రలోకి ఏంవస్తే ఆవే చెప్పుకునే వాళ్లు పిల్లలు. అయితే వాళ్ల బుర్రల్లోకి ఎప్పుడూ ముచ్చటయిన కథలే వచ్చేవి. ప్రతీకథలోనూ వెలుతురు వుండేది. వెచ్చదనం వుండేది; ప్రేమా, ఆశా వుండేవి. వాళ్ల భవిష్యత్తు యావత్తు వేడుకతో నిండిన వొక పెద్దపండుగ రోజుగా వుండేది. అందులో ఉపవాసాలూ అవీ లేవు. ఎక్కణ్ణుంచో పైనించి ఏదో వూలపరదా అవతలనించి, ప్రతిరాత్రీ, మిలమిలలాడుతూ, రెపరెప లాడుతూ జీవితం ప్రవహిస్తున్నట్టు వుండేది, వాళ్ళకి.

వాళ్ళు చెప్పుకునేవి మాటలుకావు. గుసగుసలు. సగం అర్థమయితే సగం అర్థంకావు. ఏకథకీ మొదలు వుండేదికాదు; వొకరూపమూ వుండేదికాదు; చివరా వుండేదికాదు. ఉండి వుండి నలుగురు పిల్లలూ వొక్కసారే మాట్లాడేవాళ్ళు; కాని

వాళ్ళొక్కరు గందరగోళ పరచేవాళ్ళు కాదు. నలుగురూ ఆకాశం మీంచివచ్చే వెలుతురు చూసేవాళ్ళు. ఎంతో అందంగా వుండేది వెలుతురు. అందులోంచి ప్రతీమాటా స్పష్టంగా వుండేది. ప్రతీదీ నిజంగావుండేది. అందులోని ప్రతీకథా సజీవంగావుండేది; గొప్పగా, మనోహరంగా అంతమయ్యేది.

నలుగురు పిల్లలూ వొకళ్ళలాగే వుండేవాళ్ళు మసకమసక మునిమాపుల్లో అందరికంటే చిన్నవాడయిన నాలుగేళ్ళ టోంచెకానుండి, అందరికంటే పెద్దపిల్ల పదేళ్ళ లోజకాని వేరు చేసి పోల్చుకోడం కష్టం. అందరివీ దుర్బలమయిన దేహాలే. అందరివీ సన్నని కోలమొహాలే. అందరివీ కలలు కంటూన్న పెద్దకళ్ళే.

ఆవాళ సాయంకాలం ఏం వచ్చిందో, ఎక్కడినించి వచ్చిందో ఏమో, వాళ్ళ పవిత్రమయిన వెలుగూ, వాళ్ళ పండగా, కథలూ, ఊహలూ—అన్నీ పాడుచేసి వొదిలిపెట్టింది.

అవాళ పోస్టులో వొక వుత్తరం వచ్చింది. అదే కబురు తెచ్చింది.

వాళ్ళనాన్న ఇటలీ యుద్ధంలో చచ్చిపోయాడు.

ఏదో ఎప్పుడూ ఎరగంది, కొత్తది, వింతయింది, ఊహాకి అందరాంది వచ్చి, వాళ్ళఎదట నుంచున్నట్టయింది.

ఎంతో ఎత్తుగా వుండది. ఎంతో విశాలం గానూవుంది. అయితే, దానికి ముక్కూ మొహంలేదు. కళ్ళులేవు. నోరూ లేదు. ఇంతకిముందు అది ఎక్కడా వున్నట్టులేదు.

గుడిలోనా? వీధిలోనా? వెచ్చటిపొయ్యి వెలుగులోనా? పోనీ, కథల్లోనా?

ఊఁహూఁ.

ఎప్పుడూ, ఎక్కడా అలాంటిది కనపడ్డపాపాన పోలేదు.

అది కులాసాగా వుందా?

అబ్బే!

పోనీ, విచారంగా వుందా?

ఊఁ ఊఁ.

ఏమంటే దానికి ప్రాణమే లేదు.

దాని ఉద్దేశం తెలుసుకుందామంటే-దానికి కళ్ళేలేవు.

పోనీ, ఎక్కణ్నుంచి వచ్చిందో—ఎందుకు వచ్చిందో చెప్పుతుందా అంటే—దానికి నోరూ లేదు.

ఓనల్లటి గోడలాగ-వాళ్లు దాటి వెళ్ళలేనంత పెద్ద గోడలాగ వాళ్ళముందు తయారయిందది.

దానిముందు వాళ్ళ ఊహాలన్నీ ఆగిపోయాయి.

అది గదిగోడకి చేరబడి నట్టుంది.

పలుకూ ఉలుకూ లేకండా వుంది.

ఆలోచిస్తూ వుంది.

పరికిస్తూ వుంది.

"ఐతే. నాన్న ఎప్పుడు వస్తాడు?" తెల్లమొహం వేస్తూ అడిగాడు టోంచేక.

లోజకా అతడికేసి చుర చురా చూశాడు.

“నాన్న చచ్చిపోయాడు. ఎలావస్తాడు” అన్నాడు.

నలుగురూ ఎవ్వరూ మాట్లాడలేదు. అందరూ ఆ నల్లటి గోడలాంటిముందు నుంచున్నారు. గోడవతల ఏదీ కనపళ్లేదు వాళ్ళకి.

“నేనూ యుద్ధానికి వెళతాను” చప్పున సరయిన సంగతి గ్రహించేసినట్లు, హఠాత్తుగా అరిచాడు మటీచా. అలా అనడమే అప్పుడు అవసరమనిన్నీ అనుకున్నాడతడు.

“నువ్వు చిన్నకుర్రాడివి,” దబాయిస్తూ గంభీరంగా అన్నాడు నాలుగేళ్ళ టోంచేకా. టోంచేకా ఇంకా ఆడపిల్లల జాబ్బాలతోనే ముస్తాబవుతున్నాడు.

“యుద్ధమంటే ఏమిటి?” సన్నని పీల గొంతుకుతో నెమ్మదిగా అడిగింది మిలాకా. మిలాకా అందరిలోకీ పల్చని పిల్ల. అందరికంటే జబ్బుగా వుంటుంది, ఎప్పుడున్నూ. తన తల్లి తాలూకుపెద్దబూర్నీసు కప్పుకుంది. అంచేతే వూరికి వెళ్ళే వాళ్ళ మూటలా వుందామె. నీడల వెనకనించి ఎక్కణ్ణుంచో వచ్చినట్టు వినిపించింది ఆమెగొంతుకు— “మటీజా, చెప్పూ. యుద్ధమంటే ఏమిటో ఆ కథ చెప్పూ.”

“ఏమీలేదూ, —యుద్ధమంటే వొకళ్ళని వొకళ్ళు బాకులతో పొడుచుకోడం. ఒకళ్ళ నొకళ్ళు కత్తులతో నరుకుకోడం. తుపాకుల్తో కాల్చుకోడం. ఎంతమందిని పొడిచేస్తే, ఎంతమం

దిని నరికేస్తే అంతగొప్ప. ఎవ్వరూ ఏమీ అనరు. ఏమంటే, అక్కడ అలాగే చెయ్యాలి. అదిగో, అదే యుద్ధం.”

“ఐతే, వాళ్ళెందుకూ పొడుచుకుంటారు? ఎందుకు నరుక్కుంటారు?” మిల్కా మళ్ళీ అడిగింది.

“రాజుగారికోసం” అన్నాడు మతీజా. మళ్ళీ నిశ్శబ్దం. ఎవ్వరూ మాట్లాడలేదు. వాళ్ళముందు దూరముగా మసకమసకగా ఏదో వెలుగులా మెరిసింది. ఎంతో గొప్పగా అవుపడిందది.

ఒక్కరూ మాటాడలేదు. అందరూ నిశ్శబ్దంగా కూచున్నారు. ఊపిరికూడా తీస్తున్నట్టులేదు. గుడిలో ధ్యానముగ్నులయి కూచుంటారే, అదిగో అలాకూచున్నారు నలుగురున్నూ.

మతీజా టపీమని మళ్లీ తన వ్యూహాలు పోగుచేసుకున్నాడు. నిశ్శబ్దం భంగపరచటానికా అన్నట్టుగట్టిగా అన్నాడు.

“నేనూ యుద్ధానికి వెళతాను. శత్రువుని చంపుతాను.”

“శత్రువంటే ఎలా వుంటాడు? శత్రువుకి కొమ్ములుంటాయా?” నెమ్మదిగా అడిగింది మిల్కా.

“తప్పకుండా వుంటాయి. కొమ్ములు వుండకపోతే శత్రువెలా అవుతాడు?” అన్నాడు టోంచెకా. కోపంగానూ, గంభీరంగానూ, నొక్కి మరీ అన్నాడతడు.

మిల్కా అడిగిన ప్రశ్నకి ఏం చెప్పాలో మతీజాకికూడా తెలియలేదు. ఆలోచిస్తూ, తాపిగా, ఆగుతూ, ఆగుతూ అన్నాడతడు.

"ఉహూఁ— శత్రువుకి— కొమ్ములుంటాయనుకోను."

"అబ్బే, కొమ్ము లెలావుంటాయి? శత్రువూ మనలాగ మనిషే" అదోలా అయిష్టంగా అంది లోజకా. అంతలోనే మళ్లీ ఆలోచించుకుంది. "శత్రువు దగ్గిర హృదయం మాత్రం వుండదు" అంది.

మళ్ళీ కొంచేపు నిశ్శబ్దంగా నడిచాక, టోంచేకా ప్రశ్న వేశాడు:

"యుద్ధంలో ఎలా చచ్చిపోతాడు, మనిషి? ఇలాగ వెనక్కి పడిపోతాడా?" అంటూ అభినయించి చూపాడు.

"మనిషి పడిపోయినట్టు చంపేస్తారు" మెల్లిగా జవాబు చెప్పాడు మతీజా.

"నాన్న నాకోసం తుపాకీ తెస్తానన్నాడు" అన్నాడు నాలుగేళ్ళ టోంచేకా.

"తుపాకీ ఎలా తెస్తాడు నీకోసం? నాన్న యుద్ధంలో చచ్చి పోయాడుగా!" కసిరినట్టు అంది లోజకా.

"అయితే నాన్నని చచ్చిపోయినట్టే చంపేశారూ?"

"అవును. చచ్చిపోయినట్టే చంపేశారు."

మాయామర్మం, కల్లాకపటం తెలియని వాళ్ళకళ్ళు మౌనంగా, దుఃఖంగా చీకటిలోకి చూశాయి. ఏదో అర్థంకాని దాన్ని, హృదయానికీ ఊహకీ అందనిదాన్ని దేన్నో చూస్తూవుండిపోయాయి.

పొయ్యిదగ్గిర పిల్లలు ఇలావున్నారు. సరిగ్గా అదేసమయా నికి వాళ్ళతాతా, నాన్నమ్మా నాకట్లో బెంచీమీద కూచు న్నారు. వెళ్ళిపోతూవున్న సూర్యుడి ఎఱ్ఱటి కిరణాలు ఇంటి ముందు తోటజీబులోంచి తొంగిచూస్తున్నాయి.

నిశ్శబ్దంగా వుంది సంధ్య.

పశువుల సాలలోంచి గుండెలు తరుక్కుపోతునట్టు వెక్కి వెక్కి వినిపిస్తోంది ఏడుపు. పిల్లలతల్లి పశువులికి దానా పెడుతోంది.

ముసలివాళ్ళిద్దరూ బెంచీమీద కూచున్నారు. ఒకరిపక్క వొకరు వొరిగి తలలు వేల వేసుకు కూచున్నారు. ఎన్నాళ్ళమో పట్టుకోనట్టి వొకరి చేతులు వొకరు గట్టిగా పట్టుకుని వున్నారు. మునిగిపోతూవున్న సూర్యుడికేసి కన్నీళ్ళులేని కళ్ళతో చూస్తున్నారు. ఎవ్వరినోటా పలుకన్నది లేదు.

# ఆఖరి ఉత్తరం

ప్రతీరోజూ సాయంత్రం అయిదింటికి తనకొడుకు ఏబిలో, లేదంటే కోడలు మార్థో వచ్చి విధిగా డేనియల్ని కలుసుకునే వాళ్లు. ఇద్దరిలో ఎవరూ రాలేనప్పుడు అతడి అయిదేళ్ల మనవణ్ణి ఆరబేనుని నర్సు తీసుకు వచ్చేది. మనవడికి వింతవింత కథలు వినిపించేవాడు డేనియలు. కథలు చెపుతూ అతడి వేళ్లూ, ముంగురులూ పరిశీలనగా చూసేవాడు. తనతండ్రి పోలికలూ, తనపోలికలూ కుర్రాడిలో చూసి, అప్పుడప్పుడు ఇదయిపోయే వాడు. విచారంలో మునిగిపోయేవాడు.

"వీడిముక్కు సరిగ్గా ఏబిలు ముక్కులాగే వుంది.

వీడిచెవులికీ మానాన్న చెవులికీ భేదమే కనపడదు !

మానాన్న ఏభై యేళ్ల కింద ఈలోకంవొదిలి వెళ్లిపోయాడు."

నేనూ ఇహ కొద్దిదినాల్లో మానాన్న దగ్గిరికి వెళ్ళిపోతాను."

తనతండ్రి గోరీమీద పువ్వులు వెయ్యడానికి వెళ్లేటప్పుడూ సరిగ్గా ఇలాంటి భావాలే డేనియలు బుర్రలోకి వచ్చేవి.

"ఎన్నాళ్లో లేదు, నాకోసం కూడా ఇలాంటి గోరీయే వొకటి తయారవుతుంది.

నాకొడుకు ఏబిలు దానిమీద పువ్వులు చల్లడానికి వస్తాడు.

ఆరోజుఎప్పుడు వస్తుందో ఎవడు చెప్ప గలడు ?

కొద్ది వారాల్లో,

నెలల్లో,

సంవత్సరాల్లో—

ఎప్పుడన్నా రావచ్చు.

నా జీవయాత్ర సమాప్తం కావస్తోంది.

డబ్భయి అయిదేళ్ల కళేబరం మోస్తున్నాను.

పండిన పండుని.

ఎప్పుడు రాలిపోయినా రాలిపోతాను."

తన కొడుకుతోనూ కోడలుతోనూ మాట్లాడుతున్నప్పుడూ కూడా ఇలాంటి భావాలే అతని బుర్రలో తిరిగేవి. కాని వాళ్లతో మాత్రం అనవసరంగా ఈ మాటలు మాట్లాడడం మాత్రం సరికాదని భావించేవాడతను. ఏమంటే, ఇలాంటి వన్నీ వాళ్లు గ్రహించలేరు. ముసిలాళ్ల ముసిలి మాటలు వయసులో వున్న వాళ్లకి ఎలా బోధపడతాయి ?

ఎంచేతో తెలియదు, అవాళ బాగా దుర్బలంగా వున్నట్టున్నాడు దేనియల్. ఆరోగ్యమేమో బాగానే వుంది. అయితేనేం, ముసిలితనంలో ఏదోలాగ, అలా అనిపిస్తూనే వుంటుంది. నిజం చెప్పాలంటె, ముసిలితనమే స్వయంగా వో రోగం. బహుశా అంచేతే "మీ ఆరోగ్యం ఎలా వుంద"ని మార్థి అడిగినప్పుడల్లా అతడు "బాగానేవుంది" అంటూ చిరునవ్వుతో జవాబు చెప్పేసేవాడు. ఏమయితేనేం, మార్థిని చూస్తేచాలు, అతడు వుల్లాసంగా అవుపించేవాడు.

మామగారంటే ప్రాణంగా వుండేది మార్థికి. ఎంతో ఆదరంగా చూసేది ముసిలాయన్ని.

ఎన్నాళ్లనుంచో మామగార్ని వొక ప్రశ్న అడగాలనుకుంటూ వుండేది మార్థీ. కాని సాహసించలేక పోయేది. ఆయన చికాకు పడతాడేమో! లేదా నొచ్చుకుంటాడేమో! అదీ ఆమె భయం.

అవాళ డేనియలు ఉత్సాహంగా కనిపించాడు. అంచేత ఆమె అనుకున్నది అడిగేసింది.

"మామయ్యగారూ, నేను ఎప్పుడూ అనుకుంటూ వుంటాను, స్నేహితులూ, తోడివాళ్లూ లేకపోవడంచేత మీరు ఎల్లప్పుడూ విచారంగా వుంటున్నారు. జీవితంలో వొకవిధమయిన వొంటరితనం అనుభవిస్తున్నారు. ఏమంటారు? నిజమేనా?"

ముసిలాయన కొంచేపు మాట్లాడకండా వూరుకున్నాడు. బహుశా, కోడలు వేసిన ప్రశ్న తాలూకు లోతుపాతులు విచారిస్తున్నట్టున్నాడు. లేదా, తలా తోకాలేని జవాబేదో చెపితే కోడలు మనస్సు చివుక్కుమంటుందేమో అని ఆలోచిస్తున్నాడేమో!

"లేదమ్మా," రెండుమూడు నిమిషాలు గడిచాక అన్నాడు ముసిలాయన – "కేవలం వొంటరిగానూ వుండలేదుగా. ఏమంటే – నువ్వున్నావు. ఆరబెను వున్నాడు. ఏబిలు వున్నాడు.

మీరంతా కంటికి రెప్పలా చూస్తూనే వున్నారు నన్ను. అయితే, నిజం చెప్పాలంటే, నాస్థితిలో వున్నవాడు ఎవ్వరి స్నేహమూ కావాలనుకోడు. మార్థీ, చెపితే నీకు ఆశ్చర్యం

వేస్తుంది, కొన్నాళ్లయింది, ఫలానా మనిషి బతికి వున్నాడో చచ్చిపోయాడో అన్న మాట కూడా వ్రాహించడం మానేశాను నేను మొన్న మొన్ననే వొక స్నేహితుడికి వుత్తరం రాశాను. ఏబిలు టపాలో వేయించాడని. కాని, నిన్ననే జ్ఞాపకం వచ్చింది, ఆ స్నేహితుడు ఏడేళ్ల కిందటే చచ్చిపోయాడు. ఆ వుత్తరం ఎవరికందుతుందటావు? నాదగ్గిరికి తిరిగి వచ్చేస్తుంది!

మీరు నాదగ్గరనించి వెళ్లిపోయాక, ఇదిగో, నేను ఇలాంటి ఊహల్లోనే — అంటే చచ్చిపోయిన వాళ్లగురించీ, చచ్చిపోవడానికి సిద్ధంగా వున్నవాళ్లగురించీ ఆలోచిస్తూ గంటల తరబడి వుండిపోతాను. అదేనాకు ఆనందంగా వుంటుంది. అయితే, నీకుమాత్రం ఈమాటలు అర్థం కావు.”

“ఏం?”

“ఏమంటే, ఇంకాచిన్నదానివి నువ్వు.”

చెయ్యి ఆనుకుని కూచుంటూ అన్నాడు ముసిలాయన — “నువ్విప్పుడున్న పరిస్థితిలో నీ ఎదటవున్న వర్తమానకాలమే నీకు అవగతమవుతుంది. కాని నావంటివాడి స్థితిలో ఇదంతా వొక కలలా వుంటుంది. గతించినకాలమే వర్తమానంగా తయారై వచ్చి మాటిమాటికీ కళ్లఎదట నుంచుంటుంది.”

మార్థీ రెప్పవెయ్యకండా మామగారిమాటలు వింటోంది. అయితే ఆమెమొహం చూస్తేమాత్రం, అదంతా ఆమెకి అయోమయంగావుందని తెలుస్తూనే వుంది.

కొంచెపు నిశ్శబ్దంగావుండి, తరవాత మళ్లీ అందుకున్నాడు ముసిలాయన.

"అనేకమంది గురించి అనుకుంటూ వుంటాను నేను, బహుశా వాళ్లు చచ్చిపోయారేమో అని. ఎవరికి తెలుసు, వాళ్లు చచ్చేపోయారో; లేదా నాలాగే వాళ్లూ అనుకుంటూ వున్నారేమో, నేనూ చచ్చిపోయానేమో అని. నిజమేమిటో మనకి ఎలా తెలుస్తుంది! వృద్ధాప్యంలో బుద్ధి పాడవుతుంది కదూ!"

ఏం నిజమేనా అన్నట్టు కోడలు మొహంమీద చూపులు నిలిపాడతడు.

మార్థ మాటాడ లేదు.

"మార్థ ఇంకా లోకం తెలీంది. ఈమెతో ఈ పనికిమాలిన మాటలు చెప్పి పొరపాటే చేశాను. పాపం, ముసిలి తన మంటే ఏమిటో, అది ఎలా వస్తుందో ఏమిటి తెలుస్తుందీమెకి!"

ప్రసంగం మరో తట్టు మళ్లించాలనుకున్నాడు ముసిలాయన.

"నిన్ను తీసుకు వెళ్ళడానికి ఏబిలు వస్తాడా ఇవాళ?"

"రారు. నాలుగయిదు రోజులదాకా వూపిరాడనంత పనిగా వుంది ఆయనకి. ఈమధ్య ఎంతో పెరిగి పోయింది పని."

"నిజమే నమ్మా, నువ్వు చెప్పింది. మా కాలంలో ప్రపంచంలో ఇంత వుక్కిరి బిక్కిరి లేదు. ఇంత వొడుదుడుకూ లేదు."

“ఈమధ్య ఆయన చాలా విచారంగానూ వుంటున్నారు. మార్కెట్టు నమ్ముకోడానికే వీలు లేదంటూ రాయన.......నే నెన్నోరకాల బోధపరుస్తాను — ‘మీకు దేనిలో లోప మని! దేవుడి దయవల్ల మీకు వచ్చిన లోప మేముంది!’ అంటాను. కాని ఆయనకోర్కెలు......”

“అవునమ్మా, అవును. యౌవనంలో ధనంమీద కోర్కెలూ, ఊహలూ మొలకలెత్తుతాయి. వయస్సు ముదిరినా ఆరోగ్యం బాగావుంటే యౌవనంలోలాగే వుంటుంది. కాని యవ్వనంవస్తే చిన్నప్పటి ఆటలూ స్నేహితులూ మరుపు వచ్చినట్టే, వార్ధక్యంవస్తే అవన్నీ మరుపులో పడిపోతాయి. మార్థీ, ఈమాత్రం నువ్వు తెలుసుకోగలవు. ఏమంటే, నీ ఎదట నేనూ, ఏబిలూ, చిట్టి అంజేనూ — మూడురకాల నమూనాలూ వున్నాము.”

మార్థీ మాట్లాడలేదు.

ముసిలాయనగా అలిసిపోయి పట్టున్నాడు. అరిచేతుల్లో మొహం పెట్టుకుని వూరుకున్నా డతడు.

“మామయ్యగారూ, నేను వెళతాను,” నిశ్శబ్దం భంగం కలిగిస్తూ అంది మార్థిన్ — “క్షమించండి. ఇవాళ మిమ్మల్ని చాలా ఆయాస పెట్టేశాను.”

“లేదమ్మా, లేదు. ఎంతమాత్రమూ ఆయాసం లేదు. పైగా నాలో నువ్వు ఉత్సాహం నింపావు.”

మార్థిన్ లేచి నుంచుంది. ముసిలాయన చేతులు మర్యాదగా ముద్దాడింది. వెళ్లిపోవడానికి సిద్ధపడింది.

"అమ్మా, మార్థిన్, నిన్నొకటి కోరాలను కుంటున్నాను," ముడతలు పడ్డ దుర్బలమైన తనచేతుల్లోకి అందమయిన ఆమె కోమల హస్తం తీసుకుంటూ అన్నాడు ముసిలాయన — "నిరాకరించ కూడదు నువ్వు. ఏమంటే, పండిన పండున్నేను. ...... ఎప్పుడు రాలిపోతానో తెలియదు. ...... ఏమో, దేవుడు ఎప్పుడు నాదీపం ఆర్పేస్తాడో! ......"

"ఏమి మాటలివి మామయ్యగారూ," బాధపడుతూన్న గొంతుకతో అంది మార్థిన్.

"కాదమ్మా, నిజం అంతేనుగా మరి....."

"ఏమిటి మరి?"

"ఏమీ లేదమ్మా, విను నేను కోరుతూన్న దేమిటంటే నేను చచ్చిపోయాక ఆరబేనుకు నన్ను జ్ఞాపకం చేస్తూవుండాలి నువ్వు. ఇది పసితనం లాంటి తెలివితక్కువ మాటే, కాని ఏం చెయ్యనూ, మనస్సు సరిపడడంలేదు. ఇవాళ డబ్భయి అయిదేళ్లవాణ్ణి నేను. ఇట్టే మరిముప్ఫయి ఏళ్లయే సరికి ఏబిలు నాలాగే అయిపోతాడు. అప్పుడు అన్ని ఆశలూ ఆరబేనుమీదే కదా వుంటాయి! అప్పుడూ? ఆరబేను నన్ను మరిచిపోతే?......"

"ఇలాంటి మాటలు రానివ్వకండి మామయ్యగారూ ఈమాటలు వింటే నాగుండెల్లో దిగులు పట్టుకుంటుంది."

"అమ్మా, తెలివితక్కువవల్ల ఏదో నీతో ఇలాంటిమాటలనేశాను ముసిలాణ్ణి. ఏమీఅనుకోకు. నిజమే. నా పిచ్చిపిచ్చి మాటలు నీ చెవిలో పడకూడదు. ఇదే నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. కాని — కాని, మార్థిక్, మరిచిపోకేం — ఆరబేనుకి నన్ను జ్ఞాపకం చేస్తూవుండు." —

ముసిలాయన గొంతుకు గద్గదిక పడింది.

"మామయ్యగారూ, నేను మీకు మాట ఇస్తున్నాను" నెమ్మదిగా అంది మార్థిన్.

"చాలమ్మా, చాలు. ఇక నువ్వు ఇంటికి వెళ్ళుతల్లీ. ఆలస్యమైపోయింది. ఆఁ, చూడూ, రేపు ఆరబేనుని పంపేం. వాడి కోసం నేనొక మంచి వస్తువు దాచాను."

"రోజూ ఏదో మంచి వస్తువు ఇచ్చి వాణ్ణి చెడగొట్టేస్తున్నారు మామయ్యగారూ!"

"అవును. నువ్వు నిజమే చెపుతున్నావు. కాని నన్ను ఎలా జ్ఞాపకం వుంచుకుంటాడు వాడు చెప్పూ! అయితే, ఇంక ఎన్నో దినాలు ఇలా చెయ్యలేను. ఏమంటావా? జీవన సంధ్యలో చిమ్మచీకట్లు ఆక్రమిస్తున్నాయి." — ఇలా అంటూ ముసిలాయన కోడల్ని ద్వారం దాకా దిగబెట్టడం కోసం లేచి నుంచున్నాడు.

## II

ఓడరేవుని శరత్కాలపు సంధ్య ఆక్రమిస్తోంది. సాయంకాలపు స్వర్ణకాంతి ప్రతిపదార్థమూ బంగారంలో ముంచెత్తి మరీ వొదిలి పెడుతోంది. చిమినీ గొట్టాల్లోంచి పొగలు వస్తు

న్నాయి. అస్తమిస్తూన్న సూర్యుడి కిరణాల కాంతులు ప్రకాశిస్తున్నాయి. ఈ రెండింటి ప్రతిబింబాలూ సముద్రం నీళ్ళలో ప్రతి ఫలిస్తున్నాయి. భవనాల మీద మసక మసక వెలుతురు పడుతోంది. సారాయి మత్తులాగ గాలి ఊగిసలాడు తోంది. వీటన్నిటి తోనూ వృద్ధాప్యంలోని ఆఖరి నిశ్వాసంలా వుంది వాతావరణం.

వాలుకుర్చీలో నిద్రపోతూవున్న డేనియలు మేలుకున్నాడు. లేచి కిటికీ దగ్గిర నుంచున్నాడు. బయటి దృశ్యం చూస్తున్నాడు.

చూసి చూసి, వొక వేడి నిట్టూర్పు వొదిలి పెట్టాడతడు.

ఇవాళకి ఎన్నో ఏళ్లయింది, ఈ రేవులోంచి ఒక వోడ వెళ్ళింది. ఆవోడమీదే డేనియలు ప్రియురాలు వెళ్లిపోయింది. అవాళనించీ పాపం, ఆమెవిషయం ఏమీ తెలియలేదతడికి. తనలో కొత్త జీవనం ఆరంభమవుతుందని ఆసపడి, ఆమె వెళ్ళిపోయిన మూడేళ్ళ తరవాత అతడు పెళ్లి చేసుకున్నాడు. ఒక అవస్థ మరిచి పోవాలంటే ఇంకో అవస్థ సృష్టించుకోడం తప్పని సరే అవుతుంది.

పెళ్ళయింది. పిల్లలు కలిగారు......ఏదో కొంతసుఖమూ లభించింది. కాని తనహృదయంలో నరనరాలా అ ముట్టించి వెళ్ళిన ఆ అమ్మాయిని మాత్రం అతడు మరిచిపోలేక పోయాడు. నిజమే, పాము పొర వొదిలేసినట్టు, మానిషన్న వాడు తన అనుభవాలూ, జ్ఞాపకాలూ వొదిలి పెట్టెయ్యలేడు.

డేనియలు మౌనంగా పడకగదిలోకి వెళ్ళిపోయాడు. మంచం మీద వృత్తి పరుపు పరిచి వుంది. కిటికీలకీ, ద్వారాలకీ రంగు రంగుల పర్దాలు వేలాడు తున్నాయి. కింద గచ్చు మీద రత్న కంబళీ పరచి వుంది. గదిలో రంగుదీపం వెలుగుతోంది. కాని డేనియలు హృదయంలోని రంగుమాత్రం, మాసిపోయి నట్టుంది. మాట్లాడకండా అతడు మేజాబల్లదగ్గిరికి వెళ్ళి నుంచున్నాడు. దాని మీద వున్న చిన్న దంతపుపెట్టె తెరిచాడు. అందులోంచి కొన్ని ఫోటోలు తీశాడు.

అన్నీ వొకక్క అమ్మాయివే, ఫోటోలు. దుస్తులు మాత్రం వేరు వేరు, కాని అదే మొహం. అదే చిరునవ్వు. అవే ముంగురులు. అవే రహస్యజీవనం దాచుకుంటూ వున్న సముద్రం లాంటి గంభీరమయిన సిలి కళ్ళు. పాపం, డేనియలు హృదయ పలకంమీద గాఢమైన ముద్రవేసి నలభై ఏళ్లయి ఎగిరిపోయిందామె.

ఎంతోసేపు రెప్పవెయ్యకండా ఫోటోలు చూస్తూ నుంచున్నాడు డేనియలు. అకస్మాత్తుగా అతడి పెదవులు కదిలాయి.

"యవ్వనవంతుణ్ణి నేను. అవును. ఇప్పుడూ యవ్వనంలోనే వున్నాను."

తరవాత కుర్చీమీద చతికిల బడ్డాడతడు.

ఆలోచనలో మునిగి పోయాడు.

"ఆమె దగ్గిర లేకపోతే క్షణం యుగంలా వుండేది. నలభై ఏళ్లు గడిచాయి, ఆమెలేకండా బతుకుతున్నాను. కాలం మెల్లి

మెల్లిగా కదిలిపోతుంది. చంచలమయిన బాల్యమూ, మళ్ళీ తిరిగి రాని యవ్వనమూ — అన్నీ వెళ్ళిపోతాయి. తరవాత? తరవాత ఎప్పటికీ వెళ్ళిపోని ముసలితనం!......"

ఆలోచనల సుడిగుండంలోంచి వొడ్డుకి చేరుకున్నట్టు, ముసలాయన సముద్రం దిక్కు చూశాడు.

నీలాకాసం కింద నీలిసముద్రం.

ఒడ్డుని వొక ముసిలిపడవమనిషి పడవ మరమత్తు చేస్తు న్నాడు.

దగ్గిరే పాతవీ కొత్తవీ ఎన్నో పడవలు పడివున్నాయి.

సుత్తిదెబ్బలు సూటిగా వచ్చి డేనియలు చెవిలో పడు తున్నాయి.

వాటితోపాటు పడవమనిషి పాటకూడా స్పష్టంగా విని పిస్తోంది.

"ఓడ బాగున్ననాడు
వోడ్డు మాట మరిచినావు.
ఓడ చిల్లడి పోయే వేళ
వోడ్డు వెదికేవా?"

వెళ్ళి పడవమనిషితో మాట్లాడా లనిపించింది డేనియలుకి. కాని ఏదో భయం వేసింది. వెళ్ళలేక పోయాడు.

దగ్గిరేవున్న రాతిబల్ల దగ్గిరికి వెళ్ళి కూచున్నాడు.

పడవ తెడ్డులావున్న వొక పాతకలం తీశాడు.

పూర్వకాలపు పడవలావున్న వొక సిరాబుడ్డిలో ముంచాడు.

ఒక ఉత్తరం ఆరంభించాడు.

ఉత్తరం — మళ్లీ తిప్పి చదివిందికి కాని, పొరపాట్లుంటే సరి చెయ్యడానికి కాని అతడిలో శక్తి లేదు.

ప్రేయసీ,

ఎన్నో ఏళ్ల తరవాత నీకు ఉత్తరం రాస్తున్నాను. ఏమంటే, మనం విడిపోయినప్పుడూ, ఆతరవాతా, ఈక్షణందాకా కూడా, ఎప్పటికయినా నిన్ను చూడగలనన్న ఆశ నన్ను వొదలలేదు.

నాజీవయాత్ర అంతం కావచ్చింది. ఈ ఆఖరిక్షణాల్లో నిన్నే, వొక్క నిన్నే చూస్తూవుంటాను నేను.

జీవనసంగీతం రెండోభాగంలో "జూలీ" నాతో భాగస్తురాలయింది. జీవనం సుఖంగానే గడిచింది. కాని ఆ తెరకూడా లేచిపోయింది. ......

ఇవాళ మరణశయ్యమీంది నిన్ను చూస్తున్నాను. మనుష్యజీవితంలో వొక చిత్రమయిన అవస్థ వస్తుంది. మరణానికి కొద్దిక్షణాలు ముందే వస్తుం దది. ఆ అవస్థలో మనిషి గతించిన జీవితంలోని జ్ఞాపకాలతోనూ, యవ్వనంనాటి అనుభవాలతోనూ దోబూచులాడతాడు.

చచ్చిపోయిన అనంతరం కూడా నీజ్ఞాపకం నన్ను ప్రేతాత్మలాగ చుట్టుకునే వుంటుంది.

నేను మరోరకంమనుష్యుల్ని ఎరుగుదును. 'గతకాలం' అన్న మాట వాళ్లకి నిఘంటువుల్లో మాత్రమే వుంటుంది. అయితే,

అలాంటి తరగతి వాళ్ళలో నేను చేరలేకపోయాను. దయలేని దేవుడు నా బతుకులో, నా ప్రపంచంనిండా, ప్రతీచోటా, ప్రతీ నిమిషమూ గతకాలంలోనే నింపేశాడు.

ఇప్పుడిప్పుడే నేను తేరుకుంటూచూశాను. అవాళ నువ్వు శాశ్వతంగా నన్ను వొదిలేసి నీ భర్తతో వెళ్ళిపోయావు. అదిగో ఆదినం మళ్ళీకళ్ళముందు కట్టినట్టు కనపడింది.

నీకు జ్ఞాపకంవుండే వుంటుంది, అవాళ నల్లటి మేఘాలు కమ్ముకుని వున్నాయి వర్షం కురుస్తోంది. అయినా, ఓడ నిన్ను తీసుకునే వెళ్ళిపోయింది. దూరం, చాలాదూరం, చైనా దేశం మోసుకుపోయింది. అప్పుడు నువ్వు ఇరవయ్యేడేళ్ల దానివి. నేను ముప్ఫయ్యాయిదేళ్ల వాణ్ణి. నేను నిన్ను ప్రేమించాను. కాని నువ్వుమరొకరిసొత్తు వయిపోయావు. ఇవాళ నాకు అవగత మవుతోంది. ఆడది ఎవళ్లని ఎంతప్రేమించినా, భర్తే ఆమె జీవితంలో ముఖ్యపాత్ర వహిస్తాడు.

అప్పుడు నేను ప్రేమప్రవాహంలో ఈతాలాడు తుండేవాణ్ణి. పెళ్లికాని యువకుణ్ణి. నా హృదయంలో ప్రేమ వరదలెత్తేది. ఇవాళ మెరుస్తూన్న భావాలు నలభైఏళ్లకిందట తలలో తల దూర్చి వుంటే భయంతోనిండిన బాటలో ఎంతమాత్రమూ అడుగు పెట్టేవాణ్ణికాను.

నువ్వు వెళ్లిపోయావు, నాప్రపంచం శూన్యమయిపోయింది. ఆశూన్యంతో పోట్లాడడం కోసమే నేను జూలీని పెళ్లిచేసుకున్నాను. అయినా నీకు ఉత్తరాలు రాస్తూనే వుండేవాణ్ణి.

కాలం దయలేంది. ఉత్తర ప్రత్యుత్తరాలికీ అడ్డంకులే వచ్చాయి. అలాఅని మనం పరస్పరం ప్రేమించుకోడం మానేసినట్టుకాదు. నువ్వు శాంఘాయిలో వుండీకూడా నన్ను మరిచిపోలేదు. మన జ్ఞాపకాలు తాజాగానే వుండేవి.

ఈ ఉత్తరం చదివి, (చదవడమంటూ జరిగితేనే) నా ప్రేమలో స్వార్థం వుందని, వొకవేళ నువ్వు అనవచ్చు. నువ్వన్నది నిజమేకావచ్చు. ఏమంటే, స్వార్థంలేని ప్రేమ దేవతలకే వుంటుంది. మనుష్యుల కుండదు. నేను సామాన్యమైన మనుష్యుణ్ణేకదా!

నీ భోగట్టా తరుచు మీ పింతండ్రి కొడుకు నడిగి తెలుసుకుంటున్నాను. మీ అమ్మాయికి పెళ్ళయిందనీ, ఆమె నీ దగ్గిరే వుంటోందనీ వొకసారి విన్నాను. నాకళ్ళఎదట అమ్మాయిని చూస్తున్నాను. నీలా నీలాగేవుంటాను. బంగారంలాంటి జుత్తూ, నీలికళ్లూ, మలిచినట్టు అందమయిన శరీరమూ, నీలాగే పిచ్చెత్తించే చిరునవ్వూ — మూర్తీభవించినట్టులా నువ్వేనువ్వు. —

ఇవాళ నేను వొక్కణ్ణే. ఏచింతా లేదు. నా భార్య జూలీ కూడా చచ్చిపోయింది. నాపనిపాట్లు కొడుకు చూసుకుంటున్నాడు. ఒక మనవడూ వున్నాడు. అయిదేళ్ల వాడు. అందమైన అబ్బాయి. వాణ్ణే నేనిప్పుడు ఆరాధిస్తున్నాను. వాడికి యవ్వనం వచ్చాక వాణ్ణి చూడాలనివుంది. అప్పుడే మీ అమ్మాయి అందంనాకు స్పష్టంగా అవుపిస్తుంది కాని—

చూడూ, ఆర్మాత్రి, మనం విడిపోడానికి ముందు జరిగిన విందు నీకు జ్ఞాపకం వుందా? మనం ఇద్దరమూ కిటికీదగ్గిర నడుస్తూ సముద్రం తట్టుచూశాం. కెరటాలు లేస్తూ పడుతున్నాయి. ఒకదాన్ని వొకటి కొడుతున్నాయి. చంద్రకిరణాలు సముద్రాన్ని ముద్దు పెట్టుకుంటూన్న ప్రదేశమూ మనం చూశాం. వీటన్నిటితో పాటు దూరంనించి వస్తోన్న వోడనీ చూశాం. అదే నాదగ్గిరనించి నిన్ను లాక్కుపోయింది. శాశ్వతముగా మనకి ఎడబాటు చేసేసింది.

నువ్వు నమ్మూ నమ్మకపో—ఇవాళకూడా మనం యవ్వనంలోనే వున్నామనే నమ్ముతున్నాను. నేను ఒకళ్ల నొకళ్లం ప్రేమించు కుంటున్నామనే భావిస్తున్నాను.

నాగది తలుపు తెరుచుకున్నప్పుడల్లా, నువ్వు నాట్యందుస్తులు వేసుకుని, దివ్యమయిన అప్సరసలాగ నాగదిలో అడుగు పెడుతున్నావనే అనిపిస్తుంది నాకు. గదిలో "ఈవినింగ్ ఇన్ పారిస్" పరిమళం నిండిపోతుంది. నీ చిరునవ్వు గదినిండా వెన్నెల వెలిగిస్తుంది. అప్పుడు నేను......

ఊఁ, ఇదంతా గడిచిపోయిన ముచ్చట. అదంతా అయిపోయింది. ఇక నీవేళ్లుకూడా నన్ను తాకవు, ఎన్నటికీన్నీ,—ముద్దుమాట చెప్పేదేముంది!

జీవితం గాలిలా పరుగెత్తుకు పోతుంది. నిన్న ఇక్కడ వున్నావు నువ్వు. మనం కలుసుకున్నాం. మనసిచ్చి ప్రేమ గీతాలు పాడాం. నిన్న నిన్నలాగేవుంది. మధ్య నలభై వసంతాలు వచ్చి వెళ్లిపోయాయి.

ప్రియా,

నువ్వు నాబతుకులో యవ్వనసంగీతం నింపావు. ప్రేమరాగం ఆలాపించావు. నా భార్యాపుత్రులూ కూడా తొలిగించలేక పోయారవి.

నువ్వు వెళ్ళిపోయావు. నీ వెంట నేనూ వెళ్ళిపోయాను. ఇక మిగిలిందేమిటి ?

సంఘం తాలూకు వొక మట్టిబొమ్మ.

ప్రపంచ యంత్రం తాలూకు వొక చిన్న పినర.

నువ్వు వెళ్ళిపోయాక నాజీవనంలో ఆపదలు వచ్చాయి. దుఃఖాలు వచ్చాయి. ఆశలూ, నిరాశలూ ఎన్నోవచ్చాయి. కాని, నీప్రేమ వాటన్నిటినీ గెల్చుకుంది. ఇవాళ వాటన్నిటినీ తరిమేసింది. ఇప్పుడు కేవలం నీప్రేమ వొక్కటే నాఎదట మూర్తిమంతమై నుంచుంది. ఆప్రేమ సంగీతమే నాబతుకులో ఎన్నో ఊహాలూ, ఎన్నో కల్పనలూ రేకెత్తించింది. ఇప్పుడు, ఈక్షణం కూడా అదే నాహృదయంలో కెరటాలు కెరటాలై లేస్తోంది.

దేవీ,

నిర్విచారంగా మరణిస్తున్నాను నేను. నా విచారమంతా వొక్కటే. ఏమిటంటావా ? ఇదిగో నీసౌందర్యమూర్తి నాకళ్ళల్లో సజీవంగా వుంటోంది. ఎప్పుడూ వుంటుంది. అయితే నా మరణం తరవాత ఏమవుతుం దని. ఇదొక్కటే నావిచారం.

నా జీవనంలో సుఖదుఃఖాలు రెండూ నీమూలంగానే వచ్చాయి. రెండింటికోసమూ నీముందు కృతజ్ఞుణ్ణి నేను.

నవ్వు నా ఉత్తరం చదివినప్పుడు నీ చేతులు వణుకుతాయి. అయితే, అది దుఃఖంచేతకాదు; పశ్చాత్తాపం వల్లాకాదు; ప్రేమవల్ల. నవ్వు చిరునవ్వు నవ్వుతావు. నాకు చిరపరిచితమయిన ఆచిరునవ్వు నా ఆఖరి ఉత్తరం చూస్తుంది. యవ్వనం పుట్టిపడుతూన్న చిరునవ్వు అది!

జీవితంలో యవ్వనం తరవాత మిగిలిందేమిటి? యవ్వనం వెళ్ళిపోయిందంటే జీవనం వెళ్ళిపోయిందన్నమాట! యవ్వనం మనం జ్ఞాపకంలోనే భద్రపరుచుకోవాలి చిరకాలం ..... చివరిముద్దు... .

మేజామీద పడిపోయాడు డేనియలు. కలం చేతివేళ్ళలోంచి తుళ్ళిపోయింది.

## III

గంట మోగడంతోటే ముసిలి డేనియలు గదిలోకి కొడుకూ కోడలూ వచ్చారు. వాళ్ళు వచ్చేసరికి ముసిలాయన కళేబరం మంచంమీద పడివుంది. డాక్టరుకి కబురావెళ్ళింది.

వచ్చీరావడంతోటే నిరాశసూచకంగా చెప్పాడు డాక్టరు—
"అంతా అయిపోయింది."

మార్థి వెక్కుతూ అడిగింది,

"డాక్టరు గారూ, — ఎలా జరిగిందంటారు?"

"మానసిక ఉద్రేకంవల్ల గుండె పగిలి డేనియలు గారు కాలంచేశారు"

చెపుతూ చెపుతూ డెత్ సర్టిఫికెటు రాయడం మొదలు పెట్టాడు డాక్టరు.

తండ్రి మృతదేహం ముద్దుపెట్టుకున్నాడు కొడుకు.

వంగి వందనం చేసింది కోడలు.

"పదిగంటలప్పుడు, దీపం ఆర్పడానికి గదిలోకి వచ్చాను నేను. గారు తెలివి తప్పి టేబిలుమీద పడివున్నారు. చాలా రాసి కాయితాలు టేబిలు మీద పడివున్నాయి." — కళ్ల నీళ్లు తుడుచుకుంటూ చెప్పాడు నౌకరు.

"సాయంకాలం బాగానే వున్నారు. నాతో ఎంతో సేపు మాట్లాడారు......" అంటూ వచ్చింది మార్థ

"ఎంతో సాహసవంతుడు నాన్న" టేబులుమీద కాగితాలు తీస్తూ అన్నాడు ఏబిలు. ఉత్తరం పైకిచదివాడు.

ప్రేయసీ, ....."

. నువ్వు వెళ్లిపోయావు. నా ప్రపంచం శూన్యమైపోయింది. ......"

మార్థకూడా ఈ వాక్యాలు వింది.

"ఉత్తరం ఎవరికి రాశారు?"

"తెలియదు. నాన్న యవ్వనంలో ఎవరినో ప్రేమించాడని అమ్మ వొకసారి అంది. — బహుశా ఆమెకే రాసివుంటాడు. — మార్థ, ఈ ఉత్తరం కాల్చెయ్యాలి మనం. నాన్న రహస్యం తెలుసుకునేందుకి అధికారంలేదు మనకి.

మండుతూన్న పొయ్యిలో ఉత్తరం పడేశాడు ఏబిలు.

కాగితం మండింది.

వల్చటి పొగ చిమినీ పైనించి లేచి ఆకాశందిక్కు ఎగిరి పోయింది.

కాగితాల నుసి గాలికెగిరి గదిలో అటూ ఇటూ చెదిరి పడింది.

తండ్రి మృతకళేబరం కేసి చూశాడు ఏబిలు. ఉత్తరంలోని మాటలు గుండెల్లో కెగిరాయి.

“ఇక మిగిలిం దేమిటి ?

సంఘం తాలూకు వొక మట్టిబొమ్మ

ప్రపంచ యంత్రం తాలూకు చిన్నపిసర.”

తనలో తాను గొణిగాడు ఏబిలు.

“ఏమీ తెలుసుకోలేక పోయాను. నాన్నని గుర్తించనే లేక పోయాను. ఎవడికి తెలుసు, ఆరబేనుకూడా వోనాడు నాగురించి ఇలాగే అనుకో వచ్చు.

మళ్లీ వొకసారి తండ్రిదిక్కు చూశాడతడు.

గంభీరమయిన తండ్రికళ్లు, తెల్లని గడ్డాం నీడలోంచి నవ్వుతున్నాయి.

మార్థీ ఏడుస్తూ ఏబిలు భుజాల మీద చేతులు వేసింది.

ఒకరి మొహం వొకరు చూశారు వాళ్లు.

వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టారు.

“అయ్యో, దేవుడా, నాతండ్రినే నేను తెలుసుకో లేక పోయాను” — ఏడుస్తూ అన్నాడు ఏబిలు.

---

సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరము